అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 7-1-2018 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 10 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు + సోపతి వెల : 6.00

స్మార్ట్ చోరీ...



స్మార్ట్ ఫోన్లను టార్గెట్ చేసి వణికిస్తున్న వైరస్

- 232 బ్యాంకింగ్ యాప్స్‌పై సైబర్ దాడి..!
- బాధిత జాబితాలో భారత బ్యాంకులు
- లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ తస్కరించే యత్నం
- హ్యాకర్స్ బారిన పడితే మీ అకౌంట్‌లోని సొమ్మంతా మాయం..!!





నవతెలంగాణ డెస్క్

ఆండ్రాయిడ్ ఫోన్ల వినియోగదారులను మరో కొత్త వైరస్ వణికిస్తోంది. డిజిటల్ లావాదేవీల కోసం ఉపయోగించే బ్యాంకింగ్ యాప్స్‌పై ఈ మాల్‌వేర్ దాడి చేసి వ్యక్తిగత డేటాను దొంగిలిస్తోంది. దీని బాధితుల జాబితాలో 232 బ్యాంకులు చేరాయని, అందులో కొన్ని భారతీయ బ్యాంకులు కూడా ఉన్నాయని క్విక్‌హీల్ సెక్యూరిటీ ల్యాబ్స్ తెలిపింది. సైబర్ దాడికి పాల్పడుతున్న ఈ వైరస్‌ను 'ఆండ్రాయిడ్. బ్యాంకర్.ఏ9480'గా నామకరణం చేశారు. ఏదైనా డౌన్‌లోడ్ చేస్తున్నపుడు థర్డ్‌పార్టీ స్టోర్స్ నుంచి ఫేక్ ఫ్లాష్ ప్లేయర్ యాప్ ద్వారా ఈ మాల్వేర్ చొరబడుతుంది.

ఒకసారి ఈ యాప్ మొబైల్‌లోకి ఇన్‌స్టాల్ అయితే మీ ఐకాన్‌ను కనిపించకుండా చేస్తుంది. 232 బ్యాంకుల్లో ఏ యాప్ మీ మొబైల్‌లో ఉందో ఆ యాప్‌ని అది టార్గెట్ చేస్తుంది. ఆ తర్వాత మీకు ఎస్ఎంఎస్‌లు పంపడం,మీ నుంచి తీసుకోవడం ...9లో



లాలూకు మూడున్నరేండ్లు జైలు




రూ.ఐదు లక్షల జరిమానా

- ఎట్టకేలకు శిక్ష ఖరారు
- దాణా కుంభకోణం...మరో కేసులో

ఆర్జేడీ అధినేతకు కారాగారవాసం

రాంచీ : బీహార్ మాజీ ముఖ్యమంత్రి, రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జేడీ) అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు రాంచీలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం మూడున్నర సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 5 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు ప్రకటించింది. అవినీతి నిరోధక చట్టం కింద నేరపూరిత కుట్ర చేశారన్న అభియోగంపై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ శివపాల్ సింగ్ ఈ శిక్షను వెల్లడించారు.మూడు రోజులుగా వాయిదా పడుతూ వస్తున్న ఈ శిక్షల ఖరారును చివరికి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి ప్రకటించారు. 1990-94 మధ్య కాలంలో దేవగఢ్ ట్రెజరీ కార్యాలయం నుంచి రూ. 89.27 లక్షల నిధుల వినియోగం విషయంలో దాఖలైన కేసులో లాలూతో పాటు మొత్తం 11 మందికి శిక్షలు ప్రకటించింది. లాలూకు మూడు సంవత్సరాలకన్నా తకువ శిక్ష పడి ఉంటే అప్పటికప్పుడే ఆయన బెయిల్ కోసం అదే కోర్టులో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు ఆయన బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించవలసి ఉంది. లాలూ కుమారుడు తేజస్వీ యాదవ్ అదే విషయాన్ని పరిశీలిస్తున్నట్టు ప్రకటించారు. ఆయనపై గతంలో విచారణ జరిగిన రూ. 33.61 కోట్ల దుర్వినియోగం కేసులో (2013లో) లాలూకు అయిదేండ్ల జైలు శిక్ష పడిన విషయం తెలిసిందే. పశువుల దాణా కుంభకోణంలో భాగమైన మరో మూడు కేసులు - దుంకా ట్రెజరీ నుంచి రూ. 3.97 కోట్ల అక్రమ చెల్లింపు, చైబసా ట్రెజరీ నుంచి రూ. 36 కోట్ల దుర్వినియోగం,...9లో



ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేయాలి

నేరెళ్ల బాధితుల సంఘీభావ పాదయాత్ర, సభలో ప్రజాసంఘాల నేతలు



పాదయాత్రలో పద్మ,డిజీ,తమ్మినేని, కోదండరామ్,చాడా, తదితరులు

9

12 నుంచి సంక్రాంతి సెలవులు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ఈనెల 12నుంచి 16వరకు పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఇచ్చినట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్ శనివారం తెలిపారు. అకాడమిక్ క్యాలెండర్ షెడ్యూల్ ప్రకారం తిరిగి 17న పాఠశాలలు పునర్ ప్రారంభం అవుతాయని చెప్పారు. ఐదురోజుల పాటు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు సెలవులు పాటించాలని కోరారు. ముందస్తుగా బడులకు సెలవులు ఇస్తున్నట్టు వస్తున్న వార్తలను ఆయన కొట్టిపడేశారు. సెలవుల్లో క్రిస్టియన్ మైనార్టీ పాఠశాలలకు కొంత మినహాయింపు ఉందనీ తెలిపారు.

కాంగ్రెస్‌లోకి టీఆర్ఎస్ నేత

- మాజీ ఎమ్మెల్సీకి కండువా కప్పి స్వాగతించిన రాహుల్

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

టీఆర్ఎస్ ఖమ్మం నేత, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా, రాజ్యసభ ఎంపీ రేణుకాచౌదరీ సమక్షంలో శనివారం ఢిల్లీలో రాహుల్‌గాంధీ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఆయనతో పాటు వైరా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాలోతురాందాస్ నాయక్, జూలురుపాడు, సింగరేణి మండలాలకు చెందిన పలువురు టీడీపీ, టీఆర్ఎస్ నేతలు ఈ సందర్భంగా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. దళితులకు మూడెకరాల భూమి, కేజీ టు పీజీ విద్య సహా ప్రభుత్వం హామీలు నెరవేర్చడం లేదని, అందుకే టీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి చేరానని నాగేశ్వరరావు చెప్పారు.

ఉపాధికోల్పోయే వారి గోస వినండి

భూసేకరణ జరిపేటపుడు రైతులతో పాటుగా : సర్కారుకు హైకోర్టు ఆదేశం



(ఫైల్)

హైదరాబాద్ : భూసేకరణ చేయదలిచ్చినప్పుడు రైతులే కాకుండా భూసేకరణ వల్ల ఉపాధి కోల్పోయే వారి అభ్యంతరాలను కూడా అధికారులు తెలుసుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి రాజశేఖర్‌రెడ్డి తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించారు. సిద్దిపేట జిల్లా తోగుట మండలం వేములఘాట్ గ్రామంలో మల్లన్నసాగర్ ప్రాజెక్టు కోసం జరిపే భూసేకరణలో అధికారులు తమ అభ్యంత రాలను తెలుసుకోవడం లేదంటూ ఎల్లవ్వ మరో పాతిక మంది హైకోర్టులో రిట్ వేశారు. రైతులు/ప్రభావితులైన వారి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నాకే భూపరిహార చెల్లింపుపై విచారణ చేయాలని, ముందే భూపరిహార చెల్లింపుపై విచారణ చేయడానికి వీల్లేదని ...9లో

ప్రేమించాడు.. నిప్పుపెట్టాడు

బెంగళూరులో దారుణ ఘటన 2

ప్రకాశ్ రాజ్ కాలమ్‌కు బ్రేక్

- నిలిపివేసిన కన్నడ వార్తాపత్రిక
- అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రకాశ్‌రాజ్



బెంగళూరు : తన సన్నిహిత స్నేహితురాలు గౌరీ లంకేశ్ హత్య జరిగిననాటి నుంచి హిందూత్వ రాజకీయాలపై సామాజిక మాధ్యమం, మీడియా వేదికగా తరచుగా విమర్శలు చేస్తున్న ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్ కాలమ్‌ను ప్రముఖ కన్నడ వార్తా పత్రిక ఉదయవాణి నిలిపివేసింది. ఉదయవాణి పత్రికలో ప్రతీ శనివారం ప్రకాశ్ రాజ్ కాలమ్‌ను గత కొన్ని నెలలుగా ప్రచురిస్తున్నారు. ఉదయవాణి వార్తాపత్రిక తీసుకున్న నిర్ణయంపై ప్రకాశ్ రాజ్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ ట్వీట్ చేశారు. రాజకీయ, అభివృద్ధి, ఇతర వర్తమాన అంశాలపై ...9లో

ఆలుగడ్డ రైతుల ఆగ్రహం

- ఉత్తరప్రదేశ్‌లో రైతుల నిరసన
- ముఖ్యమంత్రి నివాసం,అసెంబ్లీ ముందు పంట పారబోసి ఆందోళన

9





మనం చేసిన పనులు మామూలువా సార్.. తరతరాలు గుర్తుండేవి..!!

భారం లేని పెట్టుబడి పథకం

కలిసిరానున్న కేంద్రం నిధులు- రైతులను దగ్గర చేసుకునే ప్రయత్నాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతులకు ఈ ఏడాది నుండి అమలు చేయబోతున్న పెట్టుబడిపథకం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై పెద్దగా భారం పడబోదు అని తెలుస్తోంది. ఖరీప్‌లో ఎకరానికి నాలుగు వేలు, రబీలో నాలుగువేలు చొప్పున ఎనిమిది వేల రూపాయలను ప్రభుత్వం రైతులకు అందజేయనుంది. దీనికి సంబంధించి ఎనిమిది వేల కోట్ల రూపాయలు అవసరం అవుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. ఎంతో ఖర్చు పెట్టి పెట్టుబడి పథకాన్ని అమలు చేయడానికి సిద్ధమవుతున్నామని, వ్యవసాయం దండగ కాదు. పండుగ అని నిరూపించబోతున్నామని మంత్రులు తెలిపిన విషయం తెలిసిందే. లక్ష రూపాయల రుణమాఫీ కింద నాలుగేండ్లుగా ప్రభుత్వం నాలుగున్నరవేల కోట్ల రూపాయలను చొప్పున కేటా యించింది. 2017లో రుణమాఫీ పూర్తయిందని ముఖ్య మంత్రి కేసీఆర్, వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఆ డబ్బులనే తిరిగి ఈ ఏడాది పెట్టుబడి పథకం కింద బడ్జెట్‌లో కేటాయించనున్నది.పెట్టుబడి పథకం ఎకరానికి రూ. 4 వేల చొప్పున రూ.5280 కోట్లు అవుతుంది. ఇందులో రూ. 4250 కోట్లు పోగా మిగిలింది రూ. 1030 కోట్లు మాత్రమే ప్రభుత్వం అదనంగా భరించాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే కేంద్ర ప్రభుత్వం నుంచి ఎకరానికి రూ. 2800 చొప్పున రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల చేస్తుంది. ఈ విధంగా పరిశీలించిన ఎకరానికి రూ. 1200 కోట్లు మాత్రమే ప్రభుత్వం భరించాల్సి ఉంటుందని నిపుణులు, శాస్త్రవేత్తలు తెలిపారు. 2018-19 సంవత్సరానికి గాను రుణమాఫీ లేదు గనుక ఈ నిధులనే రైతులకు పెట్టుబడి కింద ఉపయోగించేందుకు ప్రభుత్వం ప్రణాళిక తయారు చేసింది. వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి రూ. 10 వేల కోట్లతో వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెడుతున్నట్టు ...9లో





హజ్ పాలసీపై వివరణ ఇవ్వండి

- కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు



న్యూఢిల్లీ: హజ్ యాత్ర కోసం రాష్ట్రాలకు సీట్ల కేటాయింపుపై వివరణ ఇవ్వాలంటూ కేంద్రప్రభుత్వానికి భారత సరోన్నత న్యాయస్థా నం ఆదేశాలు జారీ చేసింది. హజ్ పాలసీకి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ప్రతి ఏటా 1.7లక్షల మంది హజ్ యాత్రికులకు పంపేందుకు కేంద్రానికి యూఏఈ ప్రభుత్వం అనుమతి నిచ్చిందని కేరళ హజ్ కమిటీ తన పిటిషన్‌లో పేర్కొన్నది. ఈ సీట్ల కేటాయింపులో కొన్ని రాష్ట్రాలకు అన్యాయం జరిగిందని తెలిపింది. ఉదాహరణగా.. బీహార్‌కు 12 వేల సీట్లను కేటాయిస్తే.. దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 6 వేలు మాత్రమేనని వెల్లడించింది. అదే కేరళలో 95 వేల మంది దరఖాస్తు చేసుకుంటే 6 వేల సీట్లు మాత్రమే కేటాయించినట్టు చెప్పింది. దీనిపై చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంపై రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని కేంద్రాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది.

రాహుల్‌కు ప్రివిలైజ్ నోటీసు

న్యూఢిల్లీ : రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి శనివారం ప్రివిలైజ్ నోటీసును లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌కు పంపారు. రాహుల్‌పై తదుపరి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయన నోటీసు పంపారు. రాహుల్ గాంధీ దిగువసభ సభ్యుడైనందున ఆయనపై తదుపరి చర్య తీసుకోవాలని కోరుతూ వెంకయ్య నాయుడు నోటీసు పంపినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. రాహుల్ గాంధీపై ఇప్పటికే ఒక ఫిర్యాదు లోక్‌సభ ఎథిక్స్ కమిటీ వద్ద పెండింగ్‌లో ఉంది. రాజ్యసభ అధికారాన్ని, దాని నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ రాహుల్ గాంధీ ఒక ట్వీట్‌చేశారు. దీనిపై బిజెపి నేత, రాజ్యసభ సభ్యుడు భూపిందర్ యాదవ్ రాహుల్‌కు ప్రివిలైజ్ నోటీసు జారీ చేశారు. రాహుల్ గాంధీ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని కించపరిచే విధంగా మాట్లాడారని ఇది సభా హక్కుల ఉల్లంఘనే అని యాదవ్ పేర్కొన్నారు.

వెలువడిన త్రిపుర తుది ఓటర్ల జాబితా

అగర్తలా : త్రిపుర తుది ఓటర్ల జాబితా ప్రచురితమైంది. 25,69,216 ఓటర్ల పేర్లతో ఈ జాబితాను వెలువరించినట్టు ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) టి.శ్రీరామ్ తెలిపారు. మొట్టమొదటిసారిగా స్త్రీ, పురుషులు కాకుండా థర్డ్ జెండర్ (హిజ్రా)కు అవకాశాన్ని కూడా ఈ జాబితాలో పొందుపరిచామన్నారు. ఈ కేటగిరీలో 11మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారని చెప్పారు. మిగిలిన 25,69,205మందిలో పురుషులు 13,03,420 కాగా, మహిళలు 12,65,785మంది. రాష్ట్రంలోని వివిధ వర్గాల నుండి వచ్చిన అభ్యంతరాలన్నీ పరిశీలించిన మీదట శుక్రవారం తుది జాబితాను ప్రచురించారు. ఈ ఏడాది మొదటి అర్ధ భాగంలో త్రిపుర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఓటర్ల జాబితా సవరణ సందర్భంగా 98,064మంది ఓటర్లను తొలగించారు. మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకునేవారు 47,800మంది వున్నారు. మొత్తంగా 60 స్థానాల్లో బాదర్‌ఘాట్ అసెంబ్లీ నియోజకవర్గంలో గరిష్ట సంఖ్యలో 57,394మంది ఓటర్లుండగా, కార్బక్ నియోజకవర్గంలో అత్యల్పంగా కేవలం 34,699మందే వున్నారు. రాష్ట్రంలోని 3,214 పోలింగ్ కేంద్రాల్లో, తహసిల్ కార్యాలయాల్లో, ఓటర్ల నమోదు కార్యాలయాల్లో ఈ ఓటర్ల జాబితా అందుబాటులో వుంటుందని సిఇఒ తెలిపారు. ఓటర్ల ఫోటో గుర్తింపు కార్డులు అందరికీ అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

స్వల్పంగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

న్యూఢిల్లీ: పెట్రోల్, డీజిల్ ధరలు స్వల్పంగా పెరిగాయి. లీటరు పెట్రోల్‌పై 14 పైసలు, డీజిల్‌పై 20 పైసలు పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. ప్రస్తుత ధరల ప్రకారం ఢిల్లీలో పెట్రోల్ ధర లీటర్‌కు 70.13 రూపాయలు డీజిల్ ధర 60.12 రూపాయలుండగా, హైదరాబాద్‌లో రూ. 74.26, రూ.65.31గా ఉంది. శనివారం పెరిగిన ధరలతో కలిపి ఈ ఆరు రోజుల్లోనే డీజిల్‌పై 60 పైసల వరకు పెరిగింది. ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న ముడిచమురు ధరల దృష్ట్యా... వీటి ధరలు పెరుగుతున్నాయని ఆయిల్ కంపెనీలు చెబుతున్నాయి. గతేడాది జూన్ 16 నుంచి రోజువారీ ధరల్ని పెంచే పద్ధతిని ఆయిల్ కంపెనీలు ప్రవేశపెట్టాయి. అప్పట్నుంచి ధరలు పెరుగుతూనే ఉన్నాయి.

యూపీలో సామూహిక లైంగికదాడి

భర్తను, మరిదిని నిర్బంధించిన సాయుధులు

బండా(ఉత్తరప్రదేశ్) : బండా ప్రాంతంలోని భదవాల్ గ్రామ సమీపంలోని అడవిలో ఒక మహిళ సామూహిక లైంగికదాడికి గురైంది. ముగ్గురు సాయుధులు ఆమెపై అత్యాచారం జరిపారు. ఆమె భర్తను, మరిదిని తుపాకీతో బెదిరించి నిర్బంధించారు. అనంతరం ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. బాధితురాలు తన కుటుంబ సభ్యులతో కలిసి బండా–చిత్రకూట్ సరిహద్దులోని ఒక నదిని దాటుతుండగా ఈ సంఘటన జరిగిందని వారు తెలిపారు. చిత్రకూట్ జిల్లాకు చెందిన బాధితురాలు తన బంధువులను కలుసుకునేందుకు భర్త, మరిదితో కలిసి శుక్రవారం గౌరిఖాన్‌పూర్ గ్రామానికి వచ్చిందని అడిషనల్ పోలీస్ సూపరింటెండెంట్ లాల్ భరత్ కుమార్ పాల్ తెలిపారు. వారు తిరిగి స్వగ్రామానికి చేరుకుంటున్న సమయంలో భదవాల్ గ్రామ సమీపంలో సాయుధులు వారిని నిర్బంధించారని ఆయన చెప్పారు. సమీప అడవిలో ఉన్న ఒక గుడిసెలోకి తీసుకెళ్ళి ఆమె పై అత్యాచారం జరిపారని పాల్ తెలిపారు. ఘటన అనంతరం దుండగులు అక్కడ నుంచి పారిపోయారని చెప్పారు ఈ సంఘటనకు సంబంధించి అందిన ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురు దుండగులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని తెలిపారు. దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారని, బాధితురాలని వైద్య పరీక్షలకు పంపామని ఆయన వెల్లడించారు.

సూరంపల్లిలోని జీఎస్ ఎల్లాయిస్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం...

గన్నవరం : కృష్ణా జిల్లా గన్నవరం మండలం సూరంపల్లిలోని జీఎస్ ఎల్లాయిస్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఒకరు మ తి చెందగా..మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సూర్యోదయంతో చలినుంచి తేరుకున్న జమ్ము

జమ్ము : వరుసగా రెండో రోజు కూడా సూర్యుడు ప్రకాశించడంతో శనివారం నగరంలో 5.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయ్యింది. దీంతో ప్రజలు చలి నుంచి కొంత ఉపశమనాన్ని పొందుతున్నారు. ఈ చలికాలంలో కనిష్ట ఉష్ణోగ్రత 2.7డిగ్రీల సెల్సియస్‌గా గత గురువారం నమోదయ్యింది. గత రాత్రితో పోల్చుకుంటే నగరంలో కనిష్ట ఉష్ణోగ్రత 1.6 డిగ్రీలు తగ్గి, 5.1 డిగ్రీల సెల్సియస్ వద్ద స్థిరపడిందని భారత వాతావరణ విభాగ అధికారి పేర్కొన్నారు. ఈ సీజన్‌లో గురువారం అత్యల్పంగా 2.7 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా, శుక్రవారం నాలుగు డిగ్రీలు పెరిగిందన్నారు. ఈ సీజన్‌లో సాధారణ కంటే 1.8 డిగ్రీల ఎక్కువగానే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని ఆయన పేర్కొన్నారు. జమ్మూలోని అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా తేలికపాటి హిమపాతం నమోదయిందని, దీని ఫలితంగా భదేర్వా, బనిహాల్ ప్రాంతాల్లో సున్నా కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయన్నారు. దోడ జిల్లాలో భదేర్వా అత్యంత శీతల ప్రాంతంగా నమోదయ్యిందని, ఇక్కడ మైనస్ 1.8 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యిందన్నారు. బనిహాల్‌లో ఉష్ణోగ్రత మైనస్ 0.2 డిగ్రీల సెల్సియస్ వద్ద ఉందన్నారు. రేషాయ్ జిల్లాలోని వైష్ణోదేవీ పుణ్యక్షేత్రాన్ని సందర్శించే యాత్రికుల కోసం బేస్ క్యాంపుగా ఉన్న కత్రా పట్టణంలో ఉష్ణోగ్రత జమ్మూ నగరానికి కంటే కొంచెం మెరుగ్గా ఉందని పేర్కొన్నారు.

హజ్ యాత్రకు ఇక కాషాయదుస్తులతో వెళ్ళాలా?

- కార్యాలయానికి ఆ రంగు వేయడంపై ముస్లిం పెద్దలు ఆగ్రహం
- నిరసనలతో దిగొచ్చిన యోగి సర్కార్



లక్నో : లక్నో హజ్ కమిటీ కార్యాలయానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కాషాయ రంగు వేయించడంపై రగడ రాజుకుంది. హజ్ కమిటీ ఆఫీసులకు కూడా అధికారులు కాషాయం రంగు వేయడంపై ఇస్లాం మత పెద్దలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రాత్రికి రాత్రే ఆయా కార్యాలయాల గోడల రంగును మార్చేయటంతో అది తీవ్ర స్థాయికి చేరుకుంది. ఇది వివాదాస్పద నిర్ణయనీ, దానిని ఖండిస్తున్నామని లక్నో హజ్ కమిటీ అధికారి షాహర్ ఖాజీ మౌలానా విమర్శించారు. సాధారణంగా ఈ రంగు రాజకీయాల కోసం వాడేది. ఇలాగే చూస్తూ ఊరుకుంటే రేపు హజ్ యాత్రికులను కూడా కాషాయపు దుస్తులు ధరిం చాలని షరతులు విధిస్తారా? అని ఆయన ప్రశ్నించారు. తక్షణమే ఈ నిర్ణ యం వెనక్కి తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హజ్ కమిటీ సభ్యులు హెచ్చరిస్తున్నారు. ఇక షియా పర్సనల్ లా బోర్డు సభ్యుడు మౌలానా యాసుబ్ అబ్బాస్ కూడా యోగి ప్రభుత్వ చర్యను తప్పుబట్టారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఇలా రంగులు మారుస్తారా? అంటూ ప్రశ్నిం చారు. మనోభావాలను దెబ్బతీసే ఇలాంటి చర్యలను మానుకోవాలన్నారు. ఈ కార్యాలయానికి అంతకు ముందు తెలుపు రంగు ఉండేది.

రంగు మారింది...

కాగా, యూపీ ప్రభుత్వ వివాదాస్పద నిర్ణయంతో పలు వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో ఎట్టకేలకు యోగి దిగొచ్చారు. హజ్ హౌస్‌కు వేసిన కాషాయ రంగు స్థానంలో పసుపు రంగు వేయించింది.



17న స్కీం వర్కర్ల దేశవ్యాప్త సమ్మె

- పిలుపునిచ్చిన కార్మిక సంఘాలు
- 30న జైల్ భరో ఆందోళన్



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జైల్ భరో ఆందోళన్ (సామూహిక అరెస్టులు) చేపట్టాలని పలు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. న్యూఢిల్లీలోని ఏఐటీయూసీ భవన్‌లో శనివారం కార్మిక సంఘాల ఉమ్మడి సమావేశం జరిగింది. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ న్యూఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్‌లో ఈ నెల 30న సామూహిక అరెస్టులకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి.

దాదాపు 10 కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 17న దేశ వ్యాప్తంగా స్కీం వర్కర్లు తమ డిమాండ్ల సాధనకై సమ్మె జరపనున్నారు. ఈ సమ్మెలో 50 లక్షల మందికి పైగా స్కీం వర్కర్లు పాల్గొననున్నారు. స్కీం వర్కర్ల డిమాండ్లు

1. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి వారికి వర్తించే హక్కులు కల్పించాలి
2. సామాజిక భద్రత కింద ఇపిఎఫ్, ఇఎస్ఐ వంటి పథకాలను వర్తింప చేయాలి. నెలకు రూ.3 వేలు తక్కువ కాకుండా పెన్షన్ వర్తింప చేయాలి
3. కనీస వేతనం నెలకు. రూ. 18 వేలు తక్కువ కాకుండా ఉండాలి
4. పథకాలను ప్రయివేటీకరణ చేయకూడదు. తదితర డిమాండ్లతో స్కీం వర్కర్లు సమ్మెబాట పట్టనున్నారు.

స్కీమ్ వర్కర్లు జరపనున్న సమ్మెకు ఈ సందర్భంగా కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాయి. అంగన్‌వాడీ, మిని–అంగన్‌వాడీలు, సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకం(ఐసీడీఎస్), మధ్యాహ్న భోజన పథకం, జాతీయ ఆరోగ్య మిషన్, నేషనల్ రూరల్ లైవ్లీహుడ్స్ మిసన్, జాతీయ బాల కార్మికుల ప్రాజెక్టు, సర్వశిక్ష అభియాన్, చిన్నమొత్తాల పొదుపు పథకం తదితర పథకాలకు చెందిన కార్మికులందరూ ఈ నెల 17న జాతీయ స్థాయిలో సమ్మె నిర్వహించనున్నారు. అత్యధిక కార్మికులకు భాగస్వామ్యం కల్పిస్తూ జిల్లా స్థాయిలో కూడా జైల్ భరో కార్యక్రమాలు జరుగుతాయని, అదే క్రమంలో స్కీం వర్కర్ల సమ్మె కూడా కొనసాగుతుందని సిఐటియు జాతీయ కార్యదర్శి తపన్‌సేన్ తెలిపారు.

ఉమ్మడి కార్మిక సంఘాల కేంద్ర కమిటీ నిర్ణయించిన మేరకు నిరవధిక సమ్మెకు వెళ్ళడానికి ముందు దేశ వ్యాప్తంగా మరిన్ని ఆందోళనలు, సమ్మెలు జరుగుతాయని ఆయన తెలిపారు.

ఈ మొత్తం వ్యవస్థకు ఆశా, మధ్యాహ్న భోజన పథకం కింద పనిచేస్తున్న హెల్పర్లు వెన్నెముకలాంటి వారని, ఈ పథకాలను ముందుకు తీసుకెళ్ళడంలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారని అటువంటి వారికి చాలా ప్రదేశాలలో కేవలం నెలకు రూ.15 వందలు మాత్రమే వేతనంగా చెల్లిస్తున్నారని, ఇది చాలా అన్యాయమని ఏఐసీటీయూకుకు చెందిన శ్వేతరాజ్ తెలిపారు. వారికి వేతనంగా నెలకు రూ.18 వేలు చెల్లించాలన్నది తమ డిమాండని పేర్కొన్నారు.

హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎమ్ఎస్)కు చెందిన నారాయణసింగ్ మాట్లాడుతూ మహాపడవ్ కార్మికులు నిర్వహించిన మూడు రోజుల సమ్మె మోడీ ప్రభుత్వాన్ని వణికించిందన్నారు. గత ఏడాది డిసెంబరులో లక్షలాది మంది కార్మికులు ఢిల్లీ చేరుకుని మహాపడవ్‌లో పాల్గొన్నారన్నారు. వేతనాల పెంపుపై తక్షణమే దృష్టి సారించాలని, ధరలు నియంత్రించాలని, విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం, సంక్షేమంపై కోతలు తదితరాలపై దృష్టి సారించాలని, ప్రైవేటీకరణ విధానాలను ఆపివేయాలని డిమాండ్‌చేసినట్లు ఆయన చెప్పారు. కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని, ఉద్యోగాలు నష్టపోకుండా చూడాలని కూడా వారు కోరినట్లు ఆయన చెప్పారు. దీనిపై తపన్‌సేన్ మాట్లాడుతూ ప్రధాన మీడియా ఛానల్స్‌పూర్తిగా అడ్డుకున్నప్పటికీ, మహాపడవ్ సందేశం దేశవ్యాప్తంగా విస్తరించిందన్నారు. ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్ళడానికి కార్మికులు ఎంతో ఉత్సాహం ప్రదర్శించారన్నారు. సీఐటీయూ, ఏఐసీసీటీయూ, ఏఐటీయూసీ, హెచ్ఎమ్ ఎస్‌తో పాటు ఇతర కార్మిక సంఘాలు ఏఐయూటీయూసీ, టీయూసీసీ, ఐఎన్‌టీయూసీ, ఎస్ఇడబ్ల్యుఏ, యూటీయూ యూసీ, ఎల్‌పీఎఫ్, ఎంఈసీ ఢిల్లీలో జరిగిన సమావేశంలో పాల్గొన్నాయి.

ప్రేమించాడు.. నిప్పుపెట్టాడు..

యువతి సజీవ దహనం యత్నం

- బాధితురాలి పరిస్థితి విషమం
- బెంగళూరులో దారుణ ఘటన



బెంగళూరు: ప్రేమించానన్నాడు.. మాయమాటలు చెబుతూ ఆమె చుట్టూ తిరిగాడు. పెండ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెను లోబర్చుకున్నాడు. తీరా ఆమె గర్భవతి అని తెలిశాక... పెండ్లి చేసుకోమని ఆమె ఒత్తిడి చేసింది. అంతే కిరోసిన్‌పోసి నిప్పుపెట్టాడు. ఈ దారుణం కర్నాటకలోని గదగ్ జిల్లాలో చోటు చేసుకుంది. గదగ్ జిల్లాలోని శింగటాలూర గ్రామానికి చెందిన ప్రకాష్ ముండవాడ, అదే గ్రామానికి చెందిన బాధిత యువతితో ఐదేళ్లుగా ప్రేమాయణాన్ని సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే బాధిత యువతి గర్భందాల్చింది. విషయం తెలిసిననాటి నుంచి తనను పెండ్లి చేసుకోవాల్సిందిగా ఆమె ప్రకాష్‌ను వెంటపడుతోంది. దీంతో ప్రకాష్ ఆమెను దూరం పెడుతూ వచ్చాడు. తనను వివాహం చేసుకోవాల్సిందేనని బాధిత యువతి తన తల్లితో కలిసి శుక్రవారం సాయంత్రం ప్రకాష్ ఇంటి ముందు బైఠాయించింది. ఈ క్రమంలో ప్రకాష్, అతని కుటుంబ సభ్యులు బాధిత యువతి ఒంటిపై కిరోసిన్ పోసి నిప్పంటించి పరారయ్యారు.

స్థానికులు అప్రమత్తమై మంటలను ఆర్పి బాధితురాలిని గదగ్ జిల్లాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న స్థానిక పోలీసులు పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నారు.

గోల్డ్ మెడల్స్‌తో బెంగళూరు వర్సిటీ బేరాలు!

- విద్యార్థులను డబ్బులివ్వాలంటున్న వైనం

బెంగళూరు: గోల్డ్ మెడల్‌కు ఉన్న ప్రాముఖ్యత ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కానీ, దానికున్న విలువను దిగజార్చి బెంగళూరు యూనివర్సిటీ అప్రతిష్ట పాలైంది. గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేయదలచుకునే విద్యార్థులు రెగ్యులర్ ఫీజుకు అదనంగా రూ.500 ఇవ్వాలంటూ వర్సిటీ యాజమాన్యం ఆదేశాలు జారీ చేయడం వివాదాస్పదమవుతున్నది. గోల్డ్ మెడల్ కోసం డబ్బులేంటని విద్యార్థులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. 'ఏ చిన్న కార్యక్రమం జరిగినా వర్సిటీ సిబ్బంది.. భోజనం, టీ, బిస్కట్ల కోసం వేలాది రూపాయలు వృథా ఖర్చు చేస్తున్నారు. కానీ, గోల్డ్ మెడల్స్‌కు మాత్రం డబ్బులు లేవంటున్నారు. వర్సిటీ తీసుకున్న ఏ నిర్ణయమైనా వివాదాస్పదంగానే ఉంటుంది. గోల్డ్ మెడల్స్‌కు డబ్బులివ్వాలంటూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి' అని లా ఫైనలియర్ చదువుతున్న ఒక విద్యార్థి డిమాండ్ చేశారు. వర్సిటీ నిర్ణయం హాస్యాస్పదంగా ఉందని యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్, బెంగళూరు నుంచి ఇటీవల గోల్డ్‌మెడల్ సాధించిన హారతి అన్నారు. వర్సిటీ చర్య విద్యార్థులను అవమానపరిచేలా ఉన్నదని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ ప్రోగ్రాం హెడ్ నిరంజనరాధ్య అన్నారు. 'విద్యార్థుల ప్రతిభకే ప్రాధాన్యమిచ్చే వారైతే డబ్బులు అడగడం సరికాదు. ప్రతిభావంత విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ఇవ్వడం కోసం వర్సిటీ యాజమాన్యం కొంత డబ్బు ఖర్చు పెడితే ఏమవుతుంది? ఒకవేళ వర్సిటీలో నిధుల కొరత ఉన్నట్లయితే.. గోల్డ్ మెడల్స్ ఇవ్వడం నిలిపివేయాలి' అని ఆయన.. మీడియాకు తెలిపారు.

మీసా భారతిపై రెండో ఛార్జిషీటు

ఫిబ్రవరి 5న ఢిల్లీ హైకోర్టులో విచారణ

పాట్నా : లాలూ ప్రసాద్ కుమార్తె మీసా భారతిపై మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడి) శనివారం రెండో ఛార్జిషీటు దాఖలు చేసింది. దీనిపై ఫిబ్రవరి 5వ తేదీన కోర్టు పరిశీలించనుంది. 2017 డిసెంబర్ 23వ తేదీన ఈడి మీసా భారతి, ఆమె భర్త శైలేష్‌కుమార్‌పై మొదటి ఛార్జిషీటును దాఖలు చేసింది. ఢిల్లీలోని బిజాస్వాన్ ప్రాంతంలో ఉన్న వారి ఫామ్‌హౌస్‌ను ఎటాచ్ కూడా చేసింది. భారతి, కుమార్ ఇద్దరూ మిశైల్ ప్యాకర్స్ అండ్ ప్రింటర్స్ పేరుతో సంస్థను నిర్వహించారని, 2008–09లో 1.2 కోట్లను మళ్లించారని తెలిపారు. అలాగే సురేంద్రకుమార్‌జైన్, వీరేంద్ర జైన్ అనే ఇద్దరు డమ్మీ కంపెనీలతో డబ్బును మళ్లించారని ఈడి పేర్కొంది. ఛార్టర్డ్ ఎకౌంటెంట్ అగర్వాల్‌నూ అరెస్టు చేసింది. మిశైల్ కంపెనీలో జైన్ సోదరులు 90 లక్షలు షేర్ల రూపంలో పెట్టుబడులు పెట్టారని తెలిపారు.

తమిళనాడులో మూడో రోజూ కొనసాగిన ఆర్టీసి సమ్మె

చెన్నై : తమిళనాడు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన కొన్ని ఉద్యోగ సంఘాలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారానికి మూడో రోజుకు చేరింది. వేతన సంబంధిత సమస్యల పరిష్కారాన్ని కోరుతూ వీరు సమ్మె చేస్తున్నారు. పలువురు ఉద్యోగులు విధులకు హాజరయ్యారని, బస్సులు యథాతథంగా నడుస్తాయని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ చేసినప్పటికీ, మూడో రోజు బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. రవాణా శాఖ మంత్రి ఎంఆర్ విజయ భాస్కర్ మీడియాతో మాట్లాడుతూ 80 శాతం బస్సులు నడుస్తున్నాయన్నారు. తాము ప్రతిపాదించిన వేతనాలకు సానుకూలంగా స్పందించి.. పలువురు ఉద్యోగులు విధుల్లోకి చేరారని చెప్పారు. దీనికి సంబంధించి హై కోర్టు శుక్రవారం ఇచ్చిన ఆదేశాలను ఉద్యోగులు గౌరవించారని చెప్పారు.

ముంబయి అగ్నిప్రమాద ఘటనలో పబ్ యజమాని అరెస్ట్

ముంబయి : కమలా మిల్స్ అగ్ని ప్రమాదం కేసులో మెజో బిస్ట్రో పబ్ యజమానుల్లో ఒకరైన యోగ్ పతక్‌ను శనివారం ఎన్ఎం జోషి మార్గ్ పోలీసులు అరెస్టు చేశారు. గత డిసెంబర్ 29న ముంబయిలో భారీ అగ్ని ప్రమాదం సంభవించి, 14 మంది మృతి చెందిన సంగతి తెలిసిందే. పబ్‌లో హుక్కా వినియోగం ద్వారా నిప్పు రవ్వలు ఎగసి మంటలు వ్యాపించాయంతో అగ్ని ప్రమాదం సంభవించిందని అగ్నిమాపక సిబ్బంది నివేదికలో వెల్లడవ్వడంతో యోగ్ పతక్‌ను అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. ఆయన విశ్రాంత డైరెక్టర్ జనరల్ పోలీస్, మాజీ పుణే పోలీస్ కమిషనర్ కె.కె.పతక్ కుమారుడని పోలీసులు తెలిపారు.

వారికి జీడీపీ అంటే స్థూల విభజన రాజకీయాలు

మోడీ, అరుణ్‌జైట్లీపై రాహుల్ విమర్శనాస్త్రాలు



న్యూఢిల్లీ : 2017–18 ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ వృద్ధి రేటు 6.5 శాతంగా ఉంటుందన్న అంచాలను కేంద్ర గణాంక కార్యాలయం శుక్రవారం ప్రకటించిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీపై కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ విమర్శనాస్త్రాలను సంధించారు. బీజేపీ దృష్టిలో జీడీపీ (గ్రాస్ డివిసివ్ పాలిటిక్స్) అంటే స్థూల విభజన రాజకీయాలు అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సంస్కరణలతో భారత ఆర్థిక వ్యవస్థను కుదేలు చేస్తున్నాయని విమర్శించారు. పెట్టుబడులు 13 ఏండ్ల కనిష్ఠానికి, బ్యాంకుల పరపతి వృద్ధి 63 ఏండ్ల కనిష్ఠానికి, ఉద్యోగల సృష్టి ఎనిమిదేండ్లకు పడిపోయిందని అన్నారు. వ్యవసాయానికి సంబంధించి స్థూల విలువ జోడింపు (జీవీఏ) కూడా 1.7 శాతానికి పడిపోయినట్టు రాహుల్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. 'మోడీ, అరుణ్‌జైట్లీలు కలసి దేశానికి 'స్థూల విభజన రాజకీయాల'ను ఇస్తున్నారని విమర్శించారు. జీఎస్టీకి గబ్బర్ సింగ్ యాక్ట్ అని, మేక్ ఇన్ ఇండియాను ఫేక్ ఇన్ ఇండియా అని, మోడీని ఉద్దేశించి 'సూట్ బూట్ కి సర్కార్' అని రాహుల్ చేసిన విమర్శలు బహుళ ప్రచారాన్ని పొందాయి. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ ఆర్థిక తిరోగమనానికి దారితీస్తాయని ఆర్థికవేత్తలు పదేపదే చేసిన హెచ్చరికలు నిజమని తేలుతోందని రాహుల్ అన్నారు.

కాశ్మీర్‌లో ఉగ్రపంజా

బాంబు పేల్చడంతో నలుగురు పోలీసులు మృతి



శ్రీనగర్: జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదులు రెచ్చిపోయారు. పెట్రోలింగ్ బృందమే లక్ష్యంగా బాంబు పేల్చారు. బారాముల్లా జిల్లాలో చోటు చేసుకున్న ఈ ఘటనలో నలుగురు పోలీసులు ప్రాణాలు కోల్పోగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రిమోర్ట్ సాయంతో బాంబు పేల్చినట్టు పోలీసు ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. బారాముల్లా జిల్లా సోపోర్ పట్టణంలోని ఛోటా బజార్–బడా బజార్ లైన్‌లో ఉగ్రవాదులు ఇదివరకే ఐఈడీ బాంబు అమర్చారు. కాగా.. పోలీసు బృందం రోజువారీ విధుల్లో భాగంగా శనివారం ఉదయం పెట్రోలింగ్‌కు బయలు దేరింది. వారు ఛోటా బజార్–బడా బజార్ లైన్‌కు రాగానే ఉగ్రవాదులు రిమోర్ట్‌తో బాంబును పేల్చివేశారు. ఘటనలో నలుగురు పోలీసులు చనిపోయారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. పేలుడు ధాటికి ఘటనా స్థలిలో మూడు షాపులు ధ్వంసమయ్యాయి. పేలుడు నేపథ్యంలో ఆ ప్రాంతంలో షాపులను యజమానులు మూసివేసి ఉంచారు. ఘటన పట్ల జమ్మూకాశ్మీర్ సీఎం మెహబూబా ముఫ్తీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు పోలీసులు త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ముష్కరుల దుశ్చర్యను తీవ్రంగా ఖండించారు.

మరిన్ని దాడులు చేస్తాం: జైషే

మరోవైపు దాడికి తమదే బాధ్యత అని జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ ప్రకటించింది. అంతేకాక.. భవిష్యత్తుల్లో ఇలాంటి దాడులు మరిన్ని చేస్తామని హెచ్చరించింది. పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌పై ఉగ్రదాడి జరిగిన కొద్ది రోజులకే ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. ఆనాటి దాడిలో ఐదుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ముగ్గురు ఉగ్రవాదులను సైన్యం మట్టుబెట్టింది. ఈ దాడికి తమదే బాధ్యత అంటూ జైషే వెల్లడించిన సంగతి తెలిసిందే. గతనెలలో జరిగిన జైషే టాప్ కమాండర్ నూర్ తంత్రాయ్ ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారంగానే ఈ దాడులు జరుగుతున్నట్టు తెలుస్తున్నది.

కాళేశ్వరం పనుల పరిశీలన

- జలసౌధ నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా సైట్ ఇంజినీర్లకు మంత్రి హరీశ్‌రావు సూచనలు
- కంట్రోల్ సిబ్బంది పనితీరుపై ఆరా


మాట్లాడుతున్న హరీశ్‌రావు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు కాళేశ్వరం ప్రాజెక్టు పనులను హైదరాబాద్ నుంచే పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఇంజినీర్లకు ఆయన సూచనలు ఇచ్చారు. జలసౌధలో ఏర్పాటు చేసిన లైవ్ స్క్రీన్ నుంచి మంత్రి కాళేశ్వరం ప్రగతి గురించి తెలుసుకున్నారు. మంత్రి లైవ్‌లోకి రావడంతో అన్నారం బ్యారేజీలో పని చేస్తున్న అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు చెందిన మూడు బ్యారేజీలు, మూడు పంపు హౌజ్‌లు, గ్రావిటీ కెనాల్, గేట్ల ఫ్యాబ్రికేషన్ పనులను ఇటీవల స్వయంగా మూడు రోజుల పాటు మంత్రి పరిశీలించారు. జలసౌధ నుంచి పనుల పురోగతిని 'లైవ్" లో తనిఖీ చేసే ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం నాడు అన్నారం బ్యారేజీ పనులను పరిశీలించారు. అక్కడ సైట్‌లో ఉన్న సంబంధిత ఏజెన్సీ ఇంజనీర్, ఇరిగేషన్ ఇంజనీర్లతో నేరుగా సంభాషించారు. పనులు జరుగుతున్న తీరుతె న్నులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. శనివారం నాడు ఎంత కాంక్రీటు వేశారు? ఎంత టార్గెట్ రీచ్ అయ్యారు? ఎన్ని గేట్లు ఫ్యాబ్రికేటు చేశారు? అని ఇరిగేషన్ ఈఈ మల్లిఖార్జునప్రసాద్‌ను ప్రశ్నించారు. ప్రాజెక్టు సైట్‌లో ఉండే ప్లేస్‌మెంట్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. క్వాలిటీ ఇంజనీర్లు రెగ్యులర్‌గా సైట్‌కు వస్తున్నారా? లేదా? అని ప్రశ్నించారు. .క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది, ఫీల్డ్ ఇంజనీర్ల విధుల రికార్డులను కూడా మంత్రి హైదారాబాద్ నుంచే తనిఖీ చేశారు. అన్నారం బ్యారేజీలో జరుగుతున్న అన్నీ పనులను లైవ్ కేమరాలో చూస్తూ తగిన సూచనలు చేశారు. డిసెంబర్‌లో ఒక లక్షా నాలు వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పనులు జరిగాయని సైటు ఇంజనీర్లు మంత్రికి తెలిపారు.జనవరి నుంచి ప్రతి నెల లక్షా 50 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పనుల లక్ష్యంతో పని చేస్తున్నట్టు వివరించారు.కాగా కాళేశ్వ రం కు సంబంధించిన ప్యాకేజీ 6, ప్యాకేజీ 8 లకు గాను అవసరమైన పంపులు, మోటార్లు, ఇతర యంత్ర పరికరాలను సకాలంలో, షెడ్యూలు ప్రకారం సరఫరా చేస్తామని బీహెచ్‌ఈఎల్ ఉన్నతా ధికారుల బృందం తెలంగాణ ప్రభుత్వా నికి హామీ ఇచ్చింది. శనివారం ఈ బృందం ఇరిగేషన్ మంత్రి హరీశ్‌రావుతో జలసౌధలో ప్రత్యేకంగా సమావేశ మైంది. ఈ బృందంలో ఆ సంస్థ సలహాదారు నరేంద్రకుమార్, ఇతర ప్రతినిధులు పీఎల్ గజుభాయి, ఎస్కే గుప్తా, యోగేంద్రపాల్ ఉన్నారు. సమావేశంలో ప్రభుత్వ స్పెషల్. సీఎస్ జోషి, ఈఎన్‌సీ మురళీధరరావు తదితరులు పాల్గొన్నారు.

మిడ్ మానేరు పనులు ఫిబ్రవరి 15 లోగా పూర్తి

మిడ్ మానేరు ప్రాజెక్టు పనులను ఫిబ్రవరి 15 లోగా పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. శనివారం స్థానిక జలసౌధలో ఈ ప్రాజెక్టు పనుల పురోగతి, నిర్వాసితులకు చెల్లించే నష్ట పరిహారం, పునరావాస కార్యక్రమాల గురించి ఆయన సమీక్షించారు. గేట్ల బిగింపు సహా అన్నీ సివిల్, సాంకేతిక పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అత్యంత కీలకమైన మిడ్‌మానేర్ పూర్తి కావటం అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం ఎత్తిపోతల పనులు వేగం పుంజుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మిడ్ మానేరు భూనిర్వాసితుల నష్టపరిహారం కోసం తప్పుడు అఫిడవిట్లు సమర్పించిన వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని అటువంటి అఫిడవిట్లు జారీ చేసిన మండల అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆదేశించారు. నిర్వాసితుల నష్టపరిహారం చెల్లింపుల సందర్భంగా ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. ప్రతి గ్రామానికి అధికారులు వెళ్లి సమగ్ర దర్యాప్తు చేయాలన్నారు. ముంపునకు గురయ్యే స్ట్రక్చర్ల అంచనాలు రూపొందించడంలో అవకతవకలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మిడ్ మానేరు స్పిల్ వే పనులపురోగతిని మంత్రి తెలుసుకున్నారు. మొత్తం 25 గేట్ల ఫ్యాబ్రి కేషన్, బిగింపు పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. రివిట్‌మెంట్ పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నట్టు కాంట్రాక్టు ఏజెన్సీ ప్రతినిధులు మంత్రికి తెలిపారు. ఇందులో 24 గేట్ల అమరిక పూర్తయినట్టు వారు వివరించారు. మరో గేటు పని వారం రోజుల్లో పూర్తవుతాయని చెప్పారు. ఈ ప్రాజెక్టు పరిధిలోని పునరావాస పనులను వేగవంతం చేయాలని హరీశ్ రావు ఆదేశించారు. మిడ్ మానేరులో భాగంగా నిర్వాసితులైన వారికి కట్టడాల నష్ట పరిహారం కింద రూ. 40 కోట్లు, వారి పునరావాసం, పునస్థిరీ కరణ కోసం మరో 25 కోట్లు మంజూరు చేయడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని మంత్రి ఆదేశించారు.

డిజిటలైజేషన్‌తో ప్రతి ఇంటికీ పుస్తకం

- సాంకేతికతతో అందుబాటులో విజ్ఞానం, వినోదం, ఆరోగ్యం: హైకోర్టు జడ్జి షమీమ్ అక్తర్
- ఎస్‌వీకేలో ఉర్దూ గ్రంథాలయం డిజిటలైజేషన్ కార్యక్రమం ప్రారంభం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదివే వారి సంఖ్య తగ్గుతోందని హైకోర్టు జడ్జి జస్టిస్ షమీమ్ అక్తర్ అన్నారు. డిజిటలైజేషన్‌తో ప్రతిఇంటికీ పుస్తకాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడున్నా వెబ్‌సైట్ ద్వారా పుస్తకాలు చదువుకోవడానికి వీలవుతుందన్నారు. శనివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఉన్న సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్‌వీకె)లో ఉర్దూ గ్రంథాలయం డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభనుద్దేశించి షమీమ్ అక్తర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా 40 వేల ఉర్దూ పుస్తకాలు, మ్యాగజైన్లు డిజిటలైజ్ అవుతాయని చెప్పారు. 20, 30 ఏండ్ల కింద చాలామంది గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు, మ్యాగజైన్లు, దినపత్రికలు చదివే వారని గుర్తు చేశారు. ఇప్పుడు గ్రంథాలయాలకు వెళ్లి చదవడం తగ్గిపోయిందని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడంలో ప్రపంచం వేగంగా మారుతోందని చెప్పారు. పుస్తకాలను డిజిటలీకరణ చేయడం ద్వారా ఇంటర్‌నెట్ అందుబాటులో ఉండే అందరికీ వాటిని చదివేందుకు వెసులుబాటు కలుగుతందని అన్నారు. ఏ ప్రాంతమైనా, దేశమైనా ఎదగాలంటే మనుషుల ఆరోగ్యం, విజ్ఞానం బాగుండాలని చెప్పారు. ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం చేయాలని, రోజూ గంట కష్టపడాలన్నారు. సమాజానికి ప్రయోజనం కలిగించాలన్నా, ఉన్నతస్థాయికి ఎదగాలన్నా విజ్ఞానం ఎంతో అవసరమని అన్నారు. విజ్ఞానం అందించడంలో గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. ప్రతి గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాలు నిర్దేశించుకున్నా ఇప్పటికీ నెరవేరలేదని అన్నారు. డిజిటలైజేషన్ ప్రక్రియతో ఇంటింటికీ గ్రంథాలయంతోపాటు పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. పుస్తకాల ద్వారా విజ్ఞానంతోపాటు వినోదం, శాంతి, అనేక పనుల నుంచి ఉపశమనం కలుగుతుందని చెప్పారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం, రేఖ్తా ఫౌండేషన్ సంస్థలు చేసే ఈ కార్యక్రమం ద్వారా సమాజానికి ఎంతో మేలు కలుగుతుందని అన్నారు. ప్రొఫెసర్ అన్వర్ మౌజామ్ మాట్లాడుతూ విజ్ఞానాన్ని డిజిటలైజేషన్ చేయడం ద్వారా విప్లవాత్మకమైన మార్పులొస్తాయని చెప్పారు. పుస్తకాలను దాచిఉంచడం గొప్ప లక్షణమని, ఇప్పుడు డిజిటలీకరణ చేయడం సమాజానికి దోహదపడే కార్యక్రమమని అన్నారు. భాష ఓ మతానికి మాత్రమే పరిమితం కాదన్నారు. ఉర్దూ పుస్తకాలు ముస్లింలకే పరిమితం కాదని, సాహితీప్రియులు, పరిశోధకులందరికీ ఉపయోగమని అన్నారు. సీనియర్ న్యాయవాది మహమ్మద్ అలీ మాట్లాడుతూ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా విస్తరిస్తోందని చెప్పారు. చిన్న పిల్లల నుంచి పెద్ద వారి వరకూ అందరూ ఇంటర్‌నెట్‌ను వినియోగిస్తున్నారని అన్నారు. డిజిటలైజేషన్ ప్రక్రియ ద్వారా పుస్తకాలను అందరికీ అందుబాటులోకి తేవడం గొప్ప పరిణామమని చెప్పారు. అధ్యక్షత వహించిన ఎస్‌వికె ట్రస్టు సభ్యులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు ఉర్దూ సాహిత్యాన్ని, పుస్తకాలను అందిం చడం కోసం డిజిటలైజేషన్ కార్యక్రమం చేపట్టామని అన్నారు. ఎస్‌వికె గ్రంథాలయంలో 2.50 లక్షల ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ పుస్తకాల డిజిటలైజేషన్ అవుతోందని చెప్పారు. అన్ని వర్గాల వారికీ ఈ సేవలు అందుబాటులోకి వస్తాయని, ముఖ్యంగా పరిశోధక విద్యార్థులకు మరింత ఉపయోగమని అన్నారు. ఎస్‌వికె మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ మాట్లాడుతూ ఎక్కడా దొరకని ఉర్దూ పుస్తకాల డిజిటలైజేషన్ కార్యక్రమం ఎస్‌వికెలో జరుగుతోందని చెప్పారు. మొగల్ కాలం నాటి, నిజాం కాలంలో ఉన్న అరుదైన ఉర్దూ పుస్తకాలు అందరికీ అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీకె (గచ్చిబౌలి) చీఫ్ అడ్మినిస్ట్రేటర్ పి ప్రభాకర్, గ్రంథాలయం ఇంచార్జీ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని స్థానాల్లో పోటీ : ఎల్ రమణ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అన్ని స్థానాల్లో పోటీచేస్తుందని తెలుగుదేశం తెలంగాణ శాఖ అధ్యక్షులు ఎల్.రమణ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్‌భవన్‌లో టీడీపీ రాష్ట్రస్థాయి సాధారణ సమావేశం జరిగింది. దీనికి అధ్యక్షత వహించి ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లోగా పార్టీని రాష్ట్రంలో తిరుగులేని శక్తిగా తయారుచేసుకుందామని చెప్పారు. పల్లె పల్లెకు టీడీపీ కార్యక్రమం ద్వారా 119 అసెంబ్లీ, 17 పార్లమెంటు స్థానాల్లో పోటీ చేయడానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. టీడీపీ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూనే, కేసీఆర్ సర్కారు వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. ప్రజాసమస్యలపై నిరంతర పోరాటాలు అవసరమన్నారు. పార్టీ అధినేత చంద్రబాబు తన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ సమావేశానికి 500 మందికిపైగా హాజరయ్యారంటేనే పార్టీ పట్ల అభిమానం ఇంకా ప్రజలు, నాయకులు, కార్యకర్తల్లో ఉందన్నారు. పొలిట్‌బ్యూరో సభ్యులు మోత్కుపల్లి నర్సింహులు, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం 40 లక్షల ఇండ్లు కడితే, టీఆర్ఎస్ కేవలం 1746 మాత్రమే కట్టిందన్నారు. గురుకుల పాఠశాలలను తొలిసారిగా టీడీపీ ప్రభుత్వమే ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అణగారిన వర్గాల కోసమే టీడీపీ పుట్టిందన్నారు. మంద కృష్ణను అక్రమంగా జైల్లో పెట్టారని విమర్శించారు. గవర్నర్ కూడా మందకృష్ణపై ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. పార్టీకి కార్యకర్తలకే కీలకమన్నారు. ఒక జాతీయ పార్టీ సర్వేలో రాష్ట్రలో టీడీపీకి 8 శాతం నుంచి 26 శాతం ఓటింగ్ ఉందని తేలిందని చెప్పారు. ఈనెల 11 ఏదా 12 తేదీల్లో పార్ల మెంటరీ నియోజకవర్గాలస్థాయిలో సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు.జాతీయ నాయకులు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కె.దయాకర్‌రెడ్డి, చాడ సురేశ్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అమర్‌నాథ్‌బాబు, ప్రధాన కార్యదర్శులు బండ్రు శోభారాణి, జి.బుచ్చిలింగం, మల్లయ్యయాదవ్, నగర అధ్యక్షులు ఎం.ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వీట్ ఫెస్టివల్ వెబ్‌సైట్.. యాప్ ఆవిష్కరణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఈనెల13 నుంచి 15 వరకు నిర్వహించే స్వీట్ ఫెస్టివల్ వెబ్‌సైట్, యాప్‌ను టూరిజం శాఖ రూపొందించింది. శనివారం సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు రమణాచారి, టూరిజం శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం ఈ వెబ్‌సైట్, యాప్‌ను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా రమణా చారి మాట్లాడుతూ ప్రపంచంలోనే తొలి సారిగా స్వీట్ ఫెస్టివల్‌ను నిర్వహి స్తున్న ఘనత తెలంగాణ రాష్ట్రానికే దక్కుతుందన్నారు. బుర్రా వెంకటేశం మాట్లాడుతూ ఈ స్వీట్ ఫెస్టివల్లో 15 దేశాలు, 25 రాష్ట్రాలకు చెందిన స్వీట్లను ప్రదర్శిస్తారని చెప్పారు. ఈ ప్రదర్శనను తిలకించడానికి ఎలాంటి ప్రవేశ రుసుము లేదన్నారు. ఈ స్వీట్ ఫెస్టివల్ నిర్వహి ంచడం ద్వారా పర్యాటకులను ఆకర్షించవచ్చన్నారు.



> **విజ్ఞానం కానీ, మూర్ఖత్వం కానీ అవధులు దాటినప్పుడు హద్దులలో ఉంచవలసి ఉంటుంది. - మాంటేగ్**

సంపాదకీయం

ఆత్మవిశ్వాసం

నిండయిన ఆత్మవిశ్వాసమే మనిషిలో సాధనాశక్తిని ప్రోది చేస్తుంది. ముందుకు వెళ్ళగలిగే చొరవకు దారితీస్తుంది. సవాళ్ళను ఎదుర్కొనే స్థయిర్యాన్ని అందిస్తుంది. ఉన్నచోటునే నిలిచిపోక కొత్తతీరాలకు, కొత్త రంగాలకు పరివ్యాప్తం కావాలన్న ఆలోచనకు బలాన్నిస్తుంది. కాలాన్ని వృధా చేయక నిత్యమూ, నిరంతరమూ క్రియాశీలతతో ఉండే తత్వాన్ని అలవరుస్తుంది. సమస్యలు, సవాళ్ళు ఎదురయినా వాటిని అధిగమించే ధీరత్వాన్ని చేకూరుస్తుంది.

హాకింగ్ జీవనగమనాన్ని ఒకసారి గుర్తు చేసుకోవాలి. అర్థశతాబ్దంగా చక్రాల కుర్చీకి పరిమితమై వున్న మనిషి, ఇంకా బతకాలన్న జీవనకాంక్షని వ్యక్తం చేయడంలోని అసాధరణత్వాన్ని అర్థం చేసుకోవాలి. ఈవిధమైన ఆత్మవిశ్వాసం, ఆలోచనాధోరణి ఉంటే ఆత్మహత్యలకు మనుషులు దూరంగా ఉండగలరు. మనిషి జీవించేది ఒకే ఒక్కసారి. ఆ జీవితాన్ని అర్థవంతంగా, పదుగురికి ఉపయోగపడేలా గడపడం గొప్ప ఔన్నత్యం.

యవ్వనంలోనే కాదు, వయసు పెరుగుతున్నా, కాని కాలంలో కష్టాలు ఎదురవుతున్నా చెక్కుచెదరని మనో నిబ్బరంతో ఉండటమే ఆత్మవిశ్వాసానికి ప్రధానం. నెత్తురు మండే వయసులోనే కాదు, ఏ వయసులోనైనా అనుకున్నది సాధించి తీరగలమన్న ఆత్మవిశ్వాసం ఉండాలి. యవ్వనంలో ఏదైనా సాధించగలమనే భావన ఉంటుంది. కొండల్ని ఢీకొనగలమన్న ధీమాతో ముందుకు వెళతారు. కానీ అనుభవాల రాపిడిలో కొంచెం కొంచెం వెనక్కి జారిపోతుంటారు. మధ్యతరగతి గుడుగుడు గుంచం బతుకుల్లోకి కూరుకుపోతుంటారు. ఏళ్ళు మీద పడుతుంటే బస్తీ మే సవాల్ అన్న కంఠస్వరం గురగుర లాడుతుంది. ఊహించని ఓటమి ఎదురయితే కుంగిపోతారు. అనుకోని వైఫల్యాలతో తల్లడిల్లుతారు. అప్పటివరకు ఉన్న ఆత్మవిశ్వాసం ఒక్కసారిగా సన్నగిల్లుతుంటుంది.

ఇక్కడే ఆత్మవిశ్వాసానికీ, ధీరతకీ అసలైన పరీక్ష. జీవితం పూలపాన్పు కాదు. నల్లేరు బండి మీద నడక కానే కాదు. సవాళ్ళు ఏం లేనప్పుడు అంతా సవ్యమే. సమస్యలతో తలపడాల్సి వచ్చినప్పుడే ఆత్మవిశ్వాసానికి అసలుసిసలు పరీక్ష. కుంగిపోతారా, పోరాడతారా అన్నది కళ్ళెదుట నిలిచే ప్రశ్న. వ్యక్తిగత జీవితంలోనూ, సామాజిక జీవితంలోనూ వెనకడుగు వేయాల్సిన సందర్భాలు తారసిల్లుతాయి. ఓటమి అనివార్యమైన సందర్భాల్లో ఎలా వ్యవహరిస్తామన్నదే కీలకం. "కెరటం నాకు ఆదర్శం లేచి పడుతున్నందుకు కాదు, పడినా లేస్తున్నందుకు" అన్న స్వామి వివేకానంద మాటలు స్ఫూర్తిదాయకం.



అవాంతరాలు లేకుండా మనిషి జీవితం సాగదు. వాటిని ఎలా ఎదుర్కొంటామన్నదే ముఖ్యం. మరణాన్ని సైతం సవాల్ చేసేలా ధైర్యంతో, సాహసంతో వ్యవహరించడం మనిషి జీవితానికి శోభనిస్తుంది. వారి మూర్తిమత్వానికి దీప్తినిస్తుంది. పోరాటంలో ప్రాణాలర్పించక తప్పదని తెలిసినా ముందుకు వెళ్ళడం మనిషి తెగువకీ, ఆత్మవిశ్వాసానికీ సిసలైన ప్రతీక. భగత్‌సింగ్, చెగువేరా వంటి వీరుల సాహసమే ఇందుకు నిదర్శనం.


మృత్యువు అంచుల్లో ఉన్నా భయపడక, భీతిల్లక జీవించడం మహత్తర లక్షణం. ఇందుకు రేపు 76వ పుట్టినరోజు జరుపుకోబోయే స్టీఫెన్ హాకింగ్ (జననం: 8 జనవరి 1942) జీవితమే ఉదాహరణ. యాభయ్యేళ్ళుగా చక్రాల కుర్చీకి పరిమితమయి నప్పటికీ శాస్త్ర పరిశోధనలు చేస్తూ, పుస్తకాలు రాస్తూ ఇంకా ఎన్నో పనులు చేయాలని తపిస్తున్నారాయన. "నేను మృత్యువుకు భయపడటం లేదు. త్వరగా మరణించాలని భావించటం లేదు. నేను కన్నుమూసే లోపు చేయాల్సిన పనులు ఎన్నో ఉన్నాయి" అని ఆ మధ్యన హాకింగ్ చెప్పిన మాటలు ఆయనలోని జీవితేచ్ఛకీ, అనల్పమైన ఆత్మవిశ్వాసానికీ సంకేతం.

వ్యక్తిగత జీవితంలోని ఆటుపోట్లకు, కల్లోలాలకు తల్లడిల్లేవారు హాకింగ్ జీవనగమనాన్ని ఒకసారి గుర్తు చేసుకోవాలి. అర్థశతాబ్దంగా చక్రాల కుర్చీకి పరిమితమై వున్న మనిషి, ఇంకా బతకాలన్న జీవనకాంక్షని వ్యక్తం చేయడంలోని అసాధరణత్వాన్ని అర్థం చేసుకోవాలి. ఈవిధమైన ఆత్మవిశ్వాసం, ఆలోచనాధోరణి ఉంటే ఆత్మహత్యలకు మనుషులు దూరంగా ఉండగలరు. మనిషి జీవించేది ఒకే ఒక్కసారి. ఆ జీవితాన్ని అర్థవంతంగా, పదుగురికి ఉపయోగపడేలా గడపడం గొప్ప ఔన్నత్యం.

చరిత్రలోకి చూపు సారిస్తే సడలని దీక్షాదక్షతలతో ముందుకు వెళ్ళిన వారు ఎందరో కనిపిస్తారు. చైనా విప్లవ సమయాన ఎన్నెన్నో అగడ్తలు, అగచాట్లు ఎదుర్కొన్నారు మావో. విప్లవం అజేయం, అనివార్యమన్న ఆత్మవిశ్వాసంతో ముందుకు నడిచారు నెత్తుటి త్యాగాలతో ప్రయాణించక తప్పలేదు. అయినప్పటికీ గమ్యం చేరే దాకా విప్లవ యానం ఆపకూడదన్న మావో పట్టుదల, దృఢచిత్తం మాత్రమే చైనా కమ్యూనిస్టు పార్టీని, సుదీర్ఘమైన లాంగ్‌మార్చ్‌ని విజయవంతంగా నడిపించాయి.

మూడు దశాబ్దాలకు పైగా నిర్బంధంలో మగ్గినప్పటికీ నెల్సన్ మండేలా ఆత్మస్థయిర్యాన్ని కోల్పోలేదు. జాత్యాహంకార ప్రభుత్వానికి లొంగిపోలేదు. జాతివివక్షను అంతమొందించే ఆశయాన్ని వీడలేదు. దేశదేశాల్లో ప్రజల కోసం పోరాటపథంలో నిలిచిన అనేకులు పట్టుదలతో వ్యవహరించారు. లొంగుబాటు కన్నా మరణం మేలని తలచారు. లొంగనితరానికి ప్రతినిధులుగా చరిత్రలో నిలిచిపోయారు. అందుకే స్వామి వివేకానంద చెప్పినట్టు జీవనయానంలో మనల్ని దృఢచిత్తుల్ని చేసే ప్రతి ఆశయాన్ని స్వీకరించడం, బలహీనపరిచే ప్రతి ఆలోచననీ తిరస్కరించడం బతుకును దీప్తిమంతం చేస్తుంది. సార్థక జీవనానికి దాఖలాగా నిలుస్తుంది.

ప్రజలే ప్రభువులు.. వారి కోసమే ప్రత్యామ్నాయం



ఎస్. వీరయ్య

రాష్ట్రంలో బహుజన వామపక్ష ప్రజాతంత్ర ఫ్రంట్ అవసరం ఉన్నదా? అన్న ప్రశ్న కొందరు లేవనెత్తుతున్నారు. టీఆర్ఎస్ పాలన అంతం చేయటమే ప్రధాన లక్ష్యంగా ఉండాలనీ, అందుకోసం మిగిలిన పార్టీలన్నీ ఒకే తాటిమీదకు రావాలని వీరి అభిప్రాయం. ఈ వాదన ముందుకు తెస్తున్నవారు ప్రధానంగా కాంగ్రెసు నేతలూ, వారి అనుయాయులూ కాగా, మరికొందరు, టీఆర్ఎస్ నాయకత్వం నుండి ఆశించిన విధానాలు అమలుకాకపోవటంతో అసంతృప్తితో ఉన్నారు. మరోవైపు కొందరు కమ్యూనిస్టు పార్టీల శ్రేయోభిలాషులు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెసుతో పొత్తువల్ల వామపక్షాలు కొన్ని శాసనసభ స్థానాలు గెలిచి శాసనసభలో ప్రజల తరఫున పోరాడాలని వారి కోరిక. వీరందరి ప్రతిపాదనల సారాంశం ఒక్కటే. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి తెలంగాణ గద్దెనెక్కించాలన్నదే! ఇప్పుడు తెలంగాణ ప్రజలు ఆలోచించవల్సిన కీలకమైన అంశాలున్నాయి. టీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పి కాంగ్రెసును గద్దెనెక్కించాలా? వామపక్షాలు కొన్నిస్థానాల కోసం కాంగ్రెసుతో అంటకాగాలా? లేక ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చే ప్రజల ప్రభుత్వం కోసం పూనుకోవాలా? సీపీఐ(ఎం) ఎంచుకున్నది మూడో మార్గం. అది ప్రజల మార్గం. గత మూడు దశాబ్దాలుగా ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన పరిణామాలుగానీ, ఇప్పుడు తెలంగాణలో నడుస్తున్న చరిత్రగానీ ప్రజల ప్రత్యామ్నాయం ప్రాధాన్యతనే నొక్కిచెబుతున్నాయి. ఇప్పటిదాకా కాంగ్రెసు, టీడీపీ, టీఆర్ఎస్‌లలో ప్రతీసారీ ఎవరో ఒకరిని ఓడించ డానికి మరొకరిని గెలిపించటమే వామపక్షాలు చేసిన పని. ఓడించటంలోనూ, గెలిపించటంలోనూ జయప్రదమయ్యారు. కానీ వాటివల్ల ప్రజలకు ఒరిగింది శూన్యం. అందుకే ఇప్పుడు ప్రజలను గెలిపించవల్సిన అవసరం ముందుకొచ్చింది. అందుకే మరో ప్రత్యామ్నాయం కోసం ఆరాటం మొదలైంది.


> **ఆ విధానాలనే అనుసరిస్తున్న టీఆర్ఎస్ పాలనకు కాంగ్రెస్ ప్రత్యామ్నాయం ఎట్లా అవుతుంది. అందుకే ఇప్పుడు కావల్సింది టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెసులు కాదు. ప్రజలే ప్రభువులు కావాలి. ఆ ప్రజల ప్రతినిధిగానే మరో ప్రత్యామ్నాయం కావాలి. ఆ దిశలోనే బహుజన, వామపక్ష, ప్రజాతంత్ర సంఘటన ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. తెలంగాణ గడ్డమీద ఇదొక చారిత్రక అవసరం.**

మనుషులూ... ఓటర్లూ...

దశాబ్దాలుగా రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన కాంగ్రెసును తెలుగు ప్రజలు తిరస్కరించారు. తెలంగాణ భవిష్యత్తును టీఆర్ఎస్ చేతిలో పెట్టారు. ఉద్యమనాయకత్వం కూడా గత పాలకుల చెప్పుల్లోనే కాళ్ళు పెట్టిందన్న ఆవేదనలో జనం ఉన్నారు. మూడున్నరేండ్ల టీఆర్ఎస్ పాలనలో పెద్దల ప్రయోజనాలే తప్ప పేదల విముక్తి గురించి పట్టించుకున్నది లేదు. ఓట్ల పథకాలే తప్ప ప్రజల గోడు పట్టదు. పెద్దల మీద ఉన్న ప్రేమ పేదల మీద లేదు. పారిశ్రామిక వేత్తలనూ, భూస్వాములనూ, కాంట్రాక్టర్లనూ మనుషులుగా పరిగణిస్తూ, పేదలనూ, మధ్యతరగతి ప్రజలను మాత్రం కేవలం ఓటర్లుగానే చూస్తున్నారు. ప్రభుత్వ విధానాలన్నీ ఈ అవగాహన చుట్టే తిరుగు తున్నాయి.

ఎవరి ప్రయోజనాలు...?

ఐదు నుండి పదేండ్లుగా వేతనాలు పెరగని సాధారణ కార్మికులు వేతన సవరణ కోరుతున్నారు. 73 రంగాలలో వేతన సవరణ ప్రతిపాదనలు ప్రభుత్వం ముందున్నాయి. వీరి వేతనం పెంచితే యాజమాన్యాలూ, కాంట్రాక్టర్ల మీద భారం పెరిగిపోతుందట! అందువల్ల కార్మికులే పొదుపుగా బతకాలట! ఒక్క ఫైలు మీద కూడా సంతకం పెట్టేందుకు ప్రభుత్వం నిరాకరించింది. మరోవైపు పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు మాత్రం ప్రపంచంలోనే ఎక్కడా లేని అద్భుతమైన పారిశ్రామిక విధానం అమలు చేస్తున్నామని పాలకులే చెప్పుకుంటున్నారు. అప్లికేషన్ పెడితే చాలట! అధికారులే పారిశ్రామికవేత్తల ఇండ్లకు పోయి అన్ని అనుమతులూ ఇస్తున్నారట! రైతులు ఆత్మహత్యలు ఆపడానికి అవసరమైన కీలకమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా లేరు. పారిశ్రామిక వేత్తలకూ, కాంట్రాక్టర్లకూ కోటానుకోట్లు బ్యాంకుల ద్వారా అప్పులిప్పిస్తున్న పాలకులు, రైతులను మాత్రం వడ్డీ వ్యాపారుల పరం చేస్తున్నారు. అన్నదాతలను వ్యాపార పంటల వైపు మళ్లించి, పెట్టుబడి ఖర్చులు పెంచి అప్పుల పాలు చేస్తున్నారు. గిట్టుబాటు ధర మాత్రం తమ బాధ్యత కాదనీ, మధ్య దళారీల బొజ్జలు నింపుతున్నారు.



నాణ్యమైన విత్తనాల సరఫరాకు సైతం బాధ్యత వహించటం లేదు. మరోవైపు వందల ఎకరాల ఫామ్‌హౌజ్‌లకూ, గ్రీన్‌హౌజ్‌లకూ అన్నీ అందుబాటు లోకి వస్తున్నాయి. కాంట్రాక్టు వ్యవసాయం పేరుతో బడా వ్యాపారులకు భరోసా ఇస్తున్నారు. ఇప్పుడు ఇజ్రాయిల్ తరహా వ్యవసాయం పేరుతో భూస్వాములనూ, ధనిక రైతులనూ ప్రోత్సహిస్తూ, పారిశ్రామిక వేత్తలను వ్యవసాయ రంగంలోకి ఆహ్వానిస్తున్నారు. రైతులకు మాత్రం పలుపు తాళ్ళే ఉరితాళ్ళుగా ఉపయోగపడు తున్నాయి. నగదు సహాయం పేరుతో ఎకరం రైతుకు ఎనిమిదివేలు ఇస్తే వందెకరాల రైతుకు ఎనిమిది లక్షలు ఇస్తున్నారు.

పారిశ్రామికవేత్తల కోసం, ప్రాజెక్టుల కోసం రైతుల భూములు, పేదల గ్రామాలు ముంచేస్తున్నారు. ఇందుకోసం రాష్ట్రంలో టీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీ చేతులు కలపడానికి వెనుకాడలేదు. 2013 భూసేకరణ చట్టాన్ని తిరగదోడారు. జీవో 123, జీవో 40ల పేరుతో భూములు గుంజుకున్నారు. కౌలు రైతు గురించి తమకు బాధ్యత లేదని స్పష్టంగా ముఖ్యమంత్రే ప్రకటించారు. వ్యవసాయ కూలీల పేర్లు ఓటర్ల జాబితాలో తప్ప పాలకుల జాబితాలో లేవు. వృత్తులకు ప్రోత్సాహం పేరుతో మాంసం, చేపల ఉత్పత్తిని భారీ పరిశ్రమగా అభివృద్ధి చేసి బడా బాబుల ప్రయోజనాల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. అమాయక వృత్తిదారులకు మాత్రం గొర్రెపిల్లలు, చేపపిల్లలు చూపించి ఊరిస్తున్నారు.

నిరసనలకు తావులేదు

ఎంబీసీల కోసం వెయ్యికోట్లు నిధులు కేటాయించామన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసి, చైర్మన్‌కు కారు, కుర్చీ ఇచ్చారు. ఎంబీసీలకు మాత్రం మొండిచేయి చూపించారు. ఇప్పటి వరకూ ఎంబీసీ కులాల నిర్ధారణ గానీ, నిర్దిష్ట ప్రణాళిక గానీ లేవు. ఈ ఉదాహరణలన్నీ పెద్దల ప్రయోజనాల కోసం పేదలను సమిధలుగా వాడుకుంటున్న తీరునే స్పష్టం చేస్తున్నాయి కదా! కొలువుల కోసం కొత్తరాష్ట్రంలో కూడా కొట్లాడక తప్పని స్థితి దాపురించింది. కార్మికశాఖ మంత్రే పోలీసుశాఖకు కూడా మంత్రిగా ఉన్నారు. కార్మిక మంత్రి కార్మికుల పోరాటాలను అణచివేసే మంత్రిగా ఉండటమే ఇక్కడి వైపరీత్యం. కార్మికులు సమాన గౌరవంతో ఉండవల్సిన సమిష్టి బేరసారాల హక్కును వదులుకొని సాధు జంతువుల్లాగా పడి ఉండాలం టున్నారు. యజమానుల, పాలకుల ఆదేశాలకు తలాడించాలంటున్నారు. పోలీసుశాఖకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి బలోపేతం చేస్తున్నారు. ఆశాల ఉద్యమం మీద, మల్లన్నసాగర్ రైతుల పోరాటం మీద ఉక్కుపాదం మోపారు. జనారణ్యంలో నిరసనకు తావులేదంటున్నారు.

వివక్ష

రాష్ట్రంలో సాగునీటి సమస్యలెట్లా ఉన్నా, సామాజిక సమస్యలు మాత్రం బాగా సాగవుతున్నాయి. 1/70 చట్టాన్ని ప్రభుత్వమే ఖాతరు చేయటం లేదు. హరితహారం, పులుల సంరక్షణ, సాగునీటి ప్రాజెక్టుల పేరు మీద గిరిజనుల జీవితాలను ఛిద్రం చేస్తున్నారు. అడవుల యజమానులను అడుక్కునే వారుగా మారుస్తున్నారు. అటవీ ప్రాంత గిరిజనులకూ, మైదాన ప్రాంత గిరిజనులకు మధ్య చిచ్చుపెట్టి మజా చూస్తున్నారు. దళితులలో పెరుగుతున్న కొత్త చైతన్యాన్ని సహించలేక కులదురహంకారం బుసలు కొడుతున్నది. 2017లో జరిగినన్ని కులదురహంకార దాడులు ఎప్పుడూ జరగలేదు. వీటి పట్ల పాలకులుగానీ, పాలక పార్టీ నేతలు గానీ కనీసం స్పందించక పోవటమే ఆశ్చర్యకరం. పైగా పోలీసు వ్యవస్థగానీ, అధికారపార్టీ ప్రజా ప్రతినిధులుగానీ కుల దురహంకారులకే అండగా నిలుస్తున్నారు. దళితులకు ఆస్తిగానీ, హక్కులుగానీ, చదువుగానీ ఉండవద్దన్న మనువు ఇంకా ఆధునిక పాలకులనూ వెన్నాడుతూనే ఉన్నాడు. ఓట్ల కోసం జనాధిక్య బీసీ కులాలను చేరదీస్తున్న పాలకులు ఎంబీసీలను మాత్రం ఊరవతలే ఉంచుతున్నారు. తెలంగాణ కళల గురించి కలలు గన్న జనానికి అవి కల్లలుగానే మిగిలిపోతున్నాయి. గంగిరెద్దుల వాళ్ళను యాచకులను చేసి అరెస్టులు చేస్తున్నారు. సంచార జీవులను దొంగలుగా చిత్రించి చిత్రవధ చేస్తున్నారు. ఎల్లారెడ్డిపేటలో ఎంబీసీ యువకుడిని పోలీసు స్టేషన్‌లో చిత్రహింసలు పెట్టి పొట్టన పెట్టుకున్నారు.


సమాజంలో సగభాగం మహిళలపై పెరుగుతున్న లైంగిక వేధింపుల పట్ల పాలకులకు చీమకుట్టినట్టు కూడా లేదు. 'షీ' టీములను చూసి సంతృప్తి పడాలంటున్నారు. గృహహింస అసలే పట్టదు. పెరుగుతున్న ఒంటరి మహిళల గురించి ప్రభుత్వం ఆలోచిస్తున్న దాఖలాలు లేవు. మద్యం ఆదాయం మీద మోజుతో మహిళల భద్రతను విస్మరిస్తున్నారు. దేశంలో మైనారిటీల మీద జరుగుతున్న దాడుల పట్ల ఇక్కడి పాలకులకు పట్టదు.

అసంఘటిత కార్మికులు, కౌలు రైతులూ, వ్యవసాయ కూలీలూ, వృత్తిదారులలో అత్యధికులు బడుగు బలహీన వర్గాలకు చెందినవారే. వీరి ఆర్థిక, సామాజిక సమస్యలు పాలకులు పట్టించుకునే స్థితిలో లేరు. పాలకుల కండ్లకు మాత్రం వీరంతా కేవలం ఓటర్లుగానే కనిపిస్తారు. అందుకే కులాలవారీ పథకాలు. గ్రామాలపైన పెత్తనం మాత్రం ఆధిపత్య కులాలదే! విద్యా వైద్య రంగాలలో పెరుగుతున్న కార్పొరేటీకరణ సగటుమనిషిని కుంగదీస్తున్నది. దిగజారుతున్న విలువల గురించి కొత్తగా చెప్పుకోవల్సిందేమీ లేదు.

కాంగ్రెసుకు ఉన్న అర్హత ఏమిటి?

రాష్ట్రంలో పాలకులెవరైనా, పెద్దలవైపూ, ప్రపంచబ్యాంకు వైపే చూస్తున్నారు. నాడు టీడీపీ, కాంగ్రెసూ, నేడు టీఆర్ఎస్ అయినా జరుగుతున్నది ఇదే. కేంద్రంలోనూ, అనేక రాష్ట్రాలలోనూ బీజేపీ చేస్తున్నదీ ఇదే. వీటికి తోడు అదనంగా ప్రజల దృష్టి మరలించేందుకు మతాన్నీ, భావోద్వేగాలనూ బీజేపీ వాడుకుంటున్నది. చంద్రబాబు బిల్‌గేట్స్ అన్నా, హైటెక్ సిటీ అన్నా, వైఎస్ఆర్ పాలనలో కాంగ్రెసు గనుల పంట పండించినా పెట్టుబడులు ఆకర్షించే పేరుతో పెద్దల ప్రయోజనాలు కాపాడటమే. ప్రయివేటీకరణ విధానాలు విస్తరించినా, రైతు బతుకు బజారు పాలైనా, ఉపాధి సమస్యలు జటిలమైనా, మహిళల భద్రతా సమస్యలు తీవ్రమైనా... ఈ పాపాలకు పునాది వేసింది కాంగ్రెసు విధానాలే. మల్లన్నసాగర్ రైతుల మీద టీఆర్ఎస్ పాలకులు కాల్పులుజరిపారు. వీరికి కాల్పుల మార్గం చూపెట్టింది కాంగ్రెసు, టీడీపీ పాలకులే! విద్యుత్తు ఉద్యమం పైన ఉక్కుపాదం మోపి ముగ్గురిని పొట్టనపెట్టుకున్నది నాటి టీడీపీ ప్రభుత్వం. భూమికోసం ఉద్యమించిన ముదిగొండ వీరులను పొట్టన బెట్టుకున్నది కాంగ్రెసు పాలకులే. రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన ఘనత కాంగ్రెసు పాలకులదే. జీవితచరమాంకంలో ప్రశాంతంగా కాలం వెళ్ళబుచ్చవల్సిన వృద్ధుల పెన్షన్ హక్కుల మీద వేటు వేసి ఉసురు పోసుకున్న పాపం కూడా నాటి కాంగ్రెసు పాలకులదే కదా! ఆ విధానాలనే అనుసరిస్తున్న టీఆర్ఎస్ పాలనకు కాంగ్రెస్ ప్రత్యామ్నాయం ఎట్లా అవుతుంది. అందుకే ఇప్పుడు కావల్సింది టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెసులు కాదు. ప్రజలే ప్రభువులు కావాలి. ఆ ప్రజల ప్రతినిధిగానే మరో ప్రత్యామ్నాయం కావాలి. ఆ దిశలోనే బహుజన, వామపక్ష, ప్రజాతంత్ర సంఘటన ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. తెలంగాణ గడ్డమీద ఇదొక చారిత్రక అవసరం. ■

ఇప్పటిసందే



తెలిదేవర భానుమూర్తి

నారదుడు నెత్తి మీదికెల్లి తానం జేసిండు. కొప్పేసుకుండు. తంబూరు దీస్కుండు. ఒకపారి టింగ్‌టింగ్ మన్నడు. చిర్తలు దీస్కుండు. ఒకపారి గవ్విటిని కొట్టి జూస్కుండు. గీపారి యాడికి బోవాలె. యాడికి బోతె బాగుంటది. యాడికో ఎందుకు ఎప్పటితీర్గనే యాద్గిరి గుట్టకు బోతె బాగుంటదని నారదుడు అనుకున్నడు. అనుకోని చిర్తలు గొట్టుకుంట నారాయన, నారాయన అన్కుంట గాయిన మొగులు మీదికెల్లి ఎల్లిండు. యాద్గిరి గుట్ట దిక్కు గాయిన రాబట్టిండు. నడ్మల గాయినకు నర్కం దిక్కు బోతున్న దున్నపోతు గల్సింది.

"యాడికి బోతున్నవు నారదా" అని అడిగింది.

"యాద్గిరి గుట్టకు బోతున్న" అని నారదుడు అన్నడు.

"ఎందుకు బోతున్నవు?" అని దున్నపోతు అడిగింది.

"నర్సిమ్మసామితోని ముచ్చట బెట్టెతందుకు" అని నారదుడు అన్నడు.

"గాయినతోని ముచ్చటబెట్టె ఏమొస్తది?" అని దున్నపోతు అడిగింది.

"గాయినతోని ముచ్చటబెట్టె తెలంగానల ఏమైతున్నదో ఎర్కైతది" అని నారదుడు అన్నడు.

"గీయింత దాన్కి యాద్గిరి గుట్టకు ఎందుకు? తెలంగానల ఏమైతున్నదో నేను జెప్త గద" అని దున్నపోతు అన్నది.

"నీకెట్ల ఎర్క?" అని నారదుడు అడిగిండు

"నెల దినాల సంది నేను తెలంగానలనే" అని దున్నపోతు జెప్పింది.

"ఎందుకున్నవు?" అని నారదుడు అడిగిండు.

"నెల దినాల సంది తెలంగానల మా దున్నపోతుల మీటింగ్లు అయినయి. గవ్విటికి నన్ను బిల్సింద్రు." అని దున్నపోతు అన్నది.

"గట్లనా?"

"అవ్"

"గట్లయితె తెలంగానల ఏమైతున్నదో జెరజెప్పు" అని నారదుడు అన్నడు.

"వొచ్చే యాడాదిల అసెంబ్లి ఎలచ్చన్లు ఉన్నయి. గని గాదానికన్న ముందుగాలే ఎలచ్చన్లు బెట్టిపియ్యాలని టిఆర్ఎస్ అనుకుంటున్నది" అని దున్నపోతు అన్నది.

"వొచ్చేయాడాది కన్న ముందుగాలే ఎలచ్చన్లు బెట్టిపిస్తె పాయిద ఏమున్నది" అని నారదుడు అడిగిండు.

"గిప్పుడు మా పార్టికి. జెనంల మంచి పేరు ఉన్నది. జెనంల మంచిపేరు ఉండంగనే ఎలచ్చన్లు అయితె మల్ల మా పార్టినే గెలుస్తది. ఇగ దాంతోని మల్ల మా సర్కార్ వొస్తది అని కెసిఆర్ అనుకుంటున్నడు" అని దున్నపోతు అన్నది.

"ఎలచ్చన్లకు కెసిఆర్ ఎట్ల రడీ అయితున్నడు" అని నారదుడు అడిగిండు.

"గీయాడాదిల వాస్తు తోని కొత్త సెక్రెటేరియట్ గట్టిపిస్త. దినాం సెక్రెటేరియట్‌కు బోత అని కెసిఆర్ అన్నడు" అని దున్నపోతు అన్నది.

"ఇంకే జేస్తున్నడు?" అని నారదుడు అడిగిండు,

"యాడికి బోయినా మోటర్లనే బోవాలని టిఆర్ఎస్ లీడర్లుకు కెసిఆర్ జెప్పిండు.



సంక్రాంతి అయినంక శానమంది లీడర్లు కాంగ్రెస్ల గలుస్తరని టిపిసిసి ప్రెసిడెంట్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అనంగనే కెసిఅర్‌కు బుగులు బట్టుకున్నది. టిఆర్ఎస్ లీడర్ల మీద గాయిన నిగ్రాని బెట్టిండు. ఎవలు కాంగ్రెస్ లీడర్లుతోని మాట్లాడినా ఆల్ల మీద కోపం జెయ్యబట్టిండు. వొచ్చేయాడాది కన్న ముందుగాల్లే ఎలచ్చన్లు అయితె కాంగ్రెస్ లాపతా అయితదని గాయిన అన్నడు. కాంగ్రెస్ లాపతా అయితె టిఆర్ఎస్‌కు ఎదురు ఉండదని గాయిన జెప్పిండు. ఎలచ్చన్ల ముంగట మల్ల ఒక యాగం జేస్తనని గాయిన అన్నడు. యాగం జేస్తె ఎలచ్చన్ల తప్పకుంట గెలుస్తమని గాయిన జెప్పిండు" అని దున్నపోతు అన్నది.

"ముఖ్యమంత్రి ఏమన్న కొత్త పద్కాలు బెడుతున్నడా?" అని నారదుడు అడిగిండు.

"జొన్నరొట్టెల పద్కం బెడ్తున్నడు. జొన్నరొట్టెల మీద మోటర్ గుర్తు చపాయించి గవ్విటిని జెనంకు బంచిపెడ్తరు. సల్ది బువ్వ పద్కం గూడ బెడ్తున్నరు. పొద్దుగాల జెనంకు సల్దిబువ్వ బెడ్తరు. సదువుకునే పోరగాల్లకు అంబట్యాల్ల బువ్వపద్కంల బిర్యాని గూడ బెడ్తరు. దినాం కోడిగుడ్డు గూడ ఇస్తరు. నెలకొక పద్కం పూర్తి అయ్యేటట్లు సూడాలని ముఖ్యమంత్రి జెప్పిండు. గీయాడాదిలనే మిషన్ బగీరత పద్కం పూర్తి గావాలెనని అన్నడు" అని దున్నపోతు అన్నది.

"పద్కాలతోని ఓట్లు బడ్తయా?" అని నారదుడు అడిగిండు.

"పద్కాలతోని ఓట్లు బడ్తయని కెసిఆర్ అనుకుంటున్నడు. రైతులకు ఇర్వైనాలు గ్గంటలు కరెంటు ఇచ్చుడు షురువుజేసిండు. ఇర్వైనాలుగ్గంటలు రైతులకు కరెంట్ ఇస్తె గాల్లు టిఆర్ఎస్‌కే ఓట్లు ఏస్తరని ముఖ్యమంత్రి అన్నడు. దినాం ఒక పద్కంకు శంకుస్తాపన జెయ్యాలని జెప్పిండు. గదే తీర్గ నెలకొక్కపారి ఒక పద్కంకు ఇనాగ్రేషన్ జేపియ్యాలని అన్నడు. చేసిన పద్కంకే మల్లమల్ల శంకుస్తాపన జేపియ్యాలని జెప్పిండు. ఎన్నడు ఎలచ్చన్లు వొచ్చినా సై అని ముఖ్యమంత్రి అన్నడు. మంత్రులు, ఎమ్మెల్యేలు పట్నంల ఉండకుంట ఊర్లపొంటి దిర్గాలని. జెప్పిండు. నాత్రి పూట ఊర్లనే పండాలని అన్నడు. హాస్టల్ పోరగాల్లతోని కల్సి బువ్వ దినాలని జెప్పిండు. పద్కాల గురించి ఒక్క తీర్గ ప్రచారం జెయ్యాలని అన్నడు. ప్రచారం జేసెతందుకు తలా ఒక పుంగి ఇస్తమని జెప్పిండు" అని దున్నపోతు అన్నది.

"ముఖ్యమంత్రి సర్వేలు గూడ జేపిచ్చిండా?" అని నారదుడు అడిగిండు.

"ఎవలు జెనంతోని దిర్గుతున్నరు. ఎవలు బిలిస్తె మీటింగ్లకు జెనం వొస్తరు. ఎలచ్చన్ల ఎవలు గెలుస్తరు. జెనంకు ఎవలు అంటె ఇస్టం లేదు. అనే దాని మీద ముఖ్యమంత్రి సర్వే జేపిచ్చిండు. సర్వేలు జేపిచ్చి మంత్రులు, ఎమ్మెల్యేలకు మార్కులిచ్చిండు. తక్వ మార్కులు వొచ్చినోల్లకు ఎలచ్చన్ల టికిట్ ఇచ్చే సవాల్ లేదని జెప్పిండు. కాలేస్వరం ప్రాజెక్టు గురించి, మిషన్ బగీరత గురించి జెనంకు ఒక్కతీర్గ జెప్పాలని అన్నడు. చీమంత జేసినా ఏన్గంత ప్రచారం జెయ్యాలని ముఖ్యమంత్రి జెప్పిండు. నర్కం బోయేడ్డి ఉన్నది. మల్ల గలుస్త" అన్కుంట దున్నపోతు నర్కం దిక్కు బోయింది. నారాయన, నారాయన అన్కుంట నారదుడు వైకుంటం బోయిండు.

తోక... పొద్దు మీకింది. ఎప్పటిలెక్కనే చౌరస్తల ఉన్న పాన్ డబ్బ కాడ్కి బోయిన. గాడ పాన్లు దినుకుంట మా దోస్తులు ముచ్చట బెడ్తున్నరు.

"పసుల గడ్డి కుంబకోనంల లాలూ ప్రసాద్ యాదవ్‌ను జేల్ల బెట్టింద్రు" అని సత్నారి అన్నడు.

"జేల్ల సలి బెడుతున్నదని లాలూ అంటె తబ్ల గొట్టుకోండ్రి అని సిబిఐ అదాలత్ జడ్జి అన్నడు" అని యాద్గిరి అన్నడు.

సెల్: 995915049

రిపోర్టర్స్ డైరీ

అయ్యో గవర్నర్...

కొంతమంది తాము ఏమి చేసినా చెల్లుబాటు అవుతుంది అని అనుకుంటారు. అలా చేసినప్పుడు ఆ పనులు కొంతమందికి మంచిగా అనిపించొచ్చు. పొగిడితే మరింత ఆనందపడిపోయి ఉంటారు. మరికొందరికి కంటగింపు కూడా ఉంటుంది. అలాంటి వ్యక్తిని ఎక్కడోచోట పట్టుకుని ఇరికించాలని ప్రయత్నాలు జరుగుతుంటాయి. మన గవర్నర్ నరసింహన్ గురించి తెలియని వారు ఉండరేమో. ఇప్పుడు కాంగ్రెస్‌పార్టీ నేతలు ఇచ్చిన షాక్‌తో ఆయన కంగుతిన్నారు. ఒక్కోసారి అనవసరంగా మాట్లాడితే ఎలాంటి నష్టం జరుగుతుందో గవర్నర్ ఉదాహరణగా చూపిస్తున్నారు. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హరీశ్వరరావును, రేవంత్‌రెడ్డిని వ్యక్తిగతంగా పొగిడిన సందర్భాలున్నాయి. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రిని ఆకాశానికెత్తుతున్నారు. ప్రతిపక్ష పార్టీల వినతులను పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. తాజాగా ఇసుక మాఫియాపై కాంగ్రెస్‌పార్టీ నేతలు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లినప్పుడు, ఆయనకు, కాంగ్రెస్‌పార్టీ నేతలకూ వివాదం జరిగింది. గతంలో మాదిరి అందరితో మాట్లాడినట్టుగా గవర్నర్ ప్రయత్నించడంతో కాంగ్రెస్‌పార్టీ నేతలకు మండిపోయింది. ఇలా అవుతుందని గవర్నర్ కూడా ఊహించి ఉండరు. సరియైన సమయంలో గవర్నర్‌ను ప్రజల ముందు దోషిగా నిలబెట్టామని కాంగ్రెస్‌పార్టీ నేతలు సంబరపడిపోతున్నారు. జరగాల్సిన నష్టం జరిగిపోవడంతో ఇప్పుడెన్ని నష్ట నివారణ చర్యలు తీసుకుంటే ఏముంటుందని రాజకీయ పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. అయ్యో గవర్నర్.. పులి పిల్లిలా అవడమంటే ఇదేనేమో అని జర్నలిస్టులు ఉదాహరణగా చూపిస్తున్నారు.

- గుడిగ రఘు

పండ్లున్న చెట్టుకే రాళ్ల దెబ్బలు...

పండ్లున్న చెట్టుకు రాళ్ళ దెబ్బలు... పని చేసే అధికారికి వేధింపులు అన్నట్టు తెలంగాణ ప్రభుత్వం తీరు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. క్షేత్రస్థాయిలో పని చేసే అధికారికి ఒక్కోసారి వేధింపులు తప్పవు. ఆకునూరి మురళి జయశంకర్ జిల్లా భూపాలపల్లి కలెక్టర్. ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ప్రజలకు చేరువలో ఉంటున్నారన్న పేరుంది. తన కూతురును ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం చేయించి ప్రభుత్వ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, ఎందరికో ఆదర్శంగా నిలిచారు. ప్రజలతో కలిసి మెలిసి జీవిస్తే, సాదక బాధకాలు తెలుస్తాయని పూరి గుడిసెల్లో నిద్రించారు. ఏసీ కార్లు పక్కనపెట్టి సైకిల్ మీద తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఒకడుగు ముందుకేసి జిల్లాలోని మొత్తం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ విద్యనందించేందుకు ప్రణాళిక తయారు చేసుకున్నారు. ఇవన్నీ ప్రభుత్వానికి ప్రజా వ్యతిరేక విధానాలు అని అనిపించినట్టుంది. ప్రభుత్వ ఉద్యోగి వృత్తి మాత్రమే చేయాలి తప్ప వృత్తిలో జీవించొద్దు అన్నట్టు ఆ అధికారిని పురావస్తు శాఖకు బదిలీ చేసింది. ఇదేంటని ప్రజలు అవాక్కయ్యారు. పొగిడిన వారంతా నోరెళ్లబెట్టారు. ప్రజల శ్రేయస్సు కోరుకునే ప్రభుత్వం అయితే గనుక ఏ విద్యా శాఖకు కార్యదర్శిగానో లేదా ఏ వైద్య శాఖకు కార్యదర్శిగానో పదోన్నతి కల్పించాలి. కానీ పని చేసే అధికారి చేతులు కట్టేసి పడావుపడ్డ బావిలో పడేసినట్టుంది ప్రభుత్వం తీరుకు ఇది నిదర్శనం.

–మొత్కూరి యాదయ్య

గాల్లో తేలినట్టుందే.. 'గుండె' పేలినట్టుందే...

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత మంచికో, చెడుకో తెలియదుగానీ మార్పుల్లో విపరీతమైన మార్పు వేగవంతంగా చోటు చేసుకుంటున్నది. మన ముత్తాతలు కాలి నడకమీద ఆధారపడ్డారు. తాతల కాలానికి కాళ్ల శక్తి ఆధారంగా నడిచే సైకిళ్లు రోడ్లపైకొచ్చాయి. మన తండ్రుల తరానికి సైకిళ్ల స్థానంలో మోటారు సైకిళ్లు.. స్కూటర్లు రయ్యిమంటూ దూసుకెళ్లాయి. మన పాఠశాల రోజుల్లో ఈ మోటార్ సైకిళ్లలో విపరీతమైన మోడళ్లు, మోపెడ్లు దూసుకొచ్చాయి. ఇగ ఇప్పుడు ప్రస్తుతంలోకి తొంగిచూస్తే.. రోజుకో కంపెనీ, గంటకో మోడల్ అన్నట్టు మోటారు సైకిళ్లలో లెక్కకు మిక్కిలిగా కొత్తగా, కొంగొత్తగా అనేక రకాల బండ్లు రహదారుల మీద ప్రత్యక్షమవుతున్నాయి. సరే.. ఎవరు ఏ బండి వాడినా.. దానికి ఎంత ఖర్చు పెట్టినా మనకు అభ్యంతరం లేదు... కానీ అవి వదిలే పొగ, చేసే శబ్దమే ఇప్పటి మన టాపిక్కు.. దాదాపు పదిహేనేండ్ల విరామం తర్వాత రాయల్ ఎన్‌ఫీల్డ్, బుల్లెట్ కంపెనీలు కొత్త బండ్లను మార్కెట్‌లోకి వదిలాయి. కుర్రకారు, మధ్య వయస్కులు అనే తేడా లేకుండా సంపన్న వర్గానికి చెందిన ప్రతి ఒక్కరూ వీటిమీద విపరీతమైన మోజు పడుతున్నారు. ఇదంతా బానే ఉందిగాని.. ఈ రెండు బండ్లు రోడ్లపై చేసే శబ్దానికి చిన్నపిల్లలు జడుసుకుంటుండగా.. ముసలోళ్లు అదిరిపడుతున్నారు. కుర్రకారు ఇలాంటి బండిమీదెక్కి.. 'గాల్లో తేలినట్టుందే...' అని పాడుకుంటుండగా.. వాటి శబ్దం విని భరించలేని పెద్దోళ్లు మాత్రం.. 'మా గుండెలు పేలినట్టుందే...' అని ఆందోళన వ్యక్తం చేయటం ఇప్పుడు హైదరాబాద్ మహానగరంలో పరిపాటిగా మారింది...

-బి.వి.యన్.పద్మరాజు

అబ్బ.. దొరికింద్రబయ్..

చాలా మంది నాయకులకు, అధికారులకు మీడియా అంటే పిచ్చి ఉంటుంది. చేసే కార్యక్రమాలు, చేస్తున్న పనులు వారి ద్వారానే ప్రచారం కల్పించుకోవాలని తహతహలాడుతుంటారు. కానీ ఇలాంటి వాటికి వ్యతిరేకమైన వ్యక్తి ఒకరున్నారు.. అతను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్. ఆయన ప్రెస్‌మీట్స్ కూడా ఆర్నెల్లకో, ఏడాదికో అన్నట్టు పెడుతుంటారు. అదీ ఉన్నతాధికారుల ఆదేశాలతోనే.. చాలారోజుల తర్వాత రెండురోజుల క్రితం డైరెక్టరేట్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈనెల 8నుంచి హైదరాబాద్‌లో సౌత్ ఇండియన్ సైన్స్ ఫెయిర్ ఏర్పాట్లు, దానికి సంబంధించిన విషయాలను చెప్పేందుకు పెట్టారు. పది నిమిషాల్లో కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించారు. చివరగా 'దీనికి సంబంధించి ఏమైనా సందేహాలుంటే అడగండి' అని మీడియాను ఆయన కోరారు. ఇగ అడిగిందే పాపం.. ఎలక్ట్రానిక్ మీడియా వాళ్లు ఫీజులు, అడ్మిషన్లు, బ్యాగు బరువు, పరీక్షలు, మధ్యాహ్నభోజనం, జీఎస్టీ ఎఫెక్ట్.. ఇలా కమిషనర్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. ఇదే సమయంలో 'ఏంటయ్యా..? ఇన్ని ప్రశ్నలా..? ఇవన్నీ ఎప్పటికప్పుడే పేపర్లలో వస్తున్నాయి కదా..? ఇంకెందుకు ఇవీ' అని పక్కనే ఉన్న ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధిని.. ఓ ప్రింట్‌మీడియా ప్రతినిధి అడిగారు. 'మీకేందయ్యా.. ఏదైనా రాసేయ్యవచ్చు.. కానీ మాకు అలాకాదు కదా.. విజువల్స్ ఉండాలి.. అందుకే ఈ తిప్పలు..' అని సమాధానమిచ్చారు. 'వీటితో ఆర్నెల్ల వరకూ నడిపించొచ్చు...' అని తన సమాధానం కొనసాగిస్తుండగానే అక్కడున్న వారంతా ఒక్కసారిగా గొల్లుమన్నారు.

– గండ్ర నవీన్

బాలకార్మికుల ఆశాదీపం



ప్రొఫెసర్ శాంతాసిన్హా (7 జనవరి 1950)

రేపటి దేశభవిష్యత్ నేటి బాలలకు అందించే విద్యావకాశాల పైనే ఉందని విశ్వసించే ఆమె బాల బాలికలంతా పలకాబలపం పట్టేలే కృషి చేశారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం చేసిన సేవకు రామన్ మెగస్సే అవార్డు అందు కున్నారు. ఆమే నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్‌కు ఛైర్ పర్సన్ పద్మశ్రీ ప్రొఫెసర్ శాంతాసిన్హా ఎంవీ ఫౌండేషన్ స్థాపించి వేలాది మంది బాలల జీవితాల్లో ఆశాదీపాలు వెలిగించిన సామాజిక సేవికురాలు, సంఘసంస్కర్త.

Women of the day

నెల్లూరు జిల్లాలో జన్మించిన శాంత పెరిగింది సికింద్రాబాద్‌లోనే. ఆమె తాత మామిడిపూడి వెంకటరంగయ్య గొప్ప విద్యావేత్త, సమాజవాది, మద్రాసు విశ్వవిద్యాలయంలో చరిత్ర ప్రొఫెసర్. వినూత్న విద్యావిధానానికి కృషిచేసిన సంస్కర్త. ఆమె తండ్రి మామిడిపూడి ఆనందం చార్టెడ్ ఎకౌంటెంట్. ఆయన రెండుసార్లు రాజ్యసభ సభ్యుడుగా ఎంపికయ్యారు. ఆమె సికింద్రాబాద్ సెయింట్ ఆన్స్ హైస్కూలులోనూ, కీస్ హైస్కూల్లోనూ చదివారు. 1972 సంవత్సరంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్రంలో పీజీ పూర్తిచేసారు. 1976లో ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్న తర్వాత హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా చేరారు.

బాలల హక్కులను పరిరక్షిస్తూ.. బాల కార్మిక నిర్మూలన కోసం తన తాత పేరుతో 1981 సంవత్సరంలో ఎంవీ ఫౌండేషన్ (మామిడిపూడి వెంకటరంగయ్య ఫౌండేషన్) స్థాపించారు. సామాజిక మార్పుకోసం పనిచేస్తూ.. వీధిబాలలకు విద్యాబుద్ధులు చెప్పి.. వారికి ఉపాధి కల్పించే లక్ష్యంతో ఈ సంస్థ పనిచేస్తున్నది. ఇప్పటి వరకు ఈ సంస్థ ద్వారా వేలాది మంది బాలబాలికలు విద్యావంతులయ్యారు. ఈ సంస్థలో 80 వేలకు పైగా వాలెంటీర్లు పనిచేస్తున్నారు.

శాంత సిన్హా ఎన్నో జాతీయ అంతర్జాతీయ అవార్డులు అందుకున్నారు. ఆమె సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 1999లో పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. 2003లో రామన్ మెగసేసే అవార్డుతో పాటు అంతర్జాతీయ విద్యాసంస్థ ఆల్బర్ట్ శంకర్ పురస్కారం ఆమె అందుకున్నారు.

లండన్‌లో తెలుగు కోయిల



పుస్తకం మెదడును ఉత్సాహపరిస్తే... పాట మనసును ఆహ్లాద పరుస్తుంది. ఓ మధురమైన శ్రావ్య సంగీతం చెవులకింపుగా ఉంటుంది. చెవిలో తేనె పోసినంత కమ్మగా ఉంటుంది. సంగీతం బండ రాయిని సైతం కరిగిస్తుంది. ప్రతి మనసునూ ఆకట్టుకుంటుంది. అలాంటి అందమైన స్వరాన్ని పుట్టుకతోనే సొంతం చేసుకుంది స్వాతిరెడ్డి. ఇటీవల ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొని అందరి మన్ననలను పొందిన ఆ లండన్ తెలుగు కోయిల గానమాధుర్యాన్ని మనసారా ఆస్వాదిద్దాం రండీ...

స్వాతి పుట్టింది మహబూబ్‌నగర్ జిల్లాలో, పెరిగింది హైదరాబాద్. తల్లి విజయమ్మ, తండ్రి బాలిరెడ్డి, వ్యాపారం చేస్తారు. చిన్నప్పటి నుంచి పాటలంటే ఆమెకు ప్రాణం. ఎక్కడ సంగీతం వినిపించినా చెవి కోసుకునేది. అయితే ఇంట్లో చదువుకే ప్రాధాన్యం. దాంతో చిన్నతనంలో తన దృష్టంతా చదువుపైనే పెట్టింది. తండ్రి కోరిక మేరకు ఎంబీఏ (హెచ్‌ఆర్) పూర్తి చేసింది. అయితే స్కూలు, కాలేజీ రోజుల్లో ఎక్కడ పాటల పోటీలు జరిగినా పాల్గొని బహుమతులు సొంతం చేసుకుంది. చదువుకు ఇబ్బంది కలగకుండానే లైట్ మ్యూజిక్, కర్నాటక సంగీతం నేర్చుకుంది. డిగ్రీ చేసేటప్పుడు పల్లె కోలాటం, జంట కోలాటం పాటలు పాడేది. జానపదగీతాలంటే ఆమెకు అమితమైన ఆసక్తి. అలాగే భక్తి పాటలు కూడా పాడేది.



లండన్ పయనం

చదువు పూర్తి చేసుకున్న తర్వాత లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేసే నరేందర్‌రెడ్డితో పెండ్లి జరిగింది. దాంతో మన తెలుగు కోయిల లండన్ పయనమయింది. అక్కడకు వెళ్ళిన తర్వాత అంతా కొత్త వాతావరణం. అప్పట్లో తెలుగు వారు కూడా పెద్దగా లేరు. ఆ వాతావరణానికి అలవాటు పడటానికి రెండేండ్లు పట్టింది. ఎంబీఏ పూర్తి చేసిన ఆమెకు కెరీర్‌ని ఎలా మలుచుకోవాలనే పెద్ద ప్రశ్న మనసును తొలిచేసింది. ఈ పోటీ ప్రపంచంలో గాయినిగా తనను తాను నిరూపించుకోగలనా? లేదా? అనే అనుమానం వెంటాడింది. కానీ మనసు పాటనే కోరుకుంది. చివరకు పాటే గెలిచింది.

అభిమానం పెరిగింది

ఇటీవల కాలంలో తెలుగుపై అభిమానం బాగా పెరిగింది. గతం కంటే తల్లిదండ్రులు పిల్లలకు తెలుగు నేర్పించడానికి ఆసక్తి చూపుతున్నారు. శ్లోకాలు కూడా నేర్పిస్తున్నారు. దాంతో నా దగ్గరకు వచ్చి సంగీతం నేర్చుకునే పిల్లల సంఖ్య పెరిగింది. మా పిల్లలు కూడా తెలుగు చాలా చక్కగా మాట్లాడతారు. తల్లిదండ్రులు కాస్త శ్రద్ధ తీసుకుంటే విదేశాల్లో పుట్టి, పెరిగిన మన పిల్లలకు కచ్చితంగా తెలుగు వస్తుంది. విదేశాల్లో ఇప్పుడిప్పుడే ఆ ప్రయత్నం జరుగుతుంది. చాలా సంతోషంగా ఉంది. ఈ తెలుగు మహాసభలు మరింత ఉత్సాహాన్ని ఇచ్చాయి. ఇక్కడికి విదేశాల నుంచి వచ్చిన వారు ఎన్నో ఏండ్ల కిందట విదేశాల్లో స్థిరపడ్డారు. అయినా తెలుగును అద్భుతంగా మాట్లాడుతున్నారు.



బతుకమ్మ సంబరాల్లో

మెల్లమెల్లగా అక్కడ తెలుగు వారు జరుపునే ప్రతి కార్యక్రమంలో పాల్గొనడం మొదలుపెట్టింది. ఆమె పాట లేకుండా ఒక్క ప్రోగ్రామ్ కూడా జరిగేది కాదు. ఈలోపు ఇద్దరు పిల్లలు. కొంత కాలం వారి ఆలనా పాలనతో సరిపోయింది. పిల్లలు కాస్త ఎదిగిన తర్వాత మళ్ళీ తన గాన మాధుర్యాన్ని లండన్‌లోని తెలుగు శ్రోతలకు వినే అవకాశం లభించింది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మరిన్ని అవకాశాలు దొరికాయి. అక్కడ ప్రతి పండుగను కనీసం రెండు నెలలపాటైనా ఘనంగా జరుపుకుంటారు. ప్రతి వారాంతరంలో ప్రోగ్రామ్‌లు జరుగుతాయి.

రాష్ట్రం ఏర్పడిన తర్వాత యుకేలో బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. దానికి తోడు భర్త ప్రోత్సాహం లభించింది. ఇక తిరుగేముంది. ప్రతి సంబరంలో స్వాతి స్వరం వినపడాల్సిందే. 'తంగెడు పువ్వా.. మందార పువ్వా.. చేమంతి పువ్వా.. మా బంతి పువ్వా.. గునుగు పువ్వా.. గుమ్మడి పువ్వా.. పువ్వుల పువ్వుల పువ్వుల పువ్వుల పండగా.. నవ్వుల నవ్వుల నవ్వుల నవ్వుల పండగా' అంటూ స్విడ్జర్లాండ్, డెన్మార్క్, బ్యాంకాక్ ఇలా చాలా చోట్ల బతుకమ్మ పాటలు వినిపించి తెలుగు వారి మనసు దోచుకున్నారు. అక్కడి తెలుగు పిల్లల కోసం ఓ సంగీత పాఠశాలను కూడా ఏర్పాటు చేశారు.

లండన్‌లో యాంకర్‌గా...

ఇప్పటికే వందల సంఖ్యలో వివిధ ప్రాంతాల్లో జరిగిన ప్రోగ్రామ్స్‌లో పాల్గొన్న ఆమెకు 'సీతాకోక చిలుక' సినిమాలోని 'అలలు కలలు' అనే పాటను అద్భుతంగా పాడగలదు. అలాగే 'స్వరాభిషేకం' పాటల కార్యక్రమం లండన్‌లో జరిగినప్పుడు అందులో కూడా పాల్గొని బాలసుబ్రమణ్యం గారితో కలిసి పాట పాడే అవకాశాన్ని అంది పుచ్చుకున్నారు. ఎన్నో ఆల్బమ్స్‌లో పాటలు పాడింది. ఒక ఫోక్ ఆల్బమ్ కూడా తీసుకువచ్చింది. అలాగే 'టోరీ' పేరుతో ప్రపంచవ్యాప్తంగా ప్రసారమయ్యే ఛానల్లో 'స్వాతి ముత్యం పలికితే ఆణిముత్యం' అనే తెలుగు ప్రోగ్రామ్‌కు లండన్‌లో యాంకర్‌గా పని చేస్తుంది. స్వాతికి డబ్బింగ్ అన్నా అమితమైన ఆసక్తి. ప్రస్తుతం షార్ట్ ఫిలిమ్స్‌కు డబ్బింగ్ చెబుతుంది. వచ్చిన ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకుంటుంది. ఇంకా వాయిస్ ఓవర్ కూడా చెబుతుంది. యుకేలో జరిగే స్టేజ్ షోలకు యాంకరింగ్ కూడా చేస్తుంది.

ప్రొఫెషనల్‌గా ఎదగాలి

తెలుగు మహాసభలకు గెస్ట్‌గా పిలిచారు. చాలా గర్వంగా అనిపించింది. ఇది అరుదైన అవకాశం. ఇలాంటి అవకాశం మళ్ళీ వస్తుందో లేదో. ఇక్కడికి వచ్చిన వారిలో ఎవర్ని కదిలించినా కవితలు, పాటలు, కథలే. అందరూ ఎంతో నైపుణ్యం కలిగిన వాళ్ళు. లండన్‌లో స్టేజ్‌షోలు, యాంకరింగ్ చేస్తూ, జానపద పాటలు పాడుతూ చాలా బిజీగా ఉన్నాను. ఇండియాలో కూడా మంచి సింగర్‌గా పేరు తెచ్చుకోవాలని కోరిక. సినిమాల్లో కూడా ప్రయత్నం చేస్తున్నాను. స్టేజ్‌షోల ద్వారానే కాక ప్రొఫెషనల్‌గా కూడా ఎదిగే ప్రయత్నంలో ఉన్నాను. త్వరలో నేను కంపోజ్ చేసిన పాటలతో మరిన్ని ప్రైవేట్ ఆల్బమ్స్ తీసుకురాబోతున్నాను.

తెలుగు నేలకు పూల మాల

తెలుగు మహాసభల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆమె రాజ్ భవన్‌లో విదేశీ ప్రతినిధుల కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని సొంతంగా కంపోజ్ చేసిన 'తెలుగు నేల పైన పూలు చల్లరా... తెలుగు భవిత ప్రగతికై కవితలల్లరా తెలుగు పాట పాడరా... తెలుగును కాపాడరా.. గుండె గుండెలోనే తెలుగు నుడికి గుడిని కట్టరా...' అంటూ తన మధుర స్వరాన్ని వినిపించింది. ఇది తెలుగు మహాసభల సందర్భంగా పాడిన పాట. ఈ పాటతో అందరి మనసూ దోచుకుంది. ఈ సందర్భంగా 'తెలుగు నేలకు పూల మాల' పేరుతో ఆమె పాడిన పాటల క్యాసెట్ ఎంపీ కవిత చేతులు మీదుగా రిలీజ్ అయింది.

లండన్‌లో స్టేజ్‌షోలతో బిజీగా ఉన్న ఆమెకు ప్రొఫెషనల్‌గా ఎదగాలని కల. త్వరలోనే ఆమె కల నెరవేరాలని కోరుకుందాం...


సలీమ

ముత్యాల ముగ్గులు



ఎన్. గాయత్రి
గండీ చెరువు
రంగారెడ్డి జిల్లా

డిజైన్ ముగ్గు



21 చుక్కలు
11 వరకు
మధ్య చుక్క
వచ్చేవరకు



పి. కవిత,
గండీ చెరువు
రంగారెడ్డి జిల్లా



ఓ తెల్ల కాగితంపై ముగ్గు వేసి, చక్కటి రంగులతో నింపి మాకు పంపండి. ముగ్గు వేసే విధానం అర్థమయ్యేలా ఉండాలి. ముగ్గులోని చుక్కల సంఖ్య, ఇతర వివరాలను కూడా చేర్చండి. మీ పేరు, చిరునామాతో పాటు మీ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో కూడా జతచేయండి.

మా చిరునామా

మానవి,నవతెలంగాణదినపత్రిక, ఎం.హెచ్. భవన్,
21/1, అజామాబాద్, హైదరాబాద్-20. ఇ-మెయిల్:
navamaanavi@gmail.com

మైమరిపించే కలప సౌందర్యం...

ఊహకు అందని సౌందర్యాలను తమలో దాచుకొని నేరుగా ప్రకృతి ఒడిలో నుంచి జాలువారినట్టు కనిపిస్తాయి కలపతో తయారు చేసిన అలంకరణ వస్తువులు. ఇక ఆ వస్తువులను చూస్తే చాలు మనసుకు హత్తుకుపోయేలా ఉంటాయి. తెలుపు రంగు గోడలపై లేత బ్రౌన్ రంగులో వేలాడే గుండ్రటి చెక్క ముక్కలు... కూర్చోవడానికి విశాలమైన టేబుల్, ఆవనిని తనలో దాచుకున్న ఫొటో ఫ్రేమ్స్ ఇలా ఒక్కటేమిటి చాలా రకాల వస్తువులు ఉన్నాయి. కన్నులను మైమరపించే కలప వస్తువులను కొనాలంటే ఎంతో డబ్బు వెచ్చించాల్సిన అవసరం లేదు. కాస్త సృజనాత్మకత, శ్రద్ధ ఉంటే చాలు ఇలాంటి ఎన్నో వస్తువులను స్వయంగా తయారు చేసుకోవచ్చు. వాటిలో కొన్ని ఈ వారం మీ కోసం...













మచ్చలు మాయం

నిద్ర సరిగా లేకపోతే కండ్ల కింద నల్లటి చారలు ఏర్పడతాయి. ఇది సహజమే. కండ్ల కింద ఉండే నల్లటి చారలు దూరం చేసుకోవాలంటే కింది చిట్కాలను పాటిస్తే సరిపోతుంది.

- బాదం నూనెలో విటమిన్ 'కె' పుష్కలంగా ఉంటుంది. ఇది కండ్ల కింద నలుపును తగ్గించి, చర్మాన్ని ఆరోగ్యంగా మారుస్తుంది. బాదం నూనె నల్లటి వలయాలను క్రమంగా మాయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది సహజ యాంటీ ఆక్సిడెంట్‌లా పనిచేస్తుంది. రాత్రి పడుకునే ముందు కండ్ల కింది భాగంలో కొద్దిగా బాదం నూనెను రాసుకుంటే సరిపోతుంది. ఇలా పలుమార్లు చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.
- ఆలుగడ్డ చర్మానికి బ్లీచింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. ఇది కంటి కింద వాపును, కంటిచుట్టూ ఉండే నలుపు రంగును మాయం చేస్తుంది. ఆలుగడ్డ రసాన్ని కండ్లకింద రాసుకోవాలి. ఇది పూర్తిగా ఆరిన తర్వాత చల్లటి నీటితో కడిగితే మంచి ఫలితం కనిపిస్తుంది.
- వృథాగా ఉన్న టీ బ్యాగులను మరోసారి గోరువెచ్చని నీళ్లలో ముంచి తీసి వాటిని కండ్ల పై ఉంచుకోవాలి. ఇలా చేయడం వల్ల కంటి వాపు తగ్గుతుంది. అలాగే నల్లటి వలయాలు కూడా క్రమంగా తగ్గిపోతాయి. దాంతో పాటు కీరదోస ముక్కల్ని కంటి మీద ఉంచుకున్న సరే మంచి మార్పు కనిపిస్తుంది.



విశ్వవిద్యాలయాల్లో మతోన్మాదుల జోక్యం

- ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి బినయ్ విశ్వం

నవతెలంగాణ-కేయూ క్యాంపస్

కేంద్రంలో నరేంద్రమోడీ పాలనలో విశ్వవిద్యాలయాల్లో మతోన్మాదుల జోక్యం పెరిగి అరాచకాలు పెచ్చరిల్లుతున్నాయని కేరళ మాజీ మంత్రి, ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి బినయ్‌విశ్వం అన్నారు. శనివారం ఏఐఎస్ఎఫ్ జాతీయ సమావేశాలు వరంగల్ కాకతీయ వర్సిటీలో ప్రారంభమయ్యాయి. 29రాష్ట్రాల నుంచి సభ్యులు హాజరయ్యారు. సంఘం పతాకాన్ని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షులు తక్కళ్లపెల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అనంతరం సెమినార్ హాల్‌లో జరిగిన సమావేశానికి ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు సయ్యద్ వలీవుల్లా ఖాద్రీ అధ్యక్షత వహించగా, బినయ్‌విశ్వం ప్రారంభోపన్యాసం చేశారు. విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన విశ్వవిద్యాలయాల్లో మతరాజకీయాలు తగవన్నారు. గౌరీ లంకేష్, లవ్‌జిహాద్ పేరుతో హత్యాకాండ సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశ్రమ విద్యాలయాల పేరుతో బాబాలు, దొంగ స్వాములు వేధింపులకు గురిచేస్తున్నారని, వారికి బీజేపీ సర్కార్ వత్తాసు పలుకుతోందని విమర్శించారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ వలీవుల్లా ఖాద్రీ, విశ్వజిత్ కుమార్ మాట్లాడుతూ.. విద్య, వైద్యం, ఉపాధి రంగాల నుంచి ప్రభుత్వాలు తప్పుకోవాలని చూస్తున్నాయన్నారు. ఈసమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం. వేణు, రవి, శివరామక్రిష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యులు స్టాలిన్ పాల్గొన్నారు.

విశాఖ స్టీల్స్‌లో షేర్ల విక్రయం దేశద్రోహం



విశాఖ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో 10శాతం షేర్ల అమ్మకానికి సిద్ధపడుతోందని, ఈ దేశద్రోహ నిర్ణయానికి వ్యతిరేకంగా కార్మికవర్గంతో పాటు ప్రజలు ఉద్యమంలో భాగస్వాములు కావాలని సీఐటీయూ ఆలిండియా అధ్యక్షులు హేమలత, ఏపీ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నరసింగరావు పిలుపునిచ్చారు. హేమలత మాట్లాడుతూ...డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డీసీఐ)ను ప్రయివేటీకరించాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలని కోరారు. విశాఖ నగరంలోని సిహెచ్ర్స్ కూడలిలో ఉద్యోగులు చేస్తున్న రిలే దీక్షా శిబిరం శనివారంతో ముగిసింది. డీసీఐ ప్రయివేటీకరించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై జరిగిన ప్రజా బ్యాలెట్‌లో 1,01,320 ఓట్లు పోలవ్వగా 1,00,090 ఓట్లు డీసీఐ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగాను, 612 ఓట్లు మాత్రమే అనుకూలంగా వచ్చాయన్నారు. 618 ఓట్లు చెల్లలేదన్నారు. సుమారు 99.39 శాతం మంది డీసీఐ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఓటువేశారని తెలిపారు. ప్రభుత్వానికి ఈ తీర్పు మీద ఏమాత్రం గౌరవమున్నా, డీసీఐ ప్రయివేటీకరణను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు మాట్లాడుతూ డీసీఐని తోనే మోడీ ప్రభుత్వం ఆగదని మొత్తం ప్రభుత్వరంగం పైనే ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జాతీయ నాయకులు మనోజ్‌యాదవ్, సీఐటీయూ నగర ప్రధానకార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఐఎన్‌టీయూసీ నాయకులు కె.ఈశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు మార్కెండేయులు, ఐఎఫ్‌టీయూ నాయకులు మల్లయ్య, డిఫెన్స్ నాయకులు ఆర్.వెంకటరావు, డీసీఐ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు వి.ఎస్.పద్మనాభరాజు తదితరులు పాల్గొన్నారు.

దుర్గ గుడి ఈవోపై వేటు

అమరావతి : దుర్గ గుడి ఈవో సూర్య కుమారిపై ఎట్టకేలకు వేటు పడింది. దుర్గ గుడిలో తాంత్రిక పూజల ఘటనపై విచారణ చేపట్టిన విచారణ కమిటీ తమ నివేదికను శనివారం సమర్పించింది. ఆలయానికి సంబంధం లేని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించకుండా నిరోధించడంలో ఈవో విఫలమయ్యారని నివేదికలో పేర్కొనడంతో ఆమెను బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దేవాదాయ శాఖ కమిషనర్ అనురాధకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించింది. నివేదికపై శనివారం దేవాదాయ శాఖమంత్రి మాణిక్యాలరావు, విజయవాడ నగర పోలీస్ కమిషనర్ గౌతం సవాంగ్ భేటీ అయ్యారు. సవాంగ్‌తో వివరాలను సీఎంకు వివరించారు. భేటీ అనంతరం మంత్రి మాణిక్యాలరావు మాట్లాడుతూ దుర్గగుడిలో ఆలయ నియమాలకు విరుద్ధంగా సంబంధంలేని వ్యక్తులు ప్రవేశించారని విచారణ కమిటీ నిర్ధారించినట్లు తెలిపారు. దుర్గ గుడిలో బయటి వ్యక్తుల ప్రమేయం పై పరిపాలన విధాన లోపాలు ఉన్నాయని గుర్తించామన్నారు.

పాలేకర్‌కు తగదు : కోడెల

ప్రకృతి సేద్యానికి అవసరమైన ఆవులు లేని గ్రామాలు రాష్ట్రంలో చాలా ఉన్నాయి. ఇప్పటికిప్పుడు పెద్ద సంఖ్యలో ఆవులు తీసుకురాలేము. సేంద్రీయ వ్యవసాయం వ్యర్థమని, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు మూసివేయాలని చెప్పటం పాలేకర్‌కు తగదు. సేంద్రీయ వ్యవసాయాన్ని వ్యతిరేకించటం మానుకోవాలి. వానపాముల వినియోగాన్ని విమర్శించటం కూడా సరికాదు. హైబ్రీడ్ విత్తనాలతో దేశంలో ఎన్నో ప్రాంతాల్లో 3 నుంచి 4 రెట్లు అధిక దిగుబడులు సాధించారు. ప్రొఫెసర్ స్వామినాథన్ సిఫారసు మేరకు హైబ్రీడ్ విత్తనాలు మార్కెట్లోకి వచ్చాయి. ఎంతో మంది పరిశోధకులు కొత్త వంగడాలను సృష్టించి రైతులకు మేలు చేశారు.

– గుంటూరులో మీడియాతో స్పీకర్ కోడెల శివప్రసాద్

వీఆర్ఏ సాయిలు మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ...

- టీ మాస్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

కామారెడ్డి జిల్లా కారెగాంవ్ వీఆర్ఏ సాయిలు మృతిపై సిట్టింగ్ జడ్జిచేత విచారణ జరిపించాలని టీ మాస్ ఫోరం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అధికార పార్టీ నాయకులే... సాయిలును ఇసుక మాఫియా ట్రాక్టర్‌తో ఢీకొట్టి హత్య చేయించారంటూ ఆయన కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారని తెలిపింది. ఈనేపథ్యంలో ఆయన మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఫోరం రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వీఆర్ఏ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియోనివ్వాలని కోరారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగమివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా రాష్ట్రంలో ఇసుకపై ఒక ప్రత్యేక విధానాన్ని తీసుకురావాలని ఆయన కోరారు. మాఫియాలను కట్టడి చేసేందుకు వీలుగా చట్టాలను కఠినతరం చేయాలని డిమాండ్ చేశారు.

రాయితీ బకాయిలను వెంటనే విడుదల చేయాలి..

- సీఎంకు జూలకంటి లేఖ

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రైతుల దీర్ఘకాలిక రుణాలకు సంబంధించిన ఆరుశాతం రాయితీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తద్వారా వారిని ఆదుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు శనివారం లేఖ రాశారు. సహకార బ్యాంకుల నుండి రైతులకు ట్రాక్టర్లు, గొర్రెలు, బర్రెలు, మైనర్ ఇరిగేషన్‌కు పైపులైన్లు– మోటార్ల కొనుగోలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆరు శాతం సబ్సిడీ మీద రుణాలను మంజూరు చేసిందని తెలిపారు. అయితే బ్యాంకు వారు గత సంవత్సరం నుంచి ఇందుకు సంబంధించిన సబ్సిడీ ఇవ్వకుండా మొత్తం ప్రీమియాన్ని బలవంతంగా వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు శాతం సబ్సిడీ ఇస్తామంటూ హామీనిచ్చినందువల్లే తాము రుణాలను తీసుకున్నామంటూ రైతులు చెబుతున్నారని వివరించారు. లేదంటే రుణాలను తీసుకునేవాళ్లం కాదంటూ వారు వాపోతున్నారని తెలిపారు. ఈ క్రమంలో ఒక్క ఉమ్మడి నల్గొండ జిల్లాలోనే సుమారు రూ.24 కోట్ల రాయితీ రావాల్సి ఉందని గుర్తుచేశారు. ఇదే విధంగా రాష్ట్రం మొత్తంలో రూ.150 కోట్ల సబ్సిడీ రావాల్సి ఉందని వివరించారు. ఈ విషయాన్ని ఎన్నోసార్లు ప్రభుత్వం దృష్టికి, సంబధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని జూలకంటి తెలిపారు. ఈ నేపథ్యంలో రాయితీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.

ఆధునిక పరిజ్ఞానం అలవడితోనే భవిత

- గీతం ఎంబీఏ విద్యార్థులకు ప్రో వీసీ సూచన

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఆధునిక పరిజ్ఞానం అలవడితేనే భవిష్యత్తు ఉంటుందని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రో వీసీ ఎన్ శివప్రసాద్ చెప్పారు. శనివారం గీతం హైదరాబాద్ బిజినెస్ స్కూల్ (జీహెచ్‌బీఎస్) 2016–18 ఎంబీఏ విద్యార్థుల వీడ్కోలు సభలో ఆయన మాట్లాడుతూ మార్పులకు అనుగుణంగా విజ్ఞానాన్ని పెంచుకొని రాణించాలని సూచించారు. విధేయత, కష్టపడి పనిచేయడం, నిరంతర అభ్యాసం ప్రగతికి తోడ్పడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌బీఎస్ డీన్ అండ్ డైరెక్టర్ వై లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీఈటీఎస్ఏ క్యాలెండర్ ఆవిష్కరించిన నాయిని



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

తెలంగాణ ఉపాధి, శిక్షణ ఉద్యోగుల సంఘం (టీఈటీఎస్ఏ) క్యాలెండర్–2018ను హోం, కార్మిక శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి శనివారం సచివాలయంలో ఆవిష్కరించారు. కష్టపడి పనిచేసి ఐటీఐలను బలోపేతం చేయాలని ఆయన సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడం కోసం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి నాయిని నర్సింహారెడ్డిని శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఈటీఎస్ఏ అధ్యక్షుడు సంపత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సామ శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్యాంసుందర్, కోశాధికారి సారంగపాణి, నాయకులు ఉప్పలయ్య, సునీల్, నరేందర్, అరవింద్, మోహన్‌బాబు, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇది ప్రజోపయోగ యాపే

- టీఎస్‌కాప్స్ యాప్‌పై డీజీపీల కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర డీజీపీకి ప్రశంసలు
- వ్యక్తిగతంగా పలువురు డీజీపీలకు వివరణ

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

దేశంలోనే తొలి సారిగా రాష్ట్ర పోలీసులు రూపొందించిన టీఎస్‌కాప్స్ యాప్ పట్ల గ్వాలియర్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి డీజీపీల కాన్ఫరెన్స్‌లో పలు రాష్ట్రాల అధికారులు ఆసక్తిని కనబరిచారు. ముఖ్యంగా సామాన్య ప్రజలు మొదలుకుని డీజీపీ స్థాయి అధికారి వరకు ఈ యాప్ ద్వారా రోజువారీ పోలీసుల పని తీరును పరిశీలించడానికి ఏ విధంగా వీలవుతుందనే అంశంపై వివిధ రాష్ట్రాల డీజీపీలు ఆసక్తిని కనబరిచారు. గతంలో ఎన్నడు లేని విధంగా ప్రజలు ఇచ్చే ఎలాంటి ఫిర్యాదుపైనైనా సంబంధిత పోలీసులు ఏ విధంగా క్విక్ రెస్పాన్స్ అవుతున్నారు, అక్కడి సమస్యను ఏ విధంగా పరిష్కరించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు, అందులో క్లిష్టమైన పరిస్థితి ఏర్పడితే ఈ యాప్‌ను పరిశీలిస్తున్న ఉన్నతాధికారి ఏ విధంగా కింది స్థాయి అధికారులు , సిబ్బందికి సూచనలు, సలహాలు ఇస్తున్నారు అనే అంశాలు ఇతర రాష్ట్రాలలోను అమలు కావలసిన అవసరం ఉందని కొందరు డీజీపీలు రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డిని ప్రశంసిస్తూ అభిప్రాయపడినట్టు తెలిసింది. ముఖ్యంగా మొదట హైదరాబాద్ సిటీతో ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చి రాష్ట్ర డీజీపీ గా బాధ్యతలు చేపట్టాక దానికి మరో 54 అంశాలను చేర్చి ప్రజలకు, ఇటు పోలీసు అధికారులు, సిబ్బందికి మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చిన తీరును కూడా ఉత్తరాది రాష్ట్రాల డీజీపీల ప్రశంసలు అందుకుందని తెలిసింది.

ఇలాంటి యాప్‌ను రూపొందించడమే గాక దానిని కింది స్థాయి పోలీసు సిబ్బంది విరివిగా ఉపయోగించడానికి అవసరమైన శిక్షణను ఇస్తున్నామని, ఇందులో ప్రజల ఆకాంక్ష మేరకు మరిన్ని అంశాలు జత చేయడానికి కూడా చర్యలు తీసుకుంటున్నామని డీజీపీ మహేందర్‌రెడ్డి తోటి డీజీపీలకు వివరించారని తెలిసింది. శాంతి భద్రతలను సవ్యంగా ఉండడమే గాక బయటి నుంచి పెట్టుబడులను ఆకర్షించే తీరులో రాష్ట్రంలో వాతావరణాన్ని ఏర్పాటు చేయాలనే డీజీపీ లక్ష్యాన్ని కూడా వారు అభినందించారని సమాచారం.

మరో 310 ప్రయివేటు బడులు

- రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖకు యాజమాన్యాల దరఖాస్తు
- గ్రేటర్ హైదరాబాద్‌లోనే 152

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

2018–19 విద్యాసంవత్సరానికి గానూ కొత్తగా అనుమతి కోసం రాష్ట్రవ్యాప్తంగా 310 ప్రయివేటు పాఠశాలలు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాయి. వీటిలో దాదాపు సగం పాఠశాలల దరఖాస్తులు గ్రేటర్ పరిధిలోవే కావడం గమనార్హం. నూతన పాఠశాలల ఏర్పాటు అనుమతి కోసం డిసెంబర్ 31తో ఆన్‌లైన్ దరఖాస్తు గడువు ముగిసింది. ప్రీప్రైమరీ పాఠశాలలు 87, ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు పది పాఠశాలలు, ఒకటి నుంచి ఏడోతరగతి వరకు 107 బడులు, ఒకటి నుంచి పదోతరగతి వరకు 16స్కూళ్లు దరఖాస్తు చేసుకున్నాయి. అప్‌గ్రేడేషన్ విభాగంలో ఆరు నుంచి పదో తరగతి వరకు నాలుగు పాఠశాలలు, 8 నుంచి పదో తరగతి వరకు 62బడులు, తొమ్మిదో తరగతి కోసం ఐదు, పదో తరగతి కోసం మూడు పాఠశాలలు దరఖాస్తు చేసుకున్నాయి. వీటిలో అత్యధికంగా హైదరాబాద్ జిల్లా నుంచి 58, మేడ్చెల్ నుంచి 48, రంగారెడ్డి జిల్లా నుంచి 46 దరఖాస్తులు అందాయి. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు నూతన పాఠశాలలకు డీఈఓలు, ఆర్‌జేడీలు బడులను ప్రత్యక్షంగా పరిశీలించి, అన్ని పత్రాలు సక్రమంగా ఉంటే అనుమతులు ఇవ్వాల్సి ఉంది. హైస్కూల్స్‌కు పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ అనుమతులు ఇస్తారు. అయితే దరఖాస్తు గడువు ముగియడంతో, గడువు పొడగించాలని చాలామంది ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ చుట్టూ నిత్యం ప్రదక్షిణలు చేస్తున్నారు.

అయితే ఆన్‌లైన్ దరఖాస్తు గడువు డిసెంబర్ 31తో ముగిసిందనీ, ఇక గడువు పెంచబోమని కమిషనర్ జి కిషన్ తెలిపారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, అన్ని అనుమతులు ఉంటే ప్రభుత్వ గుర్తింపు ఇవ్వనున్నట్టు చెప్పారు. అనుమతుల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామనీ, ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

నిబంధనలు పాటించేనా..?


రాష్ట్రంలో సుమారు 13వేల వరకు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు ఉండగా, 11,982 బడులకు మాత్రమే ప్రభుత్వం నుంచి అనుమతి ఉంది. అయితే వీటిలో మెజార్టీ బడులు నిబంధనలకు విరుద్ధంగానే ఉన్నాయి. గతంలో విద్యాశాఖాధికారులు గుర్తింపు ఇచ్చే విషయంలో చూసిచూడనట్టు వ్యవహరించడంతో పాటు మామూళ్లు తీసుకుని ఇష్టారాజ్యంగా అనుమతులు ఇచ్చారనేది బహిరంగం సత్యం. ఈకొత్తగా దరఖాస్తు చేసుకున్న పాఠశాలలకైనా అన్ని అనుమతులు పరిశీలించిన తర్వాతే అధికారులు అనుమతులు మంజూరు చేస్తారా.? లేక పాత బాటలోనే కొనసాగుతారా.? అనే త్వరలోనే తేలనుంది.

టీఆర్టీకి మ్యానువల్‌గా దరఖాస్తు చేయండి

- కోర్టును ఆశ్రయించిన అభ్యర్థులకు టీఎస్‌పీఎస్సీ నిబంధన
- 9 నుంచి ఎడిట్ ఆప్షన్లకు ఆన్‌లైన్ అనుమతి

నవతెలంగాణ..హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయ నియామక పరీక్ష(టీఆర్టీ)కి మ్యానువల్‌గా దరఖాస్తు చేయాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) కోర్టును ఆశ్రయించిన విద్యార్థులకు ఆదేశించింది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఒక్కరోజుమాత్రమే అనుమతించింది. దరఖాస్తు ఫారంతో పాటు హైకోర్టు ఆదేశాలను జత చేయాలని నిబంధన విధించింది. అందువల్ల టీఎస్‌పీఎస్సీ ఐడీతో పాటు ఫోటో గుర్తింపు కార్డు,హైకోర్టు ఆదేశాలను కలిపి టీఆర్టీకి దరఖాస్తు చేయాలని అభ్యర్థులను కోరారు. ఇవి లేకుండా దరఖాస్తులు పంపితే అవి తిరస్కరిస్తారు.కోర్టు నుంచి అనుమతి



పొందిన అభ్యర్థులు ఆదివారం మ్యానువల్‌గా దరఖాస్తు చేశాక..ఈనెల 9నుంచి11 వ తేదివరకు ఆన్‌లైన్‌లో వివరాలు నింపటానికి ఎడిట్ ఆప్షన్ సౌకర్యం కల్పించింది. జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి(ఎన్‌సీటీఈ) నిబంధనల ప్రకారం టీఆర్టీకి దరఖాస్తు చేసే జనరల్ అభ్యర్థులకు 50 శాతం మార్కులు,ఇతరులకు 45 శాతం మార్కులుంటేనే అర్హులని విద్యాశాఖ ప్రకటించింది.దీన్ని సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా హైకోర్టు ఇచ్చిన వెసులుబాటు ప్రకారం జనరల్ అభ్యర్థులకు 45 శాతం,ఇతరులకు 40 శాతం మార్కులున్నా టీఆర్టీకి దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా పేర్కొంది.

నేటితో ముగియనున్న టీఆర్టీ దరఖాస్తు గడువు

ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ)కి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే గడువు ఆదివారంతో ముగియనుంది. ఇప్పటి వరకు దరఖాస్తు చేయని అభ్యర్థులకు ఇక ఒక రోజే గడువుంది. ఇప్పటికే దరఖాస్తు చేసిన అభ్యర్థుల వివరాలు ఎడిట్ ఆప్షన్ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ అవకాశం ఈనెల 11వ తేదీ వరకు ఉపాధ్యాయ అభ్యర్థులకు అందుబాటులో ఉంటుంది. 8,792 ఉపాధ్యాయ పోస్టులతో 2017, అక్టోబర్ 21న టీఆర్టీ నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే.

కేసీఆర్ దళిత వ్యతిరేకి

మందకృష్ణను వెంటనే విడుదల చేయాలి : అఖిల పక్ష నేతలు

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్ దళిత వ్యతిరేకి అని పలువురు నేతలు ఆరోపించారు. ఆ వ్యతిరేకతతోనే.. ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇవ్వడం లేదని విమర్శించారు. ఉద్యమం చేస్తున్న మందకృష్ణను అరెస్ట్ చేశారని ఆరోపించారు. మంద కృష్ణ మాదిగను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాల నేతలు హైదరాబాద్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ మాట్లాడుతూ వర్గీకరణ కోసం ఉపవాస దీక్షకు దిగిన కృష్ణను అరెస్ట్ చేయడం సరికాదన్నారు. ఆయనపై నమోదు చేసిన కేసులను ఎత్తివేసి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎందుకు వర్గీకరణ చేయడం లేదన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి నాగయ్య మాట్లాడుతూ ప్రజల హక్కులను కేసీఆర్ సర్కారు కాలరాస్తున్నదని



మాట్లాడుతున్న నాగయ్య

ఆరోపించారు. ఇంట్లో ఉపవాస దీక్ష చేసే హక్కు కూడా లేకుండా చేస్తున్నారన్నారు. శాంతిభద్రతల విఘాతం పేరుతో మంద కృష్ణను అరెస్ట్ చేయడం సరికాదని, వెంటనే ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఇంటి పార్టీ అధ్యక్షుడు చెరుకు సుధాకర్ మాట్లాడుతూ వర్గీకరణపై అసెంబ్లీలో తీర్మానం చేసిన కేసీఆర్, ఉద్యమాన్ని మాత్రం అణచివేస్తున్నారన్నారు. తెలంగాణ వ్యతిరేకి అయిన గవర్నర్, కేసీఆర్ కుటుంబానికి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ఇసుక మాఫియాపై ఫిర్యాదు చేయడానికి వెళ్తే గవర్నర్ దురుసుగా వ్యవహరించారని తెలిపారు. కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, మాజీ ఎంపి రాజయ్య మాట్లాడుతూ వర్గీకరణ జరిగితేనే.. మాదిగలపై వివక్ష పోతుందన్నారు. రాష్ట్రంలో కోటి మంది మాదిగలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. గవర్నర్ పూర్తిగా కేసీఆర్ కోసమే పని చేస్తున్నారని, వెంటనే ఆయనను తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్లు కాశీం, ముత్తయ్య, గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేకుండా పోయిందని తెలిపారు. ముత్తయ్య, తెలంగాణ ఇంటిపార్టీ ఉపాధ్యక్షులు యెన్నం శ్రీనివాసరెడ్డి, నాయకులు చెరకు లక్ష్మక్క, దొమ్మాట వెంకటేశ్, దేవేందర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, సందీప్‌కుమార్, హరీశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నోటికొచ్చినట్టు మాట్లాడొద్దు.. జాగ్రత్త

కేటీఆర్, లక్ష్మారెడ్డికి రేవంత్ హెచ్చరిక

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

తగిన ఆధారాలతో వాస్తవాలు బయటపెడితే జీర్ణించుకోలేక తనపై మంత్రులు కేటీఆర్, లక్ష్మారెడ్డి ఇష్టమెచ్చినట్టు మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి విమర్శించారు. వాస్తవాలు తెలుసుకోకుండా నోటికొచ్చినట్టు మాట్లాడొద్దని సూచించారు. 'ప్రతిపక్ష పార్టీల నేతలపై మంత్రులు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారు. నన్ను మానసికంగా దెబ్బతీయాలని ప్రయత్నం చేస్తున్నారు.మీరు పైశాచికంగా అంటున్న మాటలనే మా అభిమానులు మీ ఇంటకొచ్చి చేసి మరీ చూపిస్తారని ఆయన హెచ్చరించారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్టీ రిజర్వేషన్ వల్ల మంత్రి కేటీఆర్ భార్య, ఆయన మామ లబ్ధిపొందారంటూ తగిన ఆధారాలను చూపితే దానిపై మాట్లాడకుండా తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారన్నారు. తన కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, మేము తలుచుకుంటే ఆ మాటలనే మీ ఇంటికొచ్చి నిజం చేస్తామని హెచ్చరించారు. వైద్య, ఆరోగ్య శాఖమంత్రి లక్ష్మారెడ్డి విద్యార్హతపై తన ఉన్న ఆధారాల ప్రకారమే తాను మున్నాభాయ్ ఆర్‌ఎంపీ అని వ్యాఖ్యానించా నని, ఆ వ్యాఖ్యలకు తాను ఇప్పటికీ కట్టుబడి ఉన్నట్టు తెలిపారు. మంత్రి లక్ష్మారెడ్డి 2004లో ఇచ్చిన అఫిడ విట్‌లో గుల్బర్గ యూనివర్సిటీ నుంచి 1988లో ఉతీర్ణులైనట్టు పేర్కొన్నారన్నారు. లక్ష్మారెడ్డి చెబుతున్న దానికి ఎన్నికల అఫిడవిట్‌కు పొంతన కుదరడం లేదన్నారు. దీంతో ఆయన ఉత్తీర్ణతపై అనేక అనుమా నాలు వస్తున్నాయన్నారు. ఇప్పటికైనామంత్రి తన విద్యకు సంబంధించిన విషయంలో స్పష్టమైన ప్రక టన చేస్తూ ఆయన విద్యార్హత పత్రాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకే గతంలో తనపై వ్యాఖ్యలు చేశానని మంత్రి లక్ష్మారెడ్డి మధ్యవర్తుల ద్వారా రాయభారం చేశారని తెలిపారు. మంత్రి సమ క్షంలో ఆయన అను చరుడు తన కుటుంబంపై అను చిత,



అసభ్యకరంగా వ్యాఖ్యలు చేస్తే వారి వారించ లేకపోయారని చెప్పారు.

చెంచాగిరి చేస్తున్న గవర్నర్: వీహెచ్

పదవీ పొడిగింపు కోసమే రాష్ట్ర గవర్నర్ నరసింహన్ రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు చెంచాగిరి చేస్తున్నారని ఏఐసీసీ కార్యదర్శి వి.హను మంతరావు ఆరోపించారు. తనరాజకీయ జీవితంలో ఇలాంటి గవర్నర్‌ను చూడలేదన్నారు. శనివారం గాంధీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లా డితే మంచిదని హితవు పలికారు. కులాలపేరుతో ప్రజలను విభజిస్తున్నారని ఆరోపించారు. మాజీ ఎంపి మల్లురవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దళా రులకు మద్దతుగా నిలుస్తూ రైతులను పట్టించు కోకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కాంగ్రెస్ నేత కార్తిక్‌రెడ్డి మాట్లాడుతూ ఎవరి భూముల విలువ పెంచేందుకు రంగారెడ్డి జిల్లాలోని పలు గ్రామాలను మృగవాణి జోన్‌గా మార్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.

పెరిగిన స్టాఫ్‌నర్సు పోస్టులు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

వైద్య ఆరోగ్య సంక్షేమ శాఖలో ప్రకటించిన స్టాఫ్ నర్సు పోస్టుల సంఖ్య 1,603కు పెరిగాయి. 242 స్టాఫ్‌నర్సు పోస్టులకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. తాజాగా 1,361 పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో స్టాఫ్‌నర్సు పోస్టుల సంఖ్య 1,603కి పెరిగాయి. ఈమేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పోస్టులకు సంబంధించిన పూర్తి వివరాలు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

8 నుంచి 17 వరకు హైకోర్టుకు సంక్రాంతి పండుగ సెలవులు

నవతెలంగాణ–హైదరాబాద్

ఈ నెల 8 నుంచి 17 వరకు హైకోర్టుకు సంక్రాంతి పండుగ సెలవులను ప్రకటించారు. అత్యవసర కేసుల్ని ఈ నెల 11న విచారణకు న్యాయమూర్తులు ఎస్వీ భట్, దుర్గాప్రసాదరావులతో కూడిన డివిజన్ బెంచ్, న్యాయమూర్తి రామలింగేశ్వరరావు ఏకసభ్య కోర్టులు పనిచేస్తాయి.

జర్నలిస్టుల తొలగింపుపై ఎన్ఏజె ఆందోళన

హైదరాబాదు: ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలలో పెద్ద ఎత్తున జర్నలిస్టులను తొలగించటం పట్ల నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎన్ఏజె) అధ్యక్షుడు ఎస్.పాండే, ప్రధాన కార్యదర్శి ఎం కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. యాజమాన్యాల చర్యలను నిరోధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలని వారు విజ్ఞప్తి చేశారు. యాజమాన్య చర్యలను నిరోధించేందుకు, ఉద్యోగ భద్రత కొరకు మీడియాలోని అన్ని తరగతుల జర్నలిస్టులు ఆందోళనకు సిద్ధంకావాలని పిలుపు నిచ్చారు.

ఫ్లవర్ షో

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

ఇకబానా ఇంటర్ నేషనల్ హైదరాబాద్ చాప్టర్ మారిగోల్డ్ హోటల్‌లో శనివారం ఫ్లవర్ షో నిర్వహించారు. ఈ షోను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి యస్ పి సింగ్, టూరిజం మరియు సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశం ప్రారంభించి మాట్లాడారు. జపాన్‌లో ప్రారంభమైన ఈ సంస్కృతి మన దేశ సంస్కృతి సంప్రదాయాలకు దగ్గరగా ఉందన్నారు. జపాన్‌లో గౌతమ బుద్ధుడిని పూలను అలంకరించి సమర్పించే సంప్రదాయం ఉందన్నారు. ఇది మన బతుకమ్మ సంప్రదాయానికి దగ్గరగా ఉందని తెలిపారు. ఇకబానా సంస్థ హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షురాలు వీనితా సునీల్ కుమార్. 25 మంది ఫ్లవర్ మహిళ డిజైనర్లు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు స్వామినాథన్ అభినందనలు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రైతులకు 24 గంటలపాటు విద్యుత్‌ను అందిస్తామంటూ ప్రకటించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, రాజ్యసభ మాజీ సభ్యులు ఎమ్మెస్ స్వామినాథన్ అభినందించారు. ఈ మేరకు జనవరి ఒకటిన ఆయన సీఎంకు లేఖ రాశారు. సాగునీటి కొరత ఎక్కువగా ఉండే తెలంగాణకు, ఇక్కడి రైతులకు ఇది వరంలాంటిందని పేర్కొన్నారు. ఈ నిర్ణయం సాగుకు జీవం పోస్తుందని తెలిపారు.

ఆకాశంలో అరుదైన అద్భుతం

- నేడు గురు,కుజ గ్రహాల్ని చూసే అవకాశం

న్యూఢిల్లీ : మానవుడి జీవితకాలంలో గురు, కుజ గ్రహాల్ని మామూలు కంటితో చూసే అవకాశం అరుదుగా వస్తుంది. మరి అలాంటి రోజు నేడు రానేవచ్చింది. అందునా అత్యంత సమీపంగా వచ్చిన ఈ రెండుగ్రహాల్ని ఒకేసారి చూసుకునే అంతరిక్ష అద్భుతమిది. ఆదివారం తెల్లవారుజామున 3.20 సమయానికి ఆకాశంలో తూర్పు, ఈశాన్య దిశల్లో గనుక పరిశీలనగా చూస్తే గురు, కుజ గ్రహాలు దేదీప్యమానంగా వెలుగుతుండటాన్ని చూడొచ్చు. బైనాక్యులర్స్‌తోగానీ, మామూలు టెలిస్కోప్‌తోగానీ చూసినట్టయితే ఇంకా స్పష్టంగా ఈ రెండు గ్రహాల్ని చూడొచ్చు. రాకెట్ ప్రయాణం చేయకుండా, అంతరిక్షంలో అడుగుపెట్టడకుండానే...అద్భుత ఘట్టాల్ని చూసి ఆనందానుభూతిని పొందొచ్చు.

బుర్రా వెంకటేశ్, రమణాచారి ఆధ్వర్యంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ పోస్టర్ విడుదల

నవతెలంగాణబ్యూరో– హైదరాబాద్

31వ హైదరాబాద్ నేషనల్ బుక్ ఫెయిర్ ఈ నెల 18 నుంచి 28 వరకు హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ స్టేడియంలోని తెలంగాణ కళాభారతిలో జరగనుంది. దీనికి సంబంధించి పోస్టర్‌ను శనివారం సాయంత్రం సెక్రటేరియట్‌లోని మీడియా లాంజ్‌లో యువజన, పర్యాటక, సాంస్కృతిక, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ప్రభుత్వ సలహాదారు రమణాచారి, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, బుక్ ఫెయిర్ చైర్మెన్, అధ్యక్షులు గౌరీ శంకర్, ప్రధాన కార్యదర్శి కోయ చంద్రమోహన్, సభ్యులు ఖయ్యూం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ సకుటుంబ సపరివారంగా పుస్తక ప్రదర్శనను వీక్షించాలని కోరారు. పిల్లల నుండి పెద్దల వరకు పుస్తకాలు అందుబాటులో ఉంటున్నందున, ప్రతి ఒక్కరూ వచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ బుక్స్ ఎన్ని ఉన్నా పుస్తక పఠనం మించి మరోటి ఉండదన్నారు. రమణాచారి మాట్లాడుతూ పుస్తక ప్రియులను మరో ప్రపంచంలోకి తీసుకెళ్తుందన్నారు. గౌరీ శంకర్ మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 28 వరకు జరిగే పుస్తక ప్రదర్శన మధ్యాహ్నం 2.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఉంటుందన్నారు. శని, ఆదివారాల్లో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఉంటుందన్నారు. గతేడాది పది లక్షల మంది పుస్తక ప్రదర్శనను వీక్షించగా, ఈ సంవత్సరం అంతకుమించి హాజరవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నో రకాల పుస్తకాలు ఈ ప్రదర్శనలో ఉంటాయన్నారు. దీనిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఇరాన్‌లో హింసకు అమెరికా ఆజ్యం

- పౌర అణు ఒప్పందాన్ని రద్దు చేయటం కోసమే ఇదంతా : ఐరాసలో రష్యా రాయబారి
- భద్రతా మండలిలో చర్చ అవసరం లేదన్న చైనా, రష్యా, ఫ్రాన్స్


ఐక్యరాజ్యసమితిలో రష్యా రాయబారి వాస్సిలీ నెబేజియా

న్యూయార్క్ : ఇరాన్‌లో జరుగుతున్న ఆందోళనలు, నిరసనల్ని మరింత పెద్దవిచేసి, హింసాత్మక ఘటనలు జరిగేట్టు అమెరికా కుట్రలు చేసిందని, హింసకు ఆజ్యం పోయటం ద్వారా ఇరాన్ పౌర అణు ఒప్పందం రద్దయ్యేట్టు చేయాలన్నదే అమెరికా వ్యూహమని ఐక్యరాజ్యసమితిలో రష్యా రాయబారి వాస్సిలీ నెబెజియా ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొద్ది రోజులుగా ఇరాన్‌లో చోటుచేసుకుంటున్న ఘటనలపై ఐరాస భద్రతా మండలి అత్యవసర సమావేశమవ్వాలని అమెరికా పిలుపునిచ్చింది. ఇరాన్ అంశాన్ని ఐరాస వేదికపైకి అమెరికా ఏకపక్షంగా తీసుకురావటాన్ని నెబెజియా తప్పుబట్టారు. ఇంకా ఆయన ఏమన్నారంటే...

"ఇరాన్‌లోని ఆందోళనలు, నిరసనలపై అమెరికా మాట్లాడుతోంది. మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని ఆరోపిస్తున్నది. అమెరికా అసలు ఉద్దేశాలు, కారణాలు వేరే ఉన్నాయి. ఇరాన్ ప్రజల ప్రయోజనాల్ని దృష్టిలో పెట్టుకొని అమెరికా ఇదంతా చేస్తోందని భావించలేము. ఇరాన్ పౌర అణు ఒప్పందాన్ని రద్దు చేయించాలన్నదే అమెరికా అసలు లక్ష్యం" అని అన్నారు. భద్రతా మండలిలో ఇరాన్ అంశాన్ని చర్చించాలన్న అమెరికా వాదనను చైనా, ఫ్రాన్స్, రష్యా సహా మరికొన్ని దేశాలు వ్యతిరేకించాయి.

ఇరాన్‌లో నేడు జరుగుతున్న ఘటనలు..ఆ దేశ అంతర్గత అంశమని, ఒకవేళ దీనిపై సమావేశమవ్వాలనుకుంటే, ఐరాస వద్ద సరైన కారణాలు ఉండాలని నెబెజియా అన్నారు. దీనికంటే ముందు అమెరికాలో నల్లజాతీయుడు మైఖేల్ బ్రౌన్ హత్య, అనంతర ఘటనలపై కూడా భద్రతా మండలి సమావేశం జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

పెద్దది చేయాలన్న ప్రయత్నాల్ని అంగీకరించకూడదు : ఫ్రాన్స్

ఐరాసలో ఫ్రాన్స్ రాయబారి ఫ్రాంకోయిస్ డెలాట్రీ మాట్లాడుతూ..."ఇరాన్ అంశంపై భద్రతా మండలి సమావేశం అవ్వాల్సిన అవసరం లేదు. ఇరాన్‌లో జరుగుతున్న నిరసనలు ఆందోళనకలిగించేవే అయినా, అవి ప్రపంచ శాంతి, భద్రతలను భగ్నం చేసేటంతవి కావు. ఇరాన్ అంశాన్ని మరింత పెద్దది చేయాలన్న ప్రయత్నాల్ని అంగీకరించకూడదు" అని చెప్పారు.

గతవారం రోజులుగా ఇరాన్‌లో పెద్ద ఎత్తున ఆందోళనలు, ర్యాలీలు, నిరసనలు జరుగుతున్నాయి. ఆర్థిక పరిస్థితిని సరిదిద్దాలని, రాజకీయ నాయకత్వంలో మార్పు రావాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. అయితే, ఈ ఆందోళనల నేపథ్యంలో దేశవ్యాప్తంగా పలు నగరాల్లో పెద్ద ఎత్తున హింస చోటుచేసుకుంది. ఇప్పటివరకూ 22 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఆందోళనలు, హింస వెనుక అమెరికా, ఇజ్రాయిల్, సౌదీ అరేబియా దేశాలున్నాయని ఇరాన్ ప్రభుత్వం ఆరోపిస్తున్నది. దేశం బయటి శక్తులే దీని వెనుకున్నాయనడానికి తమ వద్ద గట్టి ఆధారాలున్నాయని ఇరాన్ చెబుతోంది.

పాక్, ఇరాన్ అంతర్గత వ్యవహారాలలో అమెరికా జోక్యం


- టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్



ఇస్తాంబుల్ : పాకిస్తాన్, ఇరాన్ దేశాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకుంటున్న అమెరికా, ఇజ్రాయిల్‌లపై టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాక్, సిరియా, లిబియా, ట్యునీషియా, సూడాన్, చాద్ తదితర దేశాలలో కూడా ఇదేవిధంగా జోక్యం చేసుకుంటున్నారని ఫ్రాన్స్ పర్యటనకు వెళ్ళడానికి ముందు ఇస్తాంబుల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన చెప్పారు. ఇవన్నీ ఇస్లాం దేశాలని, అక్కడ నివసించే ప్రజలందరూ ముస్లింలని ఆయన పేర్కొన్నారు.

అమెరికా సాయం చాలా స్వల్పం

- పాక్ ప్రధాని అబ్బాసీ



ఇస్లామాబాద్: అమెరికా నుంచి పాకిస్థాన్‌కు అందుతున్న సాయం చాలా చాలా తక్కువని పాక్ ప్రధాని షాహిద్ ఖక్వాన్ అబ్బాసీ అన్నారు. సొంత నిధులతోనే ఉగ్రవాదంపై పోరాటం చేస్తున్నామని, యూఎస్ మిలియన్ల డాలర్ల నిధులు ఇస్తున్నట్టు వస్తున్న వార్తలన్నీ అవాస్తవమని ఆయన కొట్టి పారేశారు. ఓ పత్రికకు ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు.

"గత ఐదేండ్లుగా అమెరికా పాక్‌కు ఇస్తున్న ఆర్థిక సాయం ఏటా 10 మిలియన్ డాలర్ల కంటే తక్కువగా ఉంది. ఇది చాలా చాలా తక్కువ సాయం. కానీ నేను పత్రికల్లో వచ్చిన వార్తలను గమనించాను. 250 మిలియన్ డాలర్లు, 500 మిలియన్ డాలర్లు, 900 మిలియన్ డాలర్లు అని ఇలా ఒక్కోరకంగా ఉంది. అదంతా అవాస్తవం" అని ఆయన తెలిపారు. 2016లో అమెరికా పాక్‌కు 778 మిలియన్ డాలర్లు ఆర్థిక సాయం చేసిందని ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఆయన కొట్టిపారేశారు. "పాకిస్థాన్ సార్వభౌమ దేశం. పాక్ ఉగ్రవాదులకు స్వర్గధామంగా ఉందని కొంతమంది చేస్తున్న వ్యాఖ్యలన్నీ అసత్యాలు. మా సొంత నిధులను ఖర్చుపెట్టుకుంటూ ఉగ్రవాదులతో మేము యుద్ధం చేస్తున్నాం" అని అబ్బాసీ చెప్పారు.

ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవడం లేదన్న కారణంతో పాకిస్థాన్‌కు ఏటా ఇచ్చే 1.15 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.7,290 కోట్లు) భద్రత సాయాన్ని అమెరికా ప్రభుత్వం శుక్రవారం నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో 2016 సంవత్సరానికి కాంగ్రెస్ ఆమోదించిన 255 మిలియన్ డాలర్ల (రూ.1,616 కోట్లు) విదేశీ మిలటరీ నిధులు కూడా ఉన్నాయి.

11 మంది సౌదీ యువరాజులు అరెస్ట్

దుబాయ్: సౌదీ అరేబియాలో రాజ వంశానికి చెందిన 11 మంది రాకుమారులను అరెస్ట్ చేసినట్లు అక్కడి న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. రియాద్‌లో సౌదీ రాజుకు చెందిన ఓ రాజభవనం ఎదుట ఆందోళన చేసే ప్రయత్నం చేశారు. అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆదేశించినప్పటికీ వెళ్లకపోవడంతో వారిని అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. రాజ కుటుంబానికి చెందిన భద్రత బలగాలు వారి అరెస్ట్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు న్యూస్ వెబ్‌సైట్లో తెలిపింది.

తమ బంధువుకు సంబంధించిన ఓ కేసు తీర్పులో పరిహారం ఇవ్వాలని, రాజ వంశీయులకు నీటి, విద్యుత్ బిల్లులను ప్రభుత్వం చెల్లించడాన్ని రద్దు చేస్తూ రాజు తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేయడానికి ప్రయత్నించారు. ఈ 11 మంది రాకుమారులను అత్యంత భద్రత ఉండే హైర్ జైలుకు తరలించినట్లు తెలుస్తోంది.

మెక్సికో గోడ నిర్మాణానికి 18 బిలియన్ డాలర్లు

ట్రంప్ సర్కార్ ప్రతిపాదనలు

శాన్‌డిగో: అమెరికా మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణం కోసం ట్రంప్ యంత్రాంగం 18 బిలియన్ డాలర్లు (సుమారుగా రూ.1.14 లక్షల కోట్లు) వెచ్చించేందుకు ప్రతిపాదనలు చేసింది. రాన్నున్న పదేళ్లలో మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణానికి ఈ మొత్తం కావాలని తెలిపింది. మెక్సికోతో గోడకు సంబంధించి అధ్యక్షుడు ట్రంప్ ఎన్నికల వాగ్దానం చేసిన సంగతి తెలిసిందే. అందుకు తగ్గట్టుగా ఆయన నేతృత్వంలోని ఉన్నతాధికారులు బ్లూప్రింట్‌ను విడుదల చేశారు. ఈ మేరకు సరిహద్దులో ఎక్కడెక్కడ, ఎలా గోడ నిర్మించాలి, ఎంత వ్యయం అవుతుందని అంచనాలు వేస్తున్నారు. ఈ ఏడాది 118 కిలోమీటర్ల మేర టెక్సాస్, కాలిఫోర్నియాల్లో గోడ నిర్మాణం లేదా ఫెన్సింగ్ పునర్నిర్మాణానికి ట్రంప్ యంత్రాంగం 1.6బిలియన్ డాలర్లు కావాలని కోరింది. వచ్చే ఏడాది కూడా మరో 1.6బిలియన్ డాలర్లు కావాలని కోరినట్టు అధికారులు తెలిపారు.

కస్టమ్స్, సరిహద్దు రక్షణ దళాలు సరిహద్దు రక్షణ వ్యయం కోసం 33బిలియన్ డాలర్లు కావాలని ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. ఇందులో గోడ కోసం 18బిలియన్ డాలర్లు, టెక్నాలజీ కోసం 5.7బిలియన్ డాలర్లు, రోడ్డు నిర్మాణం నిర్వహణ కోసం ఒక బిలియన్ డాలర్లు, సరిహద్దులో 5000 కొత్త పెట్రోల్ ఏజెంట్లకు, 2500 సరిహద్దు ఇన్స్‌పెక్టర్లకు, ఇతర సిబ్బందికి కలిపి 8.5బిలియన్ డాలర్లు కావాలని కోరినట్లు అధికారులు తెలిపారు.

ట్రంప్ పాలసీ.. అత్యంత చెత్త నిర్ణయం!

అమెరికా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం

వాషింగ్టన్ : హెచ్-1బీ వీసాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి సరైంది కాదని వివిధ రంగాల నిపుణులు హెచ్చరిస్తున్నారు. తాజాగా యూఎస్-ఇండియా బిజినెస్ కౌన్సిల్(యూఎస్ఐబీసీ) కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. వర్క్ వీసాపై ట్రంప్ సర్కార్ విధానంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసింది. 'బై అమెరికన్.. హైర్ అమెరికన్' నినాదంతో ముందుకు వెళ్తూ వర్క్ వీసా నియమాలను ట్రంప్ కఠినతరం చేస్తున్నారు. దీనివల్ల అమెరికాలో భారత్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. ఇక హెచ్-1బీ వీసాపై అమెరికాలో ఉంటున్నవారు ఆరేండ్లలోపు గ్రీన్‌కార్డు రాకపోతే స్వదేశానికి పంపే ప్రతిపాదనను తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో యూఎస్ఐబీసీ తాజాగా ఓ ప్రకటన విడుదల చేసింది.

"అమెరికాలో ఏండ్లుగా నివాసం ఉంటూ గ్రీన్‌కార్డు కోసం వేచి చూస్తున్న నైపుణ్యం గల వారికి ఇది నిజంగా శరాఘాతమే! ఇది అత్యంత చెత్త నిర్ణయం. బహుశా వారు మళ్లీ అమెరికాకు రాలేరేమో. ఈ విధానం అమెరికా వ్యాపార రంగానికి, ఆర్థిక వ్యవస్థకు దేశానికి ఎంతో హానికరం. ఒక లక్ష్యంతో సాగుతున్న అమెరికన్ వలస విధాన వ్యవస్థకు ఇది విఘాతం కలిగించేది" అని యూఎస్ఐబీసీ ప్రతినిధి తెలిపారు. వీసా చట్టాన్ని సవరించాలంటూ ట్రంప్ చేసిన ప్రతిపాదనలు భారతీయులపై తీవ్ర ప్రభావం చూపుతాయని 'బ్లూమ్‌బెర్గ్' కూడా పేర్కొంది. దశాబ్దకాలంగా గ్రీన్‌కార్డుల కోసం ఎంతో మంది భారతీయులు ఎదురుచూస్తున్నారని వారందరిపైనా పెను ప్రభావం పడుతుందని ఒబామా ప్రభుత్వంలో డిప్యూటీ అసిస్టెంట్ అటార్నీ జనరల్‌గా పనిచేసిన లియాన్ ఫ్రెస్కో అభిప్రాయపడుతున్నారు.

బ్రిటన్‌లో ప్రజారోగ్యానికి ముప్పు

- అరకొర నిధులు, ప్రైవేటీకరణ చర్యలే కారణం



లండన్ : ఏండ్ల తరబడి అరకొర నిధులు, ప్రయివేటీకరణ, లాభార్జనే ధ్యేయంగా చర్యలు తీసుకోవడం వంటి కారణాల వల్ల బ్రిటన్‌లోని జాతీయ ఆరోగ్య సేవలు (నేషనల్ హెల్త్ సర్వీస్-ఎన్‌హెచ్ఎస్) తీవ్ర విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. జులై నాటికి ఎన్‌హెచ్ఎస్ 70వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది. ఇన్నేళ్ళ సుదీర్ఘ పయనంలో కూడా ఇంకా మనుగడ కోసం పోరు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వాలు తీసుకుంటున్న పొదుపు చర్యలతో ప్రజల ఆరోగ్య పరిస్థితి మరింత దుర్భరంగా తయారైంది.

వారం రోజుల క్రితం, మొదలైన నూతన ఏడాదికి సరికొత్త ఆకాంక్షలతో ప్రపంచం మొత్తం స్వాగతం పలికింది. ఐతే, 2016-17ను 'నవజాత శిశు సంరక్షణ సంవత్సరం'గా పాటించిన ఈ ప్రపంచమే ఆ పసిగుడ్డుల రక్షణ చర్యల్లో మాత్రం ఎలాంటి మార్పును తీసుకురాలేకపోయింది. ఫలితం.. ముక్కుపచ్చలారని చిన్నారుల మరణ యాతన ! ప్రతి ఏటా.. జనవరి మొదటి రోజున పుట్టిన నవజాత శిశువుల గణాంకాలను పరిశీలిస్తున్నామే గానీ, పుట్టి 24గంటలు గడవకముందే తల్లి పొత్తిళ్లలోనే చివరి శ్వాస వదులుతున్న చిన్నారుల సంఖ్యను తగ్గించే విధానాల అమలును విస్మరిస్తున్నాం.

కడవేర్గు

నయాసాల్‌లో.. పుడుతూనే..

- 2018, జనవరి 1న పుట్టిన 3,86,000 మంది శిశువులు
- నవజాత శిశు జననాల్లో, మరణాల్లో ఇండియానే టాప్
- అరకొర చర్యలతో చేతులు దులుపుకుంటున్న ప్రభుత్వాలు: డబ్ల్యూహెచ్ఓ, ప్రపంచబ్యాంక్
- 'నవజాత శిశు సంరక్షణ సంవత్సరం'లోనూ కానరాని మార్పు
- యూనిసెఫ్ నివేదికలో వెల్లడైన పలు అంశాలు

పుట్టింది 3,86,000.. బతికేది ఎంతమంది?:

2018 సంవత్సరం మొదటి రోజున (జనవరి 1) ప్రపంచవ్యాప్తంగా సుమారు 3,86,000 నవజాత శిశువులు జన్మించారని.. అత్యధికంగా 69,070 మంది పిల్లలతో భారతదేశం ప్రథమ స్థానంలో నిలిచిందని యూనిసెఫ్ (యునైటెడ్ నేషన్స్ చిల్డ్రన్స్ ఫండ్) వివరించింది. ఐతే, కొత్త ఏడాదిలో పుట్టిన 90శాతం మంది పసివారు తక్కువ అభివృద్ధి చెందిన దేశాలలోని వారేనని సదరు సంస్థ విడుదల చేసిన గణాంకాలను చూస్తే అవగతమవుతోంది. ఇప్పుడు, ఇదే అంశం ప్రతీఒక్కరిలో ఆందోళనను కలిగిస్తోంది. దీనికి కారణం లేకపోలేదు. గత కొంత కాలంగా ప్రపంచాన్ని వేదిస్తున్న నవజాత శిశు మరణాలు ఎక్కువగా (సుమారు 50శాతానికి పైగా) భారత్, పాకిస్థాన్, నైజీరియా, కాంగో, ఇథియోపియా దేశాల్లోనే సంభవిస్తున్నాయి. ఇప్పుడు, యూనిసెఫ్ విడుదల చేసిన 2018 మొదటి రోజున పుట్టిన నవజాత శిశువుల జాబితా టాప్ ఎనిమిది స్థానాల్లో ఈ ఐదు దేశాలు ఉండటాన్ని చూస్తే.. ఈ సంవత్సరం సగటున సదరు దేశాల్లోనే నవజాత శిశు జననాలు అత్యధికంగా చోటుచేసుకోబోతున్నాయని.. ఆయా దేశాల్లో పుట్టిన చిన్నారుల్లో ఎంతమంది బతికి బట్టకడతారోనన్న చర్చ జరుగుతోంది.

కండ్లు తెరవకుండానే.. అనంతలోకాలకు:

2016 సంవత్సరం జనవరి 1న పుట్టిన నవజాత శిశువుల్లో సుమారు 2,600 మంది పసివాళ్ళు 24గంటలు గడవకముందే చనిపోగా, ఆ ఏడాది పుట్టిన చిన్నారుల్లో దాదాపు 20లక్షల మంది పిల్లలు పుట్టి 7రోజులు కాకుండానే అనంతలోకాలకు వెళ్ళారని యూనిసెఫ్ పేర్కొంది. మొత్తంగా చూసినట్టయితే, 2016లో 26 లక్షల మంది శిశువులు పుట్టుకతోనే మరణించగా.. ఈ నవజాత శిశుమరణాలు భారత్‌లోనే అత్యధికంగా (24 శాతం) సంభవించడం విచారకరం. ఇక, ఇండియా తర్వాత.. పాకిస్థాన్ (10 శాతం), నైజీరియా (9 శాతం), కాంగో (4 శాతం), ఇథియోపియా (3 శాతం) దేశాల్లో నవజాతశిశు మరణాలు చోటుచేసుకున్నాయి. కాగా, ఈ ప్రహసనం ఇలాగే కొనసాగితే.. 2030 లోపు ప్రపంచవ్యాప్తంగా సుమారు మూడు కోట్లమంది నవజాత శిశువులు మరణించే అవకాశం ఉన్నదని యూనిసెఫ్, ప్రపంచ ఆరోగ్యసంస్థ, యూఎన్‌డీఈఎస్ఏ, ప్రపంచబ్యాంకులు విడుదల చేసిన నివేదికలు ఇప్పటికే వివిధ దేశాల ప్రభుత్వాలను తూర్పారబట్టడం గమనార్హం.

ఇప్పటికైనా చర్యలకు పూనుకోవాలి:

నైపుణ్యమున్న ఆరోగ్య సిబ్బందిని గ్రామస్థాయి నుండి అందుబాటులో ఉంచడం, పుట్టగానే నవజాత శిశువులకు టీకాలు వెయ్యడం, మాతా శిశు రక్షణకు కావలసిన అత్యవసర మందుల ధరలను తగ్గించడంతో పాటూ ఆడపిల్లలు కౌమార దశలో ఉన్నప్పుడే సరైన పోషకాహా రాన్ని అందేలా చూడటం, ప్రసూతి సమయంలో ఇన్‌ఫెక్ష న్లు రాకుండా చర్యలు తీసుకోవడం, న్యూమోనియా, డయేరియా వంటి రోగాలు చిన్నారుల దరికి చేరకుండా చెయ్యడంతో పాటు పుట్టిన పిల్లలకు తల్లిపాలు అందిం చడం ద్వారా నవజాత శిశువుల మరణాలను అదుపులోకి తేవచ్చని నిపుణులు, స్వచ్ఛంద నివేదికలు పేర్కొంటు న్నాయి. ఇకనైనా, మన పాలకులు నవజాత శిశు మరణాలు లేని భారతదేశాన్ని సష్టించలేకపోయినా.. సదరు చిన్నా రుల మరణాలు తక్కువగా ఉన్న జాబితాలోనైనా ఇండియాను చేరుస్తారని కోరుకుందాం.

నవజాత శిశు మరణాలు అంకెల్లో

- 48 - దేశంలో ప్రతీ వెయ్యిమంది నవజాత శిశువుల్లో చనిపోతున్నవారు
- 56 లక్షలు - 2016లో ఐదేండ్ల వయసు రాకుండానే మరణించిన చిన్నారులు
- 3 కోట్లు - ప్రస్తుత పరిస్థితులు మారకుంటే, 2030లోపు చనిపోయే నవజాత శిశువుల సంఖ్య



రాష్ట్రం	నవజాత శిశు మరణాలు (వెయ్యికి)
మధ్యప్రదేశ్	54
అసోం	54
ఉత్తరప్రదేశ్	50
ఒడిస్సా	50
రాజస్థాన్	47

(ఫైల్)



రూ. 500 కోట్ల పనులు చేయాలి

అధికారులకు జూపల్లి దిశానిర్దేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వచ్చే మూడు నెలల్లో కనీసం రూ.500 కోట్ల విలువైన ఉపాధి హామీ పనులను పూర్తి చేయాలని జిల్లా గ్రామీణాభివద్ధి అధికారులను పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖ మంత్రి జూపల్లి క ష్ణారావు ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని గ్రామీణాభివద్ధి శాఖ కమిషనర్ కార్యాలయంలో డీఆర్‌డీవో (జిల్లా గ్రామీణాభివ ద్ధి అధికారులు)లతో సమీక్ష నిర్వహించారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ కింద చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఉపాధిహామీ జాబ్ కార్డ్ ఉన్న ప్రతి ఒక్క కూలీకి 100 రోజుల పనిదినాలు కల్పించే లక్ష్యంతో కార్యక్రమాలను రూపొందించుకోవాలని సూచించారు. రాబోయే మూడు నెలల కాలంలో చురుగ్గా పనులు సాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాదిహామీ పథకం క్రింద చేపట్టిన గ్రామ పంచాయతి భవనాలు, వైకుంఠ దామాలు, స్కూల్ టాయిలెట్స్, ఫార్మ్ పాండ్స్ తదితర పనులనుత మార్చి 31వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. ఈ ఏడాది చివరి నాటికి ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండేలా టార్గెట్ పెట్టుకుని పనిచేయాలని ఆదేశించారు. ఉపాదిహామి పథకం కింద పండ్ల తోటల పెంపకం లక్ష్యం పూర్తి చేయాలని. ఆ దిశగా ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. ఉపాదిహామీ పనుల గురించి ప్రతి గ్రామంలో మైక్‌సెట్ల ద్వారా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. అలాగే రూర్బన్ పథకం కింద మంజూరైన అన్ని క్లస్టర్లల్లో పనులు ప్రారంబించి, త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో వాటర్‌షెడ్ కార్యక్రమంలో చేపట్టిన పనులను వేగంగా అమలుచేసి, భూగర్భజలాలను పెంపొందేలా పాటుపడాలని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో కమిషనర్ నీతూ కుమారి ప్రసాద్, జాయింట్ డైరెక్టర్లు సైదులు, జాన్ వెస్లీ తదితరులు పాల్గొన్నారు

పంచాయతీరాజ్ డైరీ ఆవిష్కరణ

పంచాయతీరాజ్ ఇంజినీర్స్ అసోసియేషన్ 2018 సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. కమిషనర్ నీతూ ప్రసాద్, పీఆర్ ఇంజినీర్ ఆన్ చీఫ్ ఎం.సత్యనారాయణ, చీఫ్ ఇంజినీర్లు కె.తిరుపతిరెడ్డి, ఆర్,రవిప్రకాశ్, డీసీఈ సమీ, పీఆర్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ముజీబ్, కోశాధికారి రజిత పాల్గొన్నారు.

ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ల డైరీ

ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ల అసోసియేషన్ కొత్త సంవత్సర డైరీని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ శనివారం హైదరాబాద్‌లోని గెజిటెడ్ భవన్‌లో ఆవిష్కరించారు. ఇందులో నాయకులు మమత, సత్యనారాయణ, వెంకట్రామిరెడ్డి, కిషన్‌రావు, నర్సింహ్మాచారి, శ్రీనివాసరావు, కృష్ణ, రాము, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అర్థాంతరంగా ఆగిన విద్యాశాఖ వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్ శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అర్థాంతరంగా నిలిచిపోయింది. షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 3గంటల నుంచి ఐదు గంటల వరకు ఈ సమావేశం ఉంది. అయితే డైరెక్టరేట్‌లో ఇంటర్నెట్ లైన్‌కట్ కావడంతో ఉన్నతాధికారులు హైదరాబాద్ కలెక్టరేట్ నుంచి ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రారంభించిన కొద్దిసేపటికే అన్ని జిల్లాల్లోనూ లైన్‌కట్ అయింది. ఎంతసేపటికీ బాగుకాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు జి కిషన్ డీఈఓలకు సమాచారమిచ్చారు. 37 అంశాల ఎజెండాతో ఉన్న ఈ వీడియో కాన్ఫరెన్స్‌ను త్వరలోనే నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.


హైదరాబాద్‌లో...

టీఆర్ఎస్ నేత అశోక్‌రెడ్డిని అరెస్ట్ చేయాలి

తెలంగాణ రజకవృత్తిదారుల సంఘం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన టీఆర్ఎస్ నేత అశోక్‌రెడ్డిని అరెస్టు చేయాలని తెలంగాణ రజకవృత్తిదారుల సంఘం డిమాండ్ చేసింది. బోధన్‌కు చెందిన రజక కులానికి చెందిన శ్రీనివాస్‌ను కులం పేరుతో దూషించి పెట్రోల్ పోసి చంపుతానంటూ హెచ్చరించినందుకు నిరసనగా శనివారం హైదరాబాద్‌లోని గోల్కొండ చౌరస్తాలో అశోక్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేసింది. ఈ సదర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ టీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అండతో ఆయన అణగారిన కులాలపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అశోక్‌రెడ్డిని టీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసి అరెస్టు చేయాలన్నారు. ఈ ఆందోళనలో సంఘం గౌరవాధ్యక్షులు పైళ్ల ఆశయ్య, పాల్గొన్నారు.

ఫీజులు చెల్లించాలంటూ.. సంక్షేమ భవనం ముట్టడి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శనివారం సంక్షేమ భవాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయకపోవడం వల్ల వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. కాలేజీ యాజమాన్యాలు కూడా అధ్యాపకులకు వేతనాలు చెల్లించడం లేదన్నారు. వెంటనే ఫీజులను విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నవచిత్రం

గ్రాండ్‌గా గ్యాంగ్ ప్రీ రిలీజ్ వేడుక



జ్ఞానవేల్ రాజా, వంశీ, విఘ్నేష్ శివన్, రమ్యకృష్ణ, కీర్తి సురేష్, సూర్య, అల్లు అరవింద్, రేవంత్, మారుతి

సూర్య, కీర్తి సురేష్ జంటగా విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'తానా సెంథ్ర కూట్టమ్'. ఈ చిత్రాన్ని యువి క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్‌లు తెలుగులో 'గ్యాంగ్' పేరుతో విడుదల చేస్తున్నారు. ఈ నెల 12న ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యాన్ని పురస్కరించుకుని శుక్రవారం చిత్ర ప్రీ రిలీజ్ వేడుకను హైదరాబాద్‌లో వైభవంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ, 'మన అందరికీ స్కూల్‌లో ఓ గాంగ్, కాలేజ్‌లో ఓ గ్యాంగ్, పనిచేస్తున్న ఆఫీసుల్లో ఓ గ్యాంగ్ ఉంటుంది. అలాంటి గ్యాంగ్ మన లైఫ్‌లో చాలా కీలకమైన పాత్రలను పోషిస్తుంది. తెలుగులో యువి క్రియేషన్స్ వారు మంచి టైటిల్ పెట్టారు. అల్లు అరవింద్ మా 'గ్యాంగ్'లో కీలకమైన వ్యక్తి. సినిమా విడుదలలో బాగా సపోర్ట్ చేస్తున్నారు. అలాగే జ్ఞానవేల్ రాజా కూడా ఇక్కడ నా సినిమాలను రిలీజ్ చేసే గ్యాంగ్‌లో ఒక మెంబర్. ఇప్పుడు వంశీ, ప్రమోద్‌లు జాయిన్ అయ్యారు. రమ్యకృష్ణ కూడా మా గ్యాంగ్‌లో మెంబర్ కావడం ఆనందంగా ఉంది. విఘ్నేష్ శివన్ ఈ సినిమాలో నన్ను కొత్తగా చూపించారు. కీర్తి సురేష్ చాలా బాగా నటించింది. తెలుగులో డబ్బింగ్ కూడా నేనే చెప్పాను. తెలుగు ప్రేక్షకులకిది డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇచ్చే చిత్రమవుతుంది. కుటుంబం అంతా కలిసి చూసేలా సినిమా ఉంటుంది' అని అన్నారు. "గజిని' సినిమా నుంచి సూర్యతో మంచి అనుబంధం కొనసాగుతుంది. నాతో ఆయన సినిమా చేయాలని ప్రయత్నిస్తున్నారు కానీ కుదరడం లేదు. త్వరలోనే ఓ సినిమా చేస్తాం. జ్ఞానవేల్ రాజా, విఘ్నేష్ శివన్ కలిసి చేసిన సినిమాను తెలుగులో విడుదల చేస్తున్న వంశీ, ప్రమోద్‌లకు అభినందనలు' అని అల్లు అరవింద్ తెలిపారు. చిత్ర దర్శకుడు విఘ్నేష్ శివన్ చెబుతూ, 'తెలుగు ప్రేక్షకులు సినిమాను ఎంతగానో ప్రేమిస్తారు. జనవరి 10న మనం అంతా కలిసి 'అజ్ఞాతవాసి' సినిమా చూస్తాం. 12న అందరం కలిసి 'గ్యాంగ్' సినిమాను చూడాలి. ఈ సినిమా చేసే ఛాన్స్ ఇచ్చిన సూర్య, జ్ఞానవేల్ రాజాకి కృతజ్ఞతలు' అని చెప్పారు. 'సూర్య 'గ్యాంగ్' పేరుతో మరో అద్భుతమైన సినిమాను తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. విఘ్నేష్ శివన్ సినిమా 'నాను రౌడీ తా' చిత్రం చాలా ఇన్నోవేటివ్‌గా అనిపించింది. ఆయన సినిమాలో కామెడీ టచ్ బాగుంటుంది. అనిరుధ్ ఎక్స్‌ట్రార్డినరీ మ్యూజిక్ అందించారు. ఈ సంక్రాంతికి అనిరుధ్‌వి రెండు సినిమాలు విడుదలవుతుండటం విశేషం. సూర్య తెలుగు నేర్చుకుని డబ్బింగ్ చెప్పడం మరో గొప్ప విషయం' అని మారుతి తెలిపారు. కీర్తి సురేష్ తెలియజేస్తూ, 'సూర్యతో నటించడం చాలా హ్యాపీగా ఉంది. విఘ్నేష్ టేకింగ్ కొత్తగా ఉంటుంది. రమ్యకృష్ణతో పనిచేయడం మరిచిపోలేని అనుభవం' అని చెప్పారు.

తర్వాత సంగతి తర్వాత..



శ్రియా

'నేను ఏదనుకుంటే అది చెప్పడం నాకు అలవాటు. తర్వాత సంగతి తర్వాత' అని అంటోంది శ్రియా. మోహన్‌బాబు, మంచు విష్ణు, శ్రియా, నిఖిలా విమల్ ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'గాయత్రి'. మదన్ రామిగాని దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని శ్రీ లక్ష్మీ ప్రసన్న పిక్చర్స్ పతాకంపై అరియానా, వివియానా, విద్యా నిర్వాణ సమర్పణలో మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించి ఇప్పటికే మోహన్‌బాబు, మంచువిష్ణు, శ్రియా జంటగా ఉన్న లుక్‌లు విడుదల చేయగా తాజాగా శ్రియా సింగిల్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా సినిమా గురించి చిత్ర బృందం తెలియజేస్తూ, 'విలక్షణ నటుడు మోహన్‌బాబు ఫస్ట్‌లుక్ క్రిస్మస్ కానుకగా విడుదల చేస్తే, దానికి విశేష స్పందన లభించింది. ఈ చిత్రంలో మొదటిసారి విష్ణు, శ్రియాలు జంటగా నటిస్తున్నారు. వీరిద్దరూ ఆదర్శదంపతులుగా కొత్త సంవత్సరం రోజున రిలీజైన పోస్టర్ సందడి చేసింది. తాజాగా విడుదలైన లుక్‌లో శ్రియా మధ్యతరగతి గృహిణికి ప్రతీకగా చీరకట్టుతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఈ లుక్‌కు కూడా మంచి స్పందన లభిస్తోంది. సినిమాలో శ్రియా పాత్రకు మంచి ప్రాధాన్యత ఉంటుంది. ఈ చిత్రానికి ఎస్.ఎస్.థమన్ సంగీతం సమకూరుస్తున్నారు. బ్రహ్మానందం, అనసూయ కీలక పాత్రల్లో కనిపిస్తారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి ఫిబ్రవరి 9న సినిమాను రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు' అని తెలిపింది.



ఎన్టీఆర్, సావిత్రి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, పుల్లెల గోపీచంద్, టైగర్ నాగేశ్వరరావు

ఊపందుకున్న బయోపిక్‌ల ట్రెండ్

నిన్నమొన్నటి వరకు బయోపిక్‌లకు బాలీవుడ్ కేరాఫ్‌గా నిలిచింది. గత రెండేండ్ల కాలంలో ఎన్నో బయోపిక్‌లు బాలీవుడ్‌లో విడుదలై విశేష ప్రేక్షకాదరణ పొందాయి. వీటి విజయపరంపరతో ఈ ఏడాది కూడా పలు బయోపిక్‌లు ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. బాలీవుడ్ మాదిరిగానే ఇప్పుడు టాలీవుడ్ కూడా బయోపిక్‌ల ట్రెండ్‌ని ఫాలో అవుతోంది. స్ఫూర్తిదాయక ప్రముఖులు, గొప్ప చరిత్ర కలిగిన వ్యక్తులు, ప్రజలపై విపరీత ప్రభావం చూపిన మహామహుల జీవితాలకు వెండితెర రూపమిచ్చేందుకు టాలీవుడ్ దర్శక, నిర్మాతలు సైతం అమితాసక్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే అరడజనుకు పైగా నిజ జీవిత కథా చిత్రాలు నిర్మాణంలో ఉండటం విశేషం..

గత రెండేండ్లుగా తన ప్రత్యేకతను చాటుకునే ప్రయత్నంలో తెలుగు సినిమా విజయం సాధించింది. జాతీయంగానే కాకుండా అంతర్జాతీయంగా కూడా తెలుగు సినిమా సత్తా ఏమిటో తెలియజేసింది. అన్నింటికంటే ముఖ్యంగా నవ్యమైన, భిన్నమైన, ప్రయోగాత్మక చిత్రాలతో ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. గతేడాది పలు విభిన్న చిత్రాలతో అద్భుతమైన విజయాలను సాధించి పలు ప్రతిష్టాత్మక పురస్కారాలను కైవసం చేసుకుంది. అదే విజయపరంపరను కొనసాగిస్తూ నూతన సంవత్సరంలోకి తెలుగు సినిమా అడుగుపెట్టింది. ప్రస్తుతం తెలుగునాట కథలపరంగానే కాదు కథానాయకుల పరంగానూ చాలా మార్పులొచ్చాయ్. గతంలో కంటే ఇప్పుడు ప్రయోగాలు చేసేందుకు అమితోత్సాహంతో ఉన్నారు. కంటెంట్ బాగుంటే చిన్నా,పెద్దా తేడా లేకుండా మల్టీస్టారర్ చిత్రాల్లోనూ నటించేందుకు సై అంటున్నారు.

అంతేకాదు ప్రముఖ జీవితాలను వెండితెరపై ఆవిష్కరించడంలో దర్శక, నిర్మాతలెలా ఉత్సుకత చూపిస్తున్నారో, అదే మాదిరిగా నాయకానాయికలు సైతం ఉత్సాహం చూపిస్తున్నారు. దీంతో మన దగ్గర కూడా మెల్లగా బయోపిక్‌ల ట్రెండ్ ప్రారంభమైంది. ప్రస్తుతం ఎన్టీఆర్, సావిత్రి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, పుల్లెల గోపీచంద్, వైఎస్సార్, కేసీఆర్, సైనా నెహ్వాల్, టైగర్ నాగేశ్వరరావు వంటి హేమాహేమీల బయోపిక్‌లు రూపొందుతున్నాయి.

- స్వాతంత్ర్య సమరయోధుడు, 1857 తిరుగుబాటు ముందే బ్రిటీష్ వారిపై తనసైన్యంతో తిరుగుబాటు చేసిన రాయలసీమకు చెందిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం ఆధారంగా 'సైరా నరసింహారెడ్డి' చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇందులో నరసింహారెడ్డి పాత్రధారిగా చిరంజీవి నటిస్తున్నారు. సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో కొణిదెల ప్రొడక్షన్ కంపెనీ పతాకంపై ఈ చిత్రాన్ని రామ్‌చరణ్ నిర్మిస్తున్నారు. చిరంజీవి సరసన నయనతార కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో బిగ్‌బీ అమితాబ్ బచ్చన్, విజయ్ సేతుపతి, సుదీప్, జగపతిబాబు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.
- అలనాటి మేటి నటి సావిత్రి జీవితం ఆధారంగా 'మహానటి' పేరుతో ఓ బయోపిక్ తెరకెక్కుతోంది. 'ఎవడే సుబ్రమణ్యం' చిత్రాన్ని రూపొందించిన దర్శకుడు నాగ్ అశ్విన్ ఈచిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సావిత్రి పాత్రలో కీర్తిసురేష్ నటిస్తున్నారు. సమంత, ప్రకాష్‌రాజ్, దుల్కర్ సల్మాన్, మోహన్‌బాబు, శ్రీనివాస్ అవసరాల, తరుణ్ భాస్కర్ వంటి తదితరులు కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. స్వప్నదత్ నిర్మిస్తున్న ఈ సినిమాను మార్చి 29న విడుదల చేయనున్నట్టు చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించింది.
- మాజీ ముఖ్యమంత్రి, లెజెండరీ నటుడు నందమూరి తారక రామారావు జీవితంపై దర్శకుడు తేజ ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఎన్టీఆర్ పాత్రలో ఆయన తనయుడు బాలకృష్ణ నటించడంతోపాటు స్వయంగా నిర్మించడం విశేషం. ఈ చిత్రం ఇటీవల ప్రారంభమైంది. ఇదిలా ఉంటే, రామ్‌గోపాల్ వర్మ 'లక్ష్మీస్ ఎన్టీఆర్' పేరుతో మరో బయోపిక్‌ను తెరకెక్కిస్తున్నారు. లక్ష్మీ పార్వతి కోణంలో ఈ సినిమా ఉండబోతుందని సమాచారం. అలాగే లక్ష్మీ పార్వతి కోణంలోనే కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి 'లక్ష్మీస్ వీరగ్రంథం' పేరుతో మరో బయోపిక్‌ను ఇటీవల ఆరంభించారు.
- బ్యాట్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ జీవితాన్ని తెరపైకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రవీణ్ సత్తారు దర్శకత్వం వహించబోతున్న ఈ సినిమాలో గోపీచంద్‌గా సుధీర్‌బాబు నటించనున్నారు. ఫాక్స్ స్టార్స్ స్టూడియోతో కలిసి అబుందంటియా ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ చిత్రాన్ని తెలుగు, హిందీలో నిర్మించనుంది. ఈ ఏడాదిలోనే షూటింగ్ ప్రారంభం కానుంది.
- మాజీ సీఎం వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి జీవితం ఆధారంగా ఓ బయోపిక్‌ను నిర్మించేందుకు రంగం సిద్ధమవుతోందని సమాచారం. 'ఆనందో బ్రహ్మ' ఫేమ్ మహి వి.రాఘవ్ ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నారు. వైఎస్ఆర్ పాత్రలో మలయాళ నటుడు మమ్ముట్టి నటించే అవకాశాలున్నాయట.
- తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ జీవితాన్ని సినిమాగా తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నట్టు గతంలో దర్శక,నిర్మాత మధుర శ్రీధర్ ప్రకటించిన విషయం విదితమే. ఈ సినిమాలో కేసీఆర్‌గా బాలీవుడ్ నటుడు రాజ్ కుమార్‌రావ్ నటించే అవకాశం ఉంది. అన్ని కుదిరితే ఈ చిత్రం కూడా ఈ ఏడాదిలోనే ప్రారంభం కానుంది.
- స్టువర్ట్‌పురం గజదొంగ, 'టైగర్' నాగేశ్వరరావు జీవితంపై ఓ బయోపిక్‌ను రూపొందించనున్నారు. ఇందులో టైగర్ నాగేశ్వరరావుగా రానా నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. ఈ సినిమాను 'కిట్టు ఉన్నాడు జాగ్రత్త' ఫేమ్ వంశీకృష్ణ దర్శకత్వం వహించనుండగా, ఎకె ఎంటర్‌టైన్ మెంట్స్ పతాకంపై అనిల్ సుంకర నిర్మించబోతున్నారు. వీటితోపాటు బాడ్మింటన్ స్టార్స్ పి.వి. సింధు, సైనా నెహ్వాల్ బయోపిక్‌లు తెరకెక్కబోతున్నాయి.

500 కోట్ల దిశగా టైగర్..

సల్మాన్ ఖాన్ నటించిన 'టైగర్ జిందా హై' చిత్రం 500 కోట్ల మార్క్ దిశగా పయనించడం విశేషం. గతేడాది డిసెంబర్ 22న విడుదలైన ఈ చిత్రం కేవలం 15 రోజుల్లోనే ప్రపంచ వ్యాప్తంగా రూ.487 కోట్లు రాబట్టడం విశేషం. ఇండియాలో రూ.374 కోట్లు కలెక్ట్ చేయగా, ఓవర్సీస్‌లో రూ. 113కోట్లు వసూలు చేసింది. మూడో వారం పూర్తయ్యేలోపు ఈజీగా 500కోట్ల మార్క్‌ను దాటడమే కాకుండా మరిన్ని కొత్త రికార్డులను సృష్టిస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు.

నో ఛేంజ్



సమంత

'పెళ్లి తర్వాత నాలో ఎలాంటి మార్పు రాలేదు. అంతా ఎప్పటిలాగే ఉంది' అని అంటోంది సమంత. హీరో నాగచైతన్యతో సమంత వివాహం గతేడాది అక్టోబర్‌లో జరిగింది. ఆ తర్వాత వెంటనే పలు చిత్రాల షూటింగ్‌లతో ఈ ఇద్దరు నూతన దంపతులు బిజీ అయిపోయారు. సమంత ప్రస్తుతం విశాల్‌తో కలిసి 'అభిమాన్యుడు' చిత్రంలో నటిస్తోంది. ఈ చిత్ర తెలుగు ట్రైలర్ శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ, 'ప్రస్తుతం తెలుగు, తమిళం చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నాను. పెళ్ళి అయిన తర్వాత నేనేమీ మారలేదు. మ్యారేజ్ అయిన కొన్ని రోజుల తర్వాత నుంచే షూటింగ్‌ల్లో పాల్గొంటున్నా. ఇది వరకే అంగీకరించిన చిత్రాల్లో నటిస్తున్నాను' అని తెలిపింది. ప్రస్తుతం 'రంగస్థలం', 'మహానటి', 'సూపర్ డీలక్స్'తోపాటు తమిళంలో శివకార్తీకేయన్‌కి జోడీగా సమంత ఓ చిత్రంలో నటిస్తుంది. ఇదిలా ఉంటే 'సూపర్‌డీలక్స్'లో సమంత ప్రతినాయిక ఛాయలున్న డీ గ్లామర్ పాత్రలో కనిపించనుందట. ఇకపై ప్రయోగాత్మక చిత్రాల్లోనూ నటించేందుకు సమంత సుముఖంగా ఉందని ఆమె సన్నిహితులంటున్నారు.

క్రైమ్ థ్రిల్లర్‌గా స్ట్రీట్ లైట్స్



మమ్ముట్టి

మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి హీరోగా నటిస్తున్న చిత్రం 'స్ట్రీట్ లైట్స్'. శ్యామ్ దత్ సైనుద్దీన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ప్లే హౌస్ మోషన్ పిక్చర్స్.ప్రై.లి పతాకంపై తెరకెక్కుతోంది. ఈ చిత్ర టీజర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, 'విభిన్నమైన కథల్ని ఎంచుకునే మమ్ముట్టి ఈసారి కూడా ప్రేక్షకులను థ్రిల్ చేసే కథాంశంతో వస్తున్నారు. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో సాగే భిన్న కథా చిత్రమిది. ఈ సినిమాను మలయాళం, తమిళంతోపాటు తెలుగులో కూడా 'స్ట్రీట్ లైట్స్' పేరుతో విడుదల చేస్తున్నాం. తెలుగులో మమ్ముట్టికి వీరాభిమానులున్నారు. ఆయనకున్న క్రేజ్ దృష్ట్యా ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. ఈ చిత్ర తెలుగు టీజర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. దర్శకుడు శ్యామ్ దత్ కథ, కథనం ఆడియెన్స్‌ను మెస్మరైజ్ చేస్తుంది. మమ్ముట్టి కెరీర్‌లో మరో మైలు రాయిగా నిలుస్తుందన్న నమ్మకం ఉంది' అని అన్నారు. స్టంట్ శివ, మొట్ట రాజేంద్ర, పాండి రాజన్, మనోబాల, బ్లాక్ పాండి, శ్రీరామ్, పృథ్వీ పాండిరాజ్, సంపత్ రామ్, రోని తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈచిత్రానికి సంగీతం: ఆదర్శ్ అబ్రహం, కెమెరా: సాదత్ సైనుద్దీన్, ఆర్ట్: సాబు రామ్, ఎడిటర్: మనోజ్.

అజాతశత్రువు



బి.ఎ.రాజు

బి.ఏ.రాజు.. తెలుగు చిత్ర పరిశ్రమలో బాగా సుపరిచితమైన పేరు. పరిశ్రమ వర్గాల్లోనే కాకుండా మీడియాలో సైతం అజాత శత్రువుగా ఆయనకంటూ ఓ ప్రత్యేకత ఉంది. సాధారణ జర్నలిస్ట్ స్థాయి నుంచి సినీ వారపత్రిక అధినేతగా ఎదిగిన వైనం, నాలుగు దశాబ్దాలుగా దాదాపు వెయ్యి చిత్రాలకు పైగా పీఆర్‌ఓగా కొనసాగించిన, సాగిస్తున్న తీరు, అభిరుచిగల నిర్మాతగా అందరూ మెచ్చే చిత్రాల్ని నిర్మిస్తున్న పంథా అభినందనీయం. ఎంత ఎదిగినా ఒదిగే తత్వంతో అటు సినీ వర్గాలకు, ఇటు మీడియాకి అందరివాడుగా పేరొందిన బి.ఎ.రాజు పుట్టినరోజు నేడు (ఆదివారం). ఈ నేపథ్యాన్ని పురస్కరించుకుని ఆయన గురించి కొన్ని విశేషాలు..

జూన్‌లో మరో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



బి.జయ

బి.ఎ.రాజు తన బర్త్‌డేని పురస్కరించుకుని ఓ కొత్త సినిమాకు శ్రీకారం చుట్టబోతున్నారు. సొంత సంస్థ ఆర్.జె. సినిమాస్ పతాకంపై బి.జయ దర్శకత్వంలో మరో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను నిర్మించనున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా బి.ఎ.రాజు మాట్లాడుతూ, 'నిర్మాతగా 15 సంవత్సరాలు పూర్తయింది. మా బ్యానర్‌లో రూపొందిన చిత్రాలను ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. తాజాగా జయ దర్శకత్వంలో మరో చక్కని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ని నిర్మించబోతున్నాం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన కథా చర్చలు జరుగుతున్నాయి. జూన్‌లో ఈ సినిమాని స్టార్ చేస్తాం. అలాగే మా సూపర్‌హిట్ మ్యాగజైన్ 24వ సంవత్సరంలోకి సక్సెస్‌ఫుల్‌గా అడుగుపెట్టింది. అంతేకాకుండా వెబ్‌సైట్ ఇండస్ట్రీ హిట్ డాట్ కామ్ మంచి రేటింగ్‌తో నాలుగో సంవత్సరంలోకి ఎంటర్ అవ్వడం హ్యాపీగా ఉంది' అని చెప్పారు.

గత 40 సంవత్సరాలుగా ఇండస్ట్రీలో రూపొందిన దాదాపు ఏ చిత్రానికి సంబంధించిన విషయంలోనైనా కామన్ వినిపించే పేరు బి.ఏ.రాజు. సినిమా ప్రారంభం నుంచి ప్రేక్షకుల ముందుకొచ్చేంత వరకు సదరు చిత్ర వర్గానికి, మీడియాకి వారధిగా వ్యవహరించే తీరే ఆయన్ని అందరివాడుగా చేసింది. సీనియర్ జర్నలిస్ట్ మోహన్‌కుమార్ సహకారంతో జర్నలిస్ట్‌గా కెరీర్ ప్రారంభించిన ఆయన 12 ఏండ్ల అనుభవంతో 'సూపర్‌హిట్' సినీ వార పత్రికను స్టార్ట్ చేశారు. ఈ వార పత్రిక ద్వారా పబ్లిసిటీలో క్రియేట్ చేసిన సరికొత్త ట్రెండ్‌కు అందరూ ఫిదా అయ్యారు. సినిమా కవరేజ్‌లు, హీరో, హీరోయిన్లకి సంబంధించి సరికొత్త వార్తలు, క్రేజీ కాంబినేషన్లలో రూపొందే సినిమాల హాట్ న్యూస్‌లను ఎప్పటికప్పుడు అందిస్తూ అనతికాలంలోనే ఆయన నడిపే వార పత్రిక 'సూపర్‌హిట్' అయ్యింది. అంతేకాకుండా పోటీ సినీ పత్రికలకు గట్టి సవాల్ విసిరింది. ఇదిలా ఉంటే, ఆయన వార పత్రికలో పనిచేసిన ఎంతో మంది జర్నలిస్ట్‌లు, సాంకేతిక నిపుణులు ప్రస్తుతం మీడియాలోని పెద్ద పెద్ద సంస్థల్లో పనిచేస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే చాలామంది సినిమా జర్నలిస్ట్‌లకు సంబంధించి 'సూపర్‌హిట్' సినీ వార పత్రిక ప్రాథమిక పాఠశాల అని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు.

తెలుగు, తమిళ అగ్ర హీరోల దగ్గర్నుంచి యువ కథానాయకుల వరకు నటించిన ఎన్నో చిత్రాలకు బి.ఏ.రాజు పిఆర్‌ఓగా పనిచేశారు. ప్రతి ఒక్కరితో అత్యంత సన్నిహితంగా మెలుగుతూ దాదాపు 1000 చిత్రాలకు పైగా పిఆర్‌ఓగా పనిచేశారు. అత్యధిక చిత్రాల పిఆర్‌ఓగా బి.ఏ.రాజు త్వరలోనే గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించ బోతున్నారు. అలాగే నిర్మాతగానూ తన అభిరుచిని చాటారు. 'ఆర్.జె.సినిమాస్' పేరుతో బ్యానర్‌ని స్థాపించి 'ప్రేమలో పావని కళ్యాణ్', 'చంటిగాడు', 'ప్రేమికులు', 'గుండమ్మగారి మనవడు', 'లవ్‌లీ', 'వైశాఖం' వంటి చిత్రాల్ని నిర్మించి అభిరుచిగల నిర్మాతగా పేరొందారు. సినిమాకి సంబంధించి ఎన్ని బాధ్యతలు నిర్వర్తించినా ఎంతో సహనంతో అందరినీ కలుపుకుంటూ ఆత్మీయంగా వ్యవహరించి అజాత శత్రువుగా పేరొందారు. తాను అనుకున్న లక్ష్యాలను సాధించడంలో తన సతీమణి, దర్శకురాలు బి.జయ ఎప్పుడూ వెన్నంటి నిలిచారని ఎన్నో సందర్భాల్లో ఆయన చెప్పారు. అంతేకాదు తాను ఏదైనా సాధించానంటే దానికి జయే కారణమని చెబుతారాయన. సాధ్యం కాని విషయాలను ఆలోచిస్తూ బాధపడేకన్నా, సాధ్యమయ్యే పనులు చేసుకుంటూ ప్రతి నిమిషాన్ని సంతోషంగా గడపడానికే ఇష్టపడతానని చెబుతున్న బి.ఎ.రాజుకు 'నవచిత్రం' బర్త్‌డే విషెస్ తెలియజేస్తోంది.

సలాం పెట్టి గులాంగిరి

మున్సిపల్ శాఖ మంత్రిపై బహిరంగసభలో వక్తల మండిపాటు

- సర్కారు తీరు మారకపోతే మనమే మార్చాలని పిలుపు : మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సఫాయి కార్మికులకు సలామ్ పెట్టి గులాంగిరి చేయిస్తావా? అని సీఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం సాయిబాబు ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో మున్సిపల్ శాఖ కేసీఆర్ వద్ద ఉండేదనీ, ఆ తర్వాత ఆయన కొడుకు తారకరామారావుకు అప్పగించారన్నారు.ఎవరొచ్చినా మున్సిపల్ కార్మికుల బతుకు మారలేదని చెప్పారు. సర్కారు తీరు మారకపోతే మనమే ఈ ప్రభుత్వాన్ని మార్చాలని కార్మికులకు పిలుపునిచ్చారు. చీపురు కట్టలు, పలుగు, పారలను ఆయుధాలుగా మార్చి ఈ ప్రభుత్వాన్ని పాతరేయాలన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాంకు గోరి కట్టిన చరిత్ర ఎర్రజెండాకు ఉందని, ఈ దొరల పాలనకు గోరి కట్టేందుకు సిద్ధం కావాలన్నారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) 2వ మహాసభలు పురస్కరించుకుని శనివారం గొల్కొండ చౌరస్తా నుంచి సుందరయ్య పార్కు వద్దకు భారీ ప్రదర్శన నిర్వహించారు. యూనియన్ అధ్యక్షులు కమర్ అలీ అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో సాయిబాబు మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో కేసీఆర్ పాలనలో కార్మికులకు అన్యాయం జరుగుతున్నదన్నారు. కార్మికుల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా మున్సిపల్ కార్మికుల సమస్యలపై స్పందించడం లేదన్నారు. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు వేతనం తీసుకుంటూ కార్మికులకు మాత్రం రూ 18వేలు వేతనం కూడా ఇవ్వడం లేదన్నారు. చంద్రబాబు సృష్టించిన (కాంట్రాక్టు వ్యవస్థ) దోపిడీ వ్యవస్థను కాంగ్రెస్ సర్కారు కొనసాగించడంతో అది వటవృక్షంగా మారిందని, దాన్ని రద్దు చేస్తానన్న కేసీఆర్ ఇప్పటి వరకు రద్దు చేయకుండా ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీల సమస్యల పరిష్కారం కోసం టీ మాస్ ఫోరం పోరాడుతున్నదని, దాంతో చేయి చేయి కలిపి ఈ ప్రభుత్వంపై విస్తృతమైన పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎస్ రమ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులపై ప్రభుత్వ అలనా, పాలనా లేక దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికుల పట్ల ప్రభుత్వంతోపాటు సమాజంలోనూ వారి పట్ల వివక్ష కొనసాగుతుందన్నారు. మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచుతామని, పర్మెంట్ చేస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎన్నో హామీలిచ్చినా వాటిని అమలు చేయలేదన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర మహాసభల్లో మున్సిపల్ కార్మికుల సమస్యలపై చర్చించి పోరాట కార్యచరణను రూపొందిస్తామన్నారు. కార్పొరేషన్లలో కొంత పెంచినా ఇతర మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో వేతనాలు పెంచలేదన్నారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ 18వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన భోనాలు, బతుకమ్మ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) అధ్యక్షులు జె వెంకటేశ్, రాష్ట్ర నాయకులు వివి మంగపతి, అంజయ్య,నిర్మల, ప్రకాశ్, శ్రవణ్, ఎం వెంకటేష్, వాణి, ఈశ్వరరావు, రాజమల్లు, మీనా, లలిత, మల్లేష్, మద్దిలేటి, మనోరంజన్, లోకేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో మహాప్రదర్శన



మరో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహిద్దాం

- పాలకుల భజన సభలుగా మొన్నటి మహాసభలు
- ఆదివాసీ, గిరిజన సంస్కృతికి ప్రాధాన్యత ఇవ్వలేదు: ప్రొ.తిరుమల్‌రావు
- బహుజనుల జీవనవిధానం విస్మరణ: విమలక్క
- కవులు, రచయితలు ప్రజల పక్షాన నిలవాలి: అందెశ్రీ

నవతెలంగాణ–నిజామాబాద్ ప్రతినిధి

తెలంగాణ జానపదం, బహుజనుల సంస్కృతి, పల్లెదనం ఉట్టిపడేలా మరో ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించాలని చర్చాగోష్టిలో వక్తలు అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ హోటల్ తెలంగాణ భాషా–సాహితీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో "ప్రపంచ తెలుగు మహాసభలు–ఒక విశ్లేషణ" అంశంపై శనివారం చర్చాగోష్టి నిర్వహించారు. కవి, రచయిత సిహెచ్.మధు అధ్యక్షత జరిగిన చర్చాగోష్టిలో ప్రొఫెసర్ తిరుమల్‌రావు మాట్లాడారు. డిసెంబర్‌లో ప్రపంచ తెలుగు మహాసభలు పాలకుల భజన సభలుగా సాగాయని అన్నారు. ఆదివాసీ, దళిత, గిరిజన సాహిత్యానికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని చెప్పారు. ఆదివాసీ కవులను పిలిపించి అవకాశం ఇవ్వకుండా అవమానించారన్నారు. తెలంగాణ పల్లెదనం ప్రతిబింబించేలా మరో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు. అరుణోదయ సంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు విమలక్క మాట్లాడుతూ.. తెలుగు మహాసభల్లో తెలంగాణ పాటకు ప్రాధాన్యత దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా సంస్కృతికి పెద్దపీఠం వేయడమంటే.. జానపదం గొంతు నొక్కడమేనని అన్నారు. బహుజనుల జీవన విధానం ప్రతిబింబించేలా మరో మహాసభల నిర్వహణ అనివార్యమన్నారు. ప్రజాకవి అందెశ్రీ మాట్లాడుతూ.. కవులు, రచయితలు పాలకవర్గాలకు లొంగి ఉండొద్దని, ప్రజల పక్షాన గళం విప్పాలని కోరారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో ఉద్యమ గీతాలను విస్మరించడం గర్హనీయమన్నారు. మోదుగుపూలు సంపాదకులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ధూంధాం మళ్లీ తిరగబడిన తెలంగాణ పేరిట నిర్వహించాలని సూచించారు. గ్రామగ్రామాన ధూంధాంలు ఏర్పాటుచేసి సర్కారు నిరకుంశ ధోరణిని ప్రజల్లో ఎండగట్టేందుకు సిద్ధం కావాలని అన్నారు. సామాజికవేత్త, రచయిత నైనాల గోవర్ధన్ మాట్లాడుతూ.. రాబోయే కాలంలో రచనలన్నీ తెలంగాణలో సాంఘిక, ఆర్థిక, సామాజిక చైతన్యం కల్పించే దిశగా సాగాలని ఆకాంక్షించారు. రైతు ఆత్మహత్యలపై పెద్దఎత్తున రచనలు చేయాల్సిందిగా సూచించారు. రచయిత్రి తూర్లపాటి లక్ష్మి మాట్లాడుతూ.. తెలంగాణ కవులు, కళాకారులు పోషించిన పాత్ర గురించి ఎంత వివరించినా తక్కువేనని అన్నారు. ప్రజల పక్షాన పుట్టే రచన, కవిత్వమే కలకాలం నిలుస్తుందని అన్నారు. చర్చాగోష్టిలో పలువురు వక్తలు సూచించిన తీర్మానాలను ప్రముఖ కవి ఎనిశెట్టి శంకర్ ప్రవేశపెట్టారు. ప్రపంచ తెలుగు మహాసభలు జరిగిన తీరును, అందుకు రూ.100 కోట్ల దుబారా ఖర్చును తప్పుబట్టారు. తెలంగాణలోని పూర్వపు 10జిల్లాల్లో బహుజన సాహిత్యానికి ప్రాధాన్యత ఇచ్చేలా మరో ప్రపంచ మహాసభలు నిర్వహించాలని తీర్మానించినట్టు తెలిపారు. ఈ చర్చాగోష్టిలో రచయిత కాలువ మల్లయ్య, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, జూకంటి జగన్నాథం, ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి, నల్లెల రాజయ్య, జి.లచ్చయ్య, సంజీవ్, సభ నిర్వహణ అధ్యక్షులు పంచారెడ్డి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి మామిళ్ల సాయరెడ్డి, ఉపాధ్యక్షులు దండి వెంకట్, కార్యదర్శులు సిర్పలింగం, సంజీవ్, సాహితీప్రియులు పాల్గొన్నారు.

ప్రకాశ్ రాజ్ కాలమ్‌కు బ్రేక్

మొదటిపేజీ తరువాయి

తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసేందుకు ప్రకాశ్‌రాజ్ ఈ కాలమ్‌ను వేదికగా వాడుకునేవారు. విస్తృత ప్రచారంలో ఉన్న ఆ వార్త పత్రిక తన కాలమ్‌ను నిలిపివేయడంలో 'కనిపించని చేతులు' కీలకపాత్ర పోషించాయని ప్రకాశ్ రాజ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. కాగా, ప్రకాశ్ రాజ్ ట్వీట్లపై ఇటీవలే ఆ పత్రికకు ఎడిటర్ బాధ్యతలు స్వీకరించిన శివ సుబ్రమణ్య స్పందించారు. ప్రకాశ్‌రాజ్ చేసిన విమర్శలను ఖండించారు. ఆయన కాలమ్ తొలగింపు వెనుక ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదని చెప్పారు.కాగా తమకు వ్యతిరేకంగా నోరువిప్పేవారిని తొలగించేదాకా బీజేపీ,ఆర్ఎస్ఎస్ శక్తులే వెనుకుంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి

ఉపాధికోల్పోయే వారి గోస వినండి

మొదటిపేజీ తరువాయి

న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

చెరువులు మునిగిపోతాయి

నిజామాబాద్ జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో కొండం, ముంచిప్ప చెరువులను విలీనం చేసే చర్యలను అడ్డుకోవాలని హైకోర్టులో దాఖలైన రిట్‌పై న్యాయమూర్తి స్పందించారు. రెండు చెరువుల్ని విలీనం చేస్తే రైతులవే కాకుండా అటవీ భూములు కూడా మునిగిపోతాయని ముంచిప్ప గ్రామస్తులు 60 మంది హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ ఆరోపణల విషయంలో అధికారులు వేగంగా పనిచేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశిస్తూ ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణ 18కి వాయిదా పడింది.

ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేయాలి

- నేరెళ్ల, కామారెడ్డి బాధితులకు రూ.10 లక్షల చొప్పున పరిహారమివ్వాలి
- సీఎం స్పందించాలి..సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి.. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలి
- నేరెళ్ల బాధితుల సంఘీభావ పాదయాత్ర, సభలో ప్రజాసంఘాల నేతలు

నవతెలంగాణ– సిద్దిపేట టౌన్/ సిద్దిపేట అర్బన్/సిరిసిల్ల/తంగళ్ళపల్లి

రాష్ట్రంలో ఇసుక మాఫియా ఆగడాలు రోజురోజుకీ పెచ్చుమీరిపోతున్నాయని, దానికి రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకట్ట వేయలని పలువురు వక్తలు కోరారు. నేరెళ్ల, కామారెడ్డి ఇసుక మాఫియా ఘటనపై సీఎం స్పందించాలని, సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. బాధితులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ టీజేఏసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రం నుంచి నేరెళ్ల వరకు శనివారం పాదయాత్ర చేపట్టారు. తొలుత సిద్దిపేటలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించి పాదయాత్ర ప్రారంభించారు. నేరెళ్లలో జరిగిన సభలో బాధితులు కష్టాలు చెప్పుకుంటూ కన్నీటిపర్యంతమయ్యారు. ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి తమకు ఏ సాయమూ అందలేదన్నారు. పోలీసుల దెబ్బలతో కనీసం కుటుంబాలను పోషించుకునే శక్తి కూడా తమకు లేకుండా పోయిందని వాపోయారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ... టీఆర్ఎస్ పాలనలో అత్యంత నిర్బంధం కొనసాగుతోందన్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే ఇసుక వ్యాపారం నడుస్తోందని విమర్శించారు. నేరెళ్ల ఘటనలో బాధితును చిత్రహింసలు పెట్టిన ఎస్పీ విశ్వజిత్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇసుక మాఫియా నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలన్నారు. ఆరు నెలలుగా బాధితులు పోరాడుతున్నా..ఉద్యమ నేతగా చెప్పుకునే సీఎం కేసీఆర్ మౌనంగా ఉండటం సరిగాదన్నారు. తమకు న్యాయం చేయాలంటూ చివరకు బాధితులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడే స్థితికి ప్రభుత్వం నెట్టేసిందన్నారు. బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేసే వరకూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని, వారికి బాసటగా నిలుస్తామని భరోసానిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ... నేరెళ్ల బాధితులైన ఎనిమిది మంది నేటికీ కోలుకోలేని పరిస్థితుల్లో ఉన్నారని వాపోయారు. ప్రభుత్వం స్పందించి వారికి న్యాయం చేసి తగిన చికిత్స అందించాలని కోరారు. కామారెడ్డిలో ఇసుక మాఫియాకు బలైన వీఆర్ఏ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రి కేటీఆర్ నియోజకవర్గంలోనే దళితులకు తీరన అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక రవాణా ప్రాణాలు తీస్తున్నదని ప్రశ్నిస్తే పోలీసులతో చిత్రహింసలకు గురి చేసి అక్రమ కేసులు పెట్టడం దారుణమన్నారు. టీజేఏసీ చైర్మెన్ కోదండరామ్ మాట్లాడుతూ...ఇసుక మాఫియా రాజన్న సిరిసిల్ల జిల్లాలో విచ్చలవిడిగా వ్యవహరిస్తోందన్నారు. ఇసుక లారీలను తగలబెడితే ఊరుకుంటామా?అంటూ అధికారులు దబాయించడం కేసీఆర్ పాలనతీరుకు అద్దం పడుతోందన్నారు. తెలంగాణ ప్రభు త్వంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే న్యాయం అడిగిన ప్రజలపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించ డమేననా?, ప్రజాపాలన అంటే ప్రజలను పోలీసులతో కొట్టించ డమేనా? అని ప్రశ్నించారు. సీపీఐ(ఎం–ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి రంగారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రశ్నించే గొంతును నొక్కే పరిస్థితి నెలకొందన్నారు. అక్రమార్కుల వ్యాపారం కోసం ప్రజల ప్రాణాలు, అధికారుల ప్రాణాలు కూడా తీసే స్థాయికి మాఫియా చేరిందన్నారు. శాంతియుత ఉపవాస దీక్ష చేస్తున్న మందకృష్ణ మాదిగను అరెస్టు చేయడం సమంజసం కాదని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘీభావ సభలో ఎంసీపీఐయు రాష్ట్ర కార్యదర్శి తాండ్ర కుమార్, ఎస్‌యూసీఐ నాయకులు, న్యూ డెమొక్రసీ నాయకులు జె.చలపతిరావు, ప్రజాసంఘాల నాయకులు, వామపక్ష నాయకులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి

సిద్దిపేటకు బయలుదేరి వెళ్లేముందు వామపక్షాలు, టీ జేఏసీ, టీపీఎఫ్ నాయకులు సికింద్రాబాద్ క్లాక్ సెంటర్‌లోని అమరవీరుల స్థూపానికి నివాళు లర్పించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజాస్వామిక హక్కులకు భంగం వాటిల్లుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. భావప్రకటన స్వేచ్ఛపై టీఆర్ఎస్ సర్కారు దాడిచేస్తున్నదని వారు విమర్శించారు.

జెడ్పీటీసీ భర్త మోసం..

- యువకుడి ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ– సిద్దిపేట అర్బన్

సిద్దిపేట జడ్పీటీసీ భర్త మోసం చేయడంతో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన మండలం పుల్లూరు గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్తులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్రె కనకరాజు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎనిమిది నెలల కిందట షిఫ్టు కారు తీసుకున్నాడు. కారును సిద్దిపేట జెడ్పీటీసీ గ్యార వజ్రవ్వ భర్త యాదగిరికి ఎంగేజ్‌కు ఇచ్చాడు. యాదగిరి కొన్నిరోజులు ఉపయోగించుకుని కారుకు నాలుగు నెలల కిందట యాక్సిడెంట్ చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లో కారు యజమానిగా యాదగిరి పేరే నమోదు చేయించుకున్నాడు. అంతేకాకుండా బాధితునికి తెలియకుండా కారును తనపేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఇవేమీ తెలియక బాధితుడు కారు మరమ్మతుకు డబ్బులు ఇవ్వాలని యాదగిరిని అడగటంతో కక్ష పెంచుకున్నాడు. దాంతో కారుకు సంబంధించిన ఇన్సూరెన్స్ డబ్బులు రాకుండా చేశాడు. ఈ క్రమంలోనే రుణం చెల్లించాలని బ్యాంకు వారు కనకరాజుపై ఒత్తిడి చేశారు. మళ్లీ బాధితుడు యాదగిరిని డబ్బులు అడగటంతో 'నన్నే పైసలు అడుగుతావా?' అని తన పలుకుబడిని ఉపయోగించి కనకరాజుపై కేసు నమోదు చేయించాడు. జీవనోపాధి కోసం తాను కారు తీసుకుంటే జడ్పీటీసీ భర్త మోసం చేసి, అకారణంగా కేసు పెట్టించాడని బాధితుడు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో శనివారం పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు వెంటనే సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. తమకు న్యాయం చేయాలని కుటుంబసభ్యులు విలేకర్ల ఎదుట విలిపించారు.

భారం లేని పెట్టుబడి పథకం

మొదటిపేజీ తరువాయి

ప్రకటించారు. గత సంవత్సరం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లో బడ్జెట్‌ను 15నుంచి 20 శాతానికి పెంచడంతోపాటు వ్యవసాయ అనుబంధ రంగాలైన చేతి వృత్తులు, చేపల పెంపకం, ఉద్యానం, విద్యుత్, విత్తన సబ్సిడీ, బ్యాంకు రుణాలన్నింటినీ కలిపి చూపించారు. వాస్తవంగా ఏ విభాగానికి కేటాయించిన నిధులను ఆ విభాగంలో ఖర్చుపెట్టగా మిగిలింది వ్యవసాయానికి 2.2 శాతం నుంచి 2.5 శాతం మాత్రమే. గతేడాది 2016–17లో ప్రణాళికేతర బడ్జెట్ రూ.4864.15 కోట్లు, ప్రణాళిక బడ్జెట్ రూ.1800.88 కోట్లు కేటాయిం చారు. అఇయతే ప్రణాళికేతర బడ్జెట్ నుంచి రూ. 4250 కోట్ల రుణమాఫీ నిధులు పోనూ మిగిలింది రూ. 624.15 కోట్లు మాత్రమే. అదే విధంగా 2017–18లో ప్రణాళికేతర బడ్జెట్ రూ.659.38 కోట్లు. ప్రణాళిక బడ్జెట్‌ను ప్రగతి పద్దు కింద చూపించింది రూ.5285.71 కోట్లు. ఇందులోనూ రుణమాఫీ నిధులు రూ. 4250 కోట్లు పోతే రూ.1035.71 కోట్లు మాత్రమే మిగిలాయి.

భూమి సాగు వివరాలు ఈ విధంగా ఉన్నాయి

సంవత్సరం	ప్రణాళిక, ప్రణాళికేతరబడ్జెట్ కలిపి (కోట్లల్లో)	సాగైన భూమి లక్షల ఎకరాల్లో
2014-15	రూ.5216.5	123
2015-16	రూ.6359.03	111.54
2016-17	రూ.6665.03	127.30
2017-18	రూ.5855.09	131.52

రైతులను దగ్గర చేసుకునే ప్రయత్నం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నాటినుండి టీఆర్ఎస్‌పార్టీకి రైతుల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. లక్ష రూపాయల రుణమాఫీ విషయంలోనూ, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలోనూ నిర్లక్ష్యం చూపిందన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికీ ఎంతోమంది రుణవిముక్తులు కాలేదు. ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ఇప్పటి వరకు 3700 మంది రైతులు చనిపోయినట్టు రైతు సంఘాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో రైతులను తమవైపు తిప్పుకునేందుకు, దగ్గర చేసుకునేందుకు పెట్టుబడి పథకం ఉపయో గపడుతుందని అధికార టీఆర్ఎస్‌పార్టీ నేతలు ఆశగా ఉన్నారు. ఎన్నికల్లో లబ్ది పొందేందుకే ఈ పథకాన్ని తీసుకొచ్చారన్న విమర్శలు కూడా ఉన్నాయి.

ఆలుగడ్డ రైతుల ఆగ్రహం

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో రైతుల ఆగ్రహం కట్టలుతెంచుకుంది. తాము ఆరుగాలం పండించిన పంటను పారబోశారు. అది కూడా విధానసభ, రాజ్‌భవన్, ముఖ్యమంత్రి యోగి నివాసాలముందు ఆలుగడ్డలను పారబోసి నిరసన వ్యక్తం చేశారు. హై సెక్యూరిటీ గల 5, కాళిదాస్ మార్గ్‌లోని ముఖ్యమంత్రి అధికార నివాసం వద్ద ఇదే పరిస్థితి. హైసెక్యూరిటీ జోన్‌లో రైతులు ఆలుగడ్డలను పారఆలుగడ్డ రైతుల ఆగ్రహం బోయడంతో జిల్లా పోలీసు యంత్రాంగం, భద్రతాధికారులు విస్తుపోయింది. ఆలుగడ్డలను ఈ ప్రాంతాలకు తెచ్చేందుకు ఉపయోగించిన వాహనాలను గుర్తిస్తున్నామనీ, వారిపై చర్యలు తీసుకుంటామని లక్నో సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ దీపక్ కుమార్ చెప్పారు.

మేం చేసింది తప్పుకాదు

మేం ఏ తప్పూ చేయలేదు. ప్రభుత్వం, దాని విధానాలకు వ్యతిరేకంగా లాంఛనప్రాయ నిరసన మాత్రమే ఇది అని రైతులు చెప్పారు. తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్న తమను ఆదుకునే చర్యలేవీ ప్రభుత్వం చేపట్టడంలేదనీ, అందుకు ఈ నిరసన కార్యక్రమం చేపట్టామని వారు తెలిపారు. 'క్వింటాల్ ఒక్కింటికి రూ. 3 నుంచి 4 రూపాయలు మాత్రమే ఇస్తున్నారు. రూ. 10 ఇవ్వాల్సిందిగా మేము డిమాండ్ చేస్తున్నాం. మా అభ్యర్థన చెవిటివాడి ముందు శంఖం ఊదినట్టుగా ఉంది. మమ్మల్ని పట్టింకునే దిక్కులేదు' అని ఓ రైతు చెప్పారు. 'రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర రావడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను విస్మరించింది. అందుకే అన్నదాత ఈ నిరసన కార్యక్రమానికి దిగారు' అని భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ) నాయకుడు హర్నం సింగ్ వర్మ అన్నారు. కాగా ఈ ఆరోపణలను ఉత్తరప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి సూర్య ప్రతాప్ షాహీ ఖండించారు. రైతులు, ముఖ్యంగా ఆలుగడ్డ రైతుల సంక్షేమానికి ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. యోగి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి పన్నిన రాజకీయ కుట్రగా కొట్టిపారేశారు.

థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నెం.1 చేయాలి : సింగరేణి సీఎండి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని దేశంలో నెంబర్–1గా నిలపాలని సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో 10 మెగావాట్ల సోలార్ ప్లాంటు ఏర్పాటు చేయాలన్నారు. మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద గల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం డిసెంబర్‌లో జాతీయ స్థాయిలో 4వ స్థానాన్ని సాధించడంపై అధికారులకు అభినందనలు తెలిపారు. శనివారం ఆయన హైద్రాబాద్‌లోని సింగరేణిభవన్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. డిసెంబర్‌లో ఎన్‌టీపీపీలోని యూనిట్–1 ప్లాంటు 100 శాతం పీఎల్ఎఫ్, యూనిట్–2 ప్లాంటు 99 శాతం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. డిసెంబర్‌లో స్టేషన్ సాధించిన 99.5 శాతం పీఎల్ఎఫ్ వల్ల ఈ ఆర్థిక సంవత్సరంలో గడచిన 9 నెలల కాలానికి 90 శాతం సగటు పీఎల్ఎఫ్‌కు ఎస్‌టీపీపీ ఎదిగిందని తద్వారా దేశంలోని అత్యుత్తమ 25 ప్లాంటుల జాబితాలో 4వ స్థానం సాధించగలిగిందని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన 3 నెలల్లో కూడా మంచి సామర్థ్యంతో పనిచేసి అత్యుత్తమ పీఎల్ఎఫ్‌తో దేశంలోనే నెంబర్–1 స్థానానికి ఎదగాలని ఆయన అధికారులను కోరారు. ప్లాంటు ప్రారంభం నుండి రాష్ట్రానికి 10,658 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా చేశామని, ఇప్పుడు ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తును అందిస్తున్న నేపథ్యంలో పూర్తి సామర్థ్యంతో ప్లాంటు నుండి విద్యుత్ ఉత్పత్తి జరిగేలా క షి చేయాలని అధికారులకు, ఉద్యోగులకు సూచించారు. సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వీఆర్ఏది ముమ్మాటికీ హత్యే..

- రాత్రి డ్యూటీకి పంపిన అధికారులపై చర్యలు తీసుకోవాలి
- బాధిత కుటుంబానికి రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- సర్కారు స్పందించకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు
- బాధిత కుటుంబానికి వీఆర్ఏల సంఘం పరామర్శ



నవతెలంగాణ–నిజామాబాద్ ప్రతినిధి

"చనిపోయింది వీఆర్ఏనే.. సాయిలుది ముమ్మాటికీ హత్యే. ఇసుకమాఫియా ప్రమేయం ఉండటంతోనే కేసును తారుమారు చేసే ప్రయత్నం చేశారు..' అని వీఆర్ఏల సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాల్‌నర్సయ్య, వంగురి రాములు అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కారెగాంలో సాయిలు కుటుంబాన్ని సంఘం రాష్ట్ర నాయకులు పరామర్శించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. తెలంగాణలో గతం నుంచీ వీఆర్ఏల కుటుంబ సభ్యులు వాటాల వారీగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే సాయిలు వీఆర్ఏగా గతేడాది జూన్ ఒకటి నుంచి విధుల్లో కొనసాగుతున్నట్టు రిజిష్టర్‌లో ఆధారాలు ఉన్నాయని చెప్పారు. దీన్ని పరిగణలోకి తీసుకోకుండానే సాయిలు వీఆర్ఏ కాదని నిర్ధారించడం సరైంది కాదన్నారు. ఇసుక మాఫియాను ఈ కేసు నుంచి తప్పించే క్రమంలోనే ఇలా తప్పుడు ప్రకటనలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, వీఆర్ఏలను రాత్రిపూట విధుల్లో ఉంచడంగానీ, వాచ్‌మెన్‌గా కొనసాగించటంగానీ నిబంధనలకు విరుద్ధమని అన్నారు. ఇది 2005లోని 1849 సర్వీసు రూల్స్ ప్రకారం నిబంధనల ఉల్లంఘనేనని, దీనికి కారణమైన రెవెన్యూ అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇసుక మాఫియా చేతిలో హత్యకు గురైన వీఆర్ఏ సాయిలు కుటుంబానికి రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు ఒకరికి ఉద్యోగం, డబుల్‌బెడ్‌రూం ఇల్లు ఇవ్వాలని కోరారు. లేకపోతే సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో సీఐటీయూ కామారెడ్డి జిల్లా కార్యదర్శి సిద్ధిరాములు, ఉపాధ్యక్షులు ఎల్లయ్యలు ఉన్నారు.

వేజ్‌బోర్డు సిఫారసులను అమలుచేయాలి: కేంద్రానికి ఎన్ఏజే లేఖ

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

జస్టిస్ గురుభక్స్ మజీతియా వేజ్‌బోర్డు సిఫారసులను అమలుచేయాలని జాతీయ జర్నలిస్టుల సంఘం(ఎన్ఏజే) జాతీయ అధ్యక్షులు ఎస్కే పాండే, సెక్రెటరీ జనరల్ ఎం. కోటేశ్వర్‌రావు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శనివారం కేంద్ర కార్మిక శాఖ సహాయ మంత్రి సంతోష్‌కుమార్ గంగ్వార్‌కు సంయుక్తంగా లేఖ రాశారు. వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని ఎలక్ట్రానిక్ మీడియాకు సైతం వర్తింపజేయాలని సూచించారు. కేరళ తరహాలో జర్నలిస్టులకు పింఛన్ పథకాన్ని ప్రవేశపెట్టాలని ఇవ్వాలని కోరారు. జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులపై దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం ప్రత్యేక రక్షణ చట్టం అవసరమని అభిప్రాయపడ్డారు.

'స్మార్ట్' చోరీ

మొదటిపేజీ తరువాయి

చేస్తుంది. మీ ఫోన్‌లోని కాంటాక్ట్ జాబితాను దొంగిలిస్తుంది. మీ బ్యాంక్ నుంచి వచ్చినట్టే ఫేక్ నోటిఫికేషన్‌ను పంపుతుంది. మీ మొబైల్‌కు వచ్చే ఎస్ఎంఎస్‌లతోపాటు మీరు పంపే ఎస్ఎంఎస్‌లను అడ్డుకుంటుంది. ఒన్‌టైం పాస్‌వర్డ్‌ను కూడా పంపిస్తుంది. మీ బ్యాంక్ లాగ్ ఇన్ ఐడీ,పాస్‌వర్డ్‌లను తస్కరిస్తుంది. మీ వివరాలు హ్యాకర్స్‌కు వెళ్లగానే మీ అకౌంట్‌లోని డబ్బులు స్వాహా అవుతాయి. క్విక్‌హీల్ చెబుతున్న ప్రకారం ఆండ్రాయిడ్ బ్యాంకింగ్ మాల్వేర్ టార్గెట్ చేసిన ఇండియన్ బ్యాంకుల యాప్స్ జాబితా: యాక్సిస్ మొబైల్,హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మొబైల్ బ్యాంకింగ్, ఎస్‌బీఐ ఎనీవేర్ పర్సనల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మొబైల్ బ్యాంకింగ్ ఎల్ఐటీఈ, ఐమొబైల్ బై ఐసీఐసీఐ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్ జీవో మొబైల్+, అభయ్ బై ఐడీబీఐ బ్యాంక్ లిమిటెడ్, ఐడీబీఐ బ్యాంక్ గో మొబైల్, ఐడీబీఐ బ్యాంక్ ఎంపాస్‌బుక్, బరోడా ఎంపాస్‌బుక్, యూనియన్‌బ్యాంక్ మొబైల్ బ్యాంకింగ్, యూనియన్ బ్యాంక్ కమర్షియల్ క్లయింట్స్..పెద్దనోట్ల రద్దు తర్వాత డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేసిన విషయం తెలిసిందే. అందుకోసం మొబైల్ యాప్స్ ద్వారా లావాదేవీలు జరపాలని సూచించడం గమనార్హం. ఈ నేపథ్యంలో బ్యాంకింగ్ లావాదేవీలు జరపడంలో తగిన జాగ్రత్తలు అవసరమని ఈ కొత్త వైరస్ మరోసారి హెచ్చరిస్తోంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

థర్డ్ పార్టీ స్టోర్స్ నుంచి వచ్చిన యాప్‌లను డౌన్‌లోడ్ చేయకూడదు. ఈ–మెయిల్స్, ఎస్ఎంఎస్‌ల ద్వారా వచ్చే లింక్స్ ఆధారంగా యాప్‌లను డౌనలోడ్ చేయకుండా ఉండాలి. మొబైల్‌లోని అన్‌నోన్ సోర్సెస్ ఆప్షన్‌ను డిజేబుల్ చేయాలి. స్మార్ట్‌ఫోన్‌లోని ఆపరేటింగ్ సిస్టమ్, యాప్ వెర్షన్‌ను ఎప్పటికపుడు అప్‌డేట్ చేయాలని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు.

లాలూకు మూడున్నరేండ్లు జైలు

మొదటిపేజీ తరువాయి

దొరండా ట్రెజరీ నుంచి రూ. 184 కోట్ల నిధుల అక్రమ వినియోగం – న్యాయస్థానాల విచారణలో ఉన్నాయి. శిక్షల ప్రకటనలో జాప్యాన్ని ప్రకటించే సమయంలో లాలూ అనుయాయుల నుంచి తనకు బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయని జడ్జి ప్రకటించడం సంచలనం కలిగించింది. ఈ ఆరోపణపై లాలూ అనుచరులు ఎవరూ అలాంటి పని చేయలేదని ఆర్జేడీ నాయకులు శివానంద్ తివారీ, జగదానంద్ సింగ్ వివరణ ఇచ్చారు. ఇది ప్రతిపక్షాలు చేసిన కుతంత్రం కావచ్చని వారు ఆరోపించారు.

సెన్సెక్స్ ▲184 34,153	నిఫ్టీ ▲54 10,558	డాలరుకు రూపాయి విలువ 63.37	బంగారం(10.గ్రా) రూ. 30,160	వెండి (కేజీ) రూ. 41,700	కోడిగుడ్లు: హైదరాబాద్ 368, ఒక్కగుడ్డుకు 4.30, వరంగల్ 370, విజయవాడ 374, చెన్నై 397, ముంబయి 410

పెరిగిన బంగారం దిగుమతులు

- 2016 కంటే 2017లో 67శాతం అధికం

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా బంగారం ధరలు తగ్గడంతో దిగుమతులు పెరిగాయి. 2016తో పోల్చితే 2017లో బంగారం దిగుమతులు 67 శాతం పెరిగాయని జీఎఫ్ఎంసీ(గోల్డ్ ఫీల్డ్స్ మినరల్ సర్వీసెస్) సీనియర్ నిపుణులు సుధీష్ నంబియత్ పేర్కొన్నారు. పెద్దనోట్ల రద్దు అనంతరం బంగారం నిల్వలలోటు.. 2017 మొదటి అర్ధభాగంలో తిరిగి చేరుకున్నాయని ఆయన విశ్లేషించారు. డిసెంబర్‌లో అంతర్జాతీయంగా బంగారం కొనుగోళ్లు 70టన్నులకు చేరి 2016ఏడాది కంటే 40శాతానికి పెరిగాయి. అంతర్జాతీయ బులియన్ మార్కెట్‌లో 10గ్రాముల బంగారం విలువ 50రూపాయలు పడిపోగా వెండి ధర కిలోకు 40వేల రూపాయలతో నిలకడగా ఉంది. అంతర్జాతీయంగా ఒక ఔన్సు బంగారం ధర స్వల్పంగా తగ్గి 83,482(1,318 అమెరికన్‌డార్లు) కు పడిపోయింది. దేశ రాజధానిలో 99.9శాతం శుద్ధ బంగారం ధర 50రూపాయలు పడిపోయి 30,450 రూపాయలుగా ఉండగా, 99.5శాతం శుద్ధ బంగారం ధర 50రూపాయలు పడిపోయి 30,300 రూపాయలు ఉన్నది. ప్రపంచంలో చైనా తర్వాత అధికంగా బంగారాన్ని ఉపయోగించేది ఇండియా అని తెలిసిందే. గత మూడు నెలలు భారత్ అధికంగా కొనుగోలు చేసి అంతర్జాతీయంగా బంగారం ధరలు క్షీణించకుండా సాయపడింది.

జెట్ ఎయిర్‌వేస్ మరో ఆఫర్

ముంబయి: దేశీయ విమానయాన రంగంలో నెలకొన్న పోటీ నేపథ్యంలో జెట్ ఎయిర్‌వేస్ ప్రీమియర్ వన్ వే టికెట్లపై రాయితీ ఆఫర్‌ను ప్రకటించింది. ఎంపిక చేసిన విమానాలు, రూట్లలో ప్రీమియం టికెట్లను రూ.2320 ప్రారంభ ధరతో అందిస్తోన్నట్లు తెలిపింది. ఎంపిక చేసుకున్న బుకింగ్ తరగతులకు, ఎలాంటి ప్రయాణ ఆంక్షలు లేకుండా డిస్కౌంట్ ఆఫర్ అందిస్తున్నట్లు తెలిపింది. బుక్ చేసుకున్న అనంతరం 12నెలల పాటు ఈటికెట్లు చెల్లుబాటు అవుతాయని పేర్కొంది. అయితే కనీసం ప్రయాణానికి నెలరోజులు ముందుగా ఈటికెట్లను కొనుగోలు చేసుకోవాలి. ఎకానమీ క్లాస్‌కంటే తక్కువ రేటు విమాన టికెట్లతో ప్రయాణించండి, అదనపు సౌలభ్యాలను ఆస్వాదించడంటూ అనే నినాదంతో ఈ ప్రయాణాన్ని అందిస్తుంది. ప్రయాణానికి కనీసం 30 రోజులు ముందు టికెట్లు బుక్ చేసుకోవాలని తెలిపింది. ఇండియాలో జెట్ ఎయిర్వేస్ నిర్వహిస్తున్న విమానాల్లో ఎంపిక చేసిన ప్రీమియర్లో వన్-వే ప్రయాణాలకుఈ రేట్లు వర్తిస్తాయి. ఏ సమయంలో అయినా, ఆఫర్‌ను, పూర్తిగా లేదా పాక్షికంగా ఉపసంహరించుకునే అధికారం తమకుందని జెట్ ఎయిర్‌వేస్ స్పష్టం చేసింది.

అత్యాధునిక ప్లాంట్‌పై దృష్టి

- నాల్కో సీఎండీ టికె చంద్ వెల్లడి

భువనేశ్వర్: దేశంలో అత్యాధునిక అల్యూమినియం ఉత్పత్తులప్లాంట్ ఏర్పాటుకు నేషనల్ అల్యూమినియం కంపెనీ (నాల్కో) కసరత్తు చేస్తుంది. భవిష్యత్తులో రానున్న బుల్లెట్ ట్రెయిన్, విమానాల తయారీ, విద్యుత్ వాహనాల కోసం కావాల్సిన అల్యూమినియం తయారీపై దృష్టి పెట్టినట్లు నాల్కో చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ టికె చంద్ తెలిపారు. దేశంలో ఇప్పటి వరకు అత్యంత ఆధునికత కలిగిన అల్యూమినియం తయారీ ప్లాంట్లు లేవని అన్నారు. ఈ టెక్నాలజీ అమెరికా, రష్యాల్లో ఉందని, ఈ స్థాయి సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి సరఫరాదారులతో సంప్రదింపులు చేస్తున్నామన్నారు. ఒక వేళ తాము అనుకున్న టెక్నాలజీ లభిస్తే అంగూల్ అల్యూమినియం పార్కు లేదా దగ్గరలో నూతన ప్లాంట్‌ను ఏర్పాటు చేసే యోచనలో ఉన్నామని తెలిపారు.

సీఎస్‌వో ఆర్థిక నివేదికతో ఇరకాటంలో మోడీ సర్కార్..!

- ద్రవ్యలోటును కట్టడి చేయడం దుర్లభమంటున్న ఆర్థిక నిపుణులు
- నవంబర్‌నాటికే లక్ష్యించిన 3.2శాతంను అధిగమించిన ఫిస్కల్ డెఫిసిట్..!!
- ఫిబ్రవరి బడ్జెట్‌పై ప్రభావం చూపనున్న వాస్తవ ఆర్థికస్థితి..!!!



(ఫైల్)

న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చితో ముగిసే 2017-18 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధిరేట్ 6.5 శాతానికే పరిమితం కానున్నట్టు కేంద్ర ప్రభుత్వ గణనశాఖ సీఎస్‌వో తేల్చి చెప్పడంతో మోడీ సర్కార్ ఇరకాటంలో పడినట్టేనని ఆర్థిక, రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. 2014లో ప్రధాని మోడీ నేతృత్వంలో కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడిననాటి నుంచీ దేశ ఆర్థిక వ్యవస్థ మందగమనంలో సాగుతున్నట్టు వారు విశ్లేషించారు. ఫిబ్రవరి 1న ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ పార్లమెంట్‌కు సమర్పించనున్న బడ్జెట్‌పై గణనశాఖ వెల్లడించిన వాస్తవాలు ప్రభావం చూపనున్నట్టు వారు చెబుతున్నారు.

2017-18 ఆర్థిక సంవత్సరానికి జీడీపీలో ద్రవ్యలోటు 3.5 శాతం ఉండనున్నట్టు ముంబయిలోని నిర్మల్‌బ్యాంగ్ ఈక్విటీస్ ప్రయివేట్‌కు చెందిన ఆర్థికవేత్త తెరిసాజాన్ తెలిపారు. ఇది అరుణ్‌జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పిన అంచనా 3.2 శాతంకన్నా అధికం కావడం గమనార్హం. ఇప్పటివరకూ అందుబాటులో ఉన్న అధికారిక గణాంకాలు పరిశీలించినా ఈ అంచనా సరైందిగానే భావించకతప్పదు. గతేడాది ఏప్రిల్ నుంచి ప్రారంభమైన ఈ ఆర్థిక సంవత్సరంలో అక్టోబర్ చివరికల్లా ఏడాది కాలానికి బడ్జెట్‌లో చెప్పిన ద్రవ్యలోటులో 96శాతానికి చేరుకున్నది. అక్టోబర్ చివరికల్లా ద్రవ్యలోటు రూ. 5.25 లక్షల కోట్లు. అదే కాలానికి రెవెన్యూ ఆదాయం రూ.7.29 లక్షల కోట్లు. పభుత్వం చేసిన మొత్తం ఖర్చు రూ.12.92 లక్షల కోట్లు. నవంబర్ చివరికల్లా ద్రవ్యలోటు బడ్జెట్‌లో చెప్పినదానికి 12 శాతం(3.2 శాతం+3.2లో 12 శాతం) అధిగమించింది. మిగతా(డిసెంబర్ నుంచి) నాలుగు నెలల్లో అంచనాకన్నా రెవెన్యూ రాబడి పెరిగితే తప్ప ద్రవ్యలోటు మరింత భారంగా మారే అవకాశమూ లేకపోలేదు. బడ్జెట్‌లో పేర్కొన్న అంచనాలకన్నా ఖర్చు ఎక్కువ, రెవిన్యూ రాబడి తక్కువ కావడమే ఈ పరిస్థితికి కారణమని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

విధానపరమైన అనిశ్చితి వల్ల ప్రయివేట్ పెట్టుబడులు తగ్గినట్టు ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఉత్పాదక రంగాల్లో నూతన పెట్టుబడులకు అనుకూలత లేకపోవడమే ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అని కేంద్ర ప్రభుత్వ మేధోమథన సంస్థ సీఎంఐఈ ముఖ్య కార్యనిర్వాహణాధికారి మహేశ్‌వ్యాస్ అన్నారు. వచ్చే ఏడాది(2019)లో సార్వత్రిక ఎన్నికలు, ఈ ఏడాదిలో 8 రాష్ట్రాలకు ఎన్నికలు జరగనుండగా ఆర్థికవృద్ధి క్షీణించడంపై సీఎస్‌వో వెల్లడించిన వాస్తవాలు మోడీ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటివని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఆర్‌బీఐ చెప్పినదానికన్నా వృద్ధిరేట్ తక్కువగా ఉండనున్నట్టు తేలడంతో కేంద్ర బ్యాంక్ అధికారులెవరూ దీనిపై స్పందించే అవకాశంలేదని యాక్సిస్‌బ్యాంక్ ముఖ్య ఆర్థికవేత్త సౌగతా భట్టాచార్య అన్నారు. స్థూల విలువ చేర్పు(జీవీఏ)ను ఆర్‌బీఐ 6.7 శాతంగా అంచనా వేయగా, సీఎస్‌వో 6.1కే పరిమితం చేయడం గమనార్హం. సీఎస్‌వో గణాంకాల నేపథ్యంలో ఫిబ్రవరిలో ప్రవేశపెట్టే(2018-19) బడ్జెట్‌లో ద్రవ్యలోటును ఈసారి కూడా 3.2 శాతంగా పేర్కొననున్నట్టు ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. కొత్త బడ్జెట్‌లో ద్రవ్యలోటును 3 శాతానికే పరిమితం చేయాలన్న లక్ష్యం నుంచి మోడీ సర్కార్ వెనక్కి తగ్గక తప్పదని వారు చెబుతున్నారు.

ఎన్‌పీసీఐ లావాదేవీలు 14.54 కోట్లు


ఏడాది కాలంలో 10.4 కోట్లు పెరుగుదల



కోల్‌కతా: నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) దానిలో భాగమైన డిజిటల్ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ఫేస్(యూపీఐ) ద్వారా గత నెలలో 145.46 మిలియన్ల(14.54 కోట్లు) లావాదేవీలను జరిగినట్టుగా ఆ సంస్థ వెల్లడించింది.

గతేడాది జనవరిలో కేవలం 41.5 లక్షలతో మొదలైన లావాదేవీలు డిసెంబర్ చివరికల్లా 145.46 మిలియన్ల(14.54 కోట్లు)కు పెరిగాయి. అలాగే ఆర్థిక లావాదేవీల విలువ గతేడాది జనవరిలో కేవలం 1,568 కోట్ల రూపాయలతో మొదలై డిసెంబర్ నాటికి 13,144 కోట్ల రూపాయలకు చేరుకుందని ఎన్‌పీసీఐ అధికారి వెల్లడించారు. గతేడాది జులై నుంచి యూపీఐ లావాదేవీలు విపరీతంగా పెరిగాయి. 11.44 మిలియన్ల(1.14 కోట్లు)గా మొదలై ప్రతి నెలా 100శాతం వృద్ధితో సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో పెరిగాయి. నవంబర్, డిసెంబర్ నెలల్లో మాత్రం 40 శాతానికి వృద్ధిరేటు తగ్గినట్టుగా తెలిపారు. అయినప్పటికీ యూపీఐ యాప్ భీమ్(భారత్ ఇంటర్‌ఫేస్ ఫర్ మనీ) ద్వారా ఎన్‌పీసీఐ నిర్వహించిన ఆర్థిక లావాదేవీలు 9మిలియన్ల(90 లక్షలు)కు చేరుకుందని తెలిపారు. 25రూపాయల క్యాష్ బ్యాక్ ఆఫర్‌ను ప్రకటించడం భీమ్ యాప్‌ను ఎక్కువ సంఖ్యలో డౌన్ లోడ్ చేసుకోవడంలో ఉపయోగపడింది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కూడా యూపీఐ ద్వారా ఎలాంటి బ్యాంకు వివరాలు అవసరం లేకుండా ఖాతాల నుంచి ప్రత్యక్ష డిజిటల్ లావాదేవీలు జరపడానికి ఉపయోగించుకున్నాయి. 2017 డిసెంబర్ చివరి నాటికి మొత్తం 67 బ్యాంకులు ఎన్‌పీసీఐకి చెందిన యూపీఐ సేవలు ఉపయోగించుకున్నాయి. యూపీఐ ఆధారంగా పనిచేసే యాప్‌లు కూడా కొన్ని బ్యాంకుల ఖాతాలను అనుసంధానం చేయడానికి వినియోగదారులకు వీలుకల్పిస్తున్నాయి.

వీడియో ఎడిటింగ్ స్టార్టప్‌ను కొనుగోలు చేసిన ఫేస్‌బుక్



శాన్ ఫ్రాన్సిస్కో: ప్రముఖ సోషల్ నెట్‌వర్కింగ్ సంస్థ ఫేస్‌బుక్ జర్మనీకి చెందిన వీడియో ఎడిటింగ్ స్టార్టప్ ఫేటెక్‌ను కొనుగోలు చేసింది. ప్రస్తుతం వీడియో ప్రేమికులను ఉర్రూతలూగిస్తోన్న 'ఏఆర్' (ఆగ్మెంటెడ్ రియాలిటీ) సాంకేతికను ఈ సంస్థ అందిస్తోంది. దీని ద్వారా ఇప్పటికే ఉన్న వీడియోలలో మార్పులు చేర్పులు చేసి కొత్త ఏఆర్ సాంకేతికతను జోడిస్తారు. వాటిని చూసే ప్రేక్షకులకు ఆ ప్రదేశంలో ఉన్న అనుభూతి కలుగుతుంది. కోట్లాదిగా ఉన్న తన వినియోగదారులకు ఈ సాంకేతికతను అందించడం వల్ల వారికి మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో ఈ స్టార్టప్‌ను కొనుగోలు చేసినట్టు ఫేస్‌బుక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. వీడియోల్లో కొత్త పరిజ్ఞానాన్ని జోడిస్తూ 'అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్' సహాయంతో వాటిని మరింత ఆకర్షణీయంగా రూపొందించడంలో ఫేటెక్ సంస్థ ముందంజలో ఉంది. ఇక నుంచి తన ఉత్పత్తులు, సేవలు కొనుగోలుకు అందుబాటులో ఉండవని ఫేటెక్ తెలిపింది.

వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి బలమైన ఉద్యమాలు

చేతివృత్తుల రాష్ట్ర నాయకులు చెరుపల్లి సీతారాములు

- ఆర్థిక, సామాజిక అంశాలను ముందుకు తీసుకెళ్లాలి: ఎంవి.రమణ
- మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక
- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మెట్టుక కుమారస్వామి, లెల్లెల బాలక్రిష్ణ


మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

నవతెలంగాణ - శంషాబాద్

వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి బలమైన ఉద్యమాలు నిర్మించాలని చేతివృత్తుల రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో రెండురోజులపాటు జరిగిన మత్స్యకారులు, మత్స్యకార్మికసంఘం రాష్ట్ర ద్వితీయ మహాసభ శనివారం ముగిసింది. మహాసభలో 13 తీర్మానాలను ఆమోదించారు. ఈసందర్భంగా చెరుపల్లి మాట్లాడుతూ.. లక్షలాది మంది మత్స్యకారుల జీవనోపాధిని తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మిషన్ కాకతీయ పథకం దళారులకు, అవినీతిపరులకు మాత్రమే పనికి వచ్చిందని విమర్శించారు. రూ.45 కోట్లతో 66 కోట్ల చేపపిల్లలను మాత్రమే చెరువుల్లో వదిలి, దాంతోనే మత్స్యకారుల జీవితాలు మారిపోతాయని ముఖ్యమంత్రి భ్రమలు కల్పిస్తున్నా రని అన్నారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలు నిర్మించాలన్నారు. ఈనెల 22న రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్లలో మత్స్యకారులు ధర్నాలు చేయనున్నట్టు చెప్పారు. ముదిరాజ్‌లు, గంగపుత్రుల మధ్య జీఓ నెం.6తో ఘర్షణలకు ప్రభుత్వం ఆజ్యం పోసిందన్నారు. మాల, మాదిగలు, గిరిజనులు, లంబాడీలు, ముదిరాజ్‌లు, గంగపుత్రులు ఇలా అనేక కులాల మధ్య ప్రభుత్వం చిచ్చురాజేసిందని విమర్శించారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం ఇతర అన్ని సామాజిక వర్గాలను కలుపుకుని "మనమెంతో మనకంత" నినాదంతో పోరాటం చేయాలని సూచించారు. వృత్తిదారుల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు ఎంవీ.రమణ మాట్లాడుతూ.. మత్స్యకారులు రాష్ట్రంలో దుర్భర జీవితాలు గడుపుతున్నారన్నారు. వృత్తులు ధ్వంసమై ప్రజలు వలసబాట పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కష్టం చేయని వారు మేడలు కడుతుంటే కష్టజీవులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుమారస్వామి మాట్లాడుతూ.. రాష్ట్ర మహాసభల సందర్భంగా చేసిన తీర్మానాల మేరకు పోరాటాలు కొనసాగిస్తామని చెప్పారు. మత్సకార సొసైటీ ఏర్పాటు, స్థలం కేటాయింపు, డబుల్‌బెడ్‌రూం, సబ్సిడీ రుణాలు, బీమా జలవనరులపై మత్స్యకారులకు హక్కులు కల్పించే విధంగా పోరాటాలు చేస్తామని ప్రకటించారు.

రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక


కుమారస్వామి బాలక్రిష్ణ

మహాసభ సందర్భంగా మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర నూతన కమిటీని 37 మందితో ఎన్నుకున్నారు. ఇందులో 13మంది రాష్ట్ర ఆఫీస్‌బేరర్లుగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షులుగా మెట్టుక కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా లెల్లెల బాలక్రిష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా శీలం శీను (సూర్యాపేట), మురారి మోహన్ (నల్లగొండ), బొల్లారపు రమేష్(పెద్దపల్లి) మేఘనబోయిన శేఖర్(సూర్యాపేట), మురా విజయ్(హైదరాబాద్ సౌత్), చెనమోని శంకర్(రంగారెడ్డి) సహాయ కార్యదర్శులుగా జి.నర్సింహా (వికారాబాద్), కర్రెల్లి లలిత(మేడ్చల్), కొప్పు పద్మ (హైదరాబాద్ సెంట్రల్), బోడెంకి చందు (మంచిర్యాల), ఆరెపల్లి శ్రీరాములు (హైదరాబాద్ సెంట్రల్) ఎన్నికయ్యారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

దీర్ఘకాలిక వ్యాధులకు హోమియో వైద్యం మేలు

మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

- పాజిటివ్ హోమియోపతి కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-మహబూబ్‌నగర్

దీర్ఘకాలిక వ్యాధులకు హోమి యోపతి వైద్యం ఎంతో మేలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని శెట్టి కాంప్లెక్స్‌లో నూత నంగా ఏర్పాటు చేసిన పాజిటివ్ హోమియోపతి కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. వైద్య రంగంలో అనేక సాంకేతిక మార్పులు వచ్చాయన్నారు. దీంతోపాటు దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రోజువారీ అలవాట్లు, రసాయనాలతో కూడిన ఆహారం వల్లే రకరకాల వ్యాధులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూత్రపిండాల వ్యాధులతో బాధపడుతున్న వారి సంఖ్య మహబూబ్ నగర్‌లోనే ఎక్కువగా ఉంటుందన్నారు. ఇక్కడ ఎక్కువగా పేవారు, కష్టపడే వారు ఉండటంతో చిన్న వయస్సులోనే కీళ్ల నొప్పులు వస్తున్నాయని తెలిపారు. వాతావరణం మారినప్పుడల్లా వయస్సు మీరిన వారు ఆయాసం, దమ్ము మొదలగు అలర్జీలతో బాధపడుతున్నారని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చి రకరకాల నాణ్యమైన మందులు వాడినా పూర్తి స్థాయిలో మార్పు కనిపించడం లేదన్నారు. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న వారికి పాజిటివ్ హోమియోపతి వైద్యం పరిష్కారం చూపిస్తుందన్నారు.తక్కువ ఛార్జీలు తీసుకొని పేదలకు వైద్యం చేయాలని ఈసందర్భంగా ఆయన యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాధా అమర్, కోరమోని వెంకటయ్య, కౌన్సిలర్ కృష్ణమోహన్, అమరేందర్, హోమియోపతి డాక్టర్లు పాల్గొన్నారు.

ఇప్పుడిప్పుడే..


ఫైల్

ప్రారంభ దశలోనే మేడారం జాతర పనులు

- రంగులే వేయలేదు... తాగునీటి పనులే మొదలెట్టలేదు
- మరుగుదొడ్లు పూర్తవ్వడం కష్టమే
- 31 నుంచే జాతర... పట్టించుకోని పాలకులు
- కలెక్టర్ బదిలీతో మరింత జాప్యం

(పార్నంది వెంకటస్వామి-నవతెలంగాణ ప్రతినిధి)

ఆసియాలోనే అతిపెద్దదైన మేడారం జాతర దగ్గరపడుతున్నది. నెల ముందు నుంచే సందర్శకుల తాకిడీ రోజురోజుకీ పెరుగుతున్నది. 31 నుంచి జాతర ప్రారంభం కానుండగా...పనులు మాత్రం ప్రారంభ దశలోనే ఉన్నాయి. చాలా పనులు ఇప్పుడిప్పుడే మొదలవుతున్నాయి. మరుగుదొడ్ల నిర్మాణం పనులు నత్తనడకను తలపిస్తున్నాయి. రోడ్లు పూర్తవ్వలేదు. రంగులెయ్యలేదు. తాగునీటి పనులు మొదలే పెట్టలేదు. ఇలా జాతరకు సంబంధించిన ఏ పనీ పూర్తవ్వలేదు. ఇంతలోనే కలెక్టర్ బదిలీ. అధికారులు, పాలకులూ పెద్దగా పట్టించుకోవట్లేదు. ఈపనుల జాప్యం వెనుక నిధుల స్వాహా కుట్ర దాగి ఉందన్న విమర్శలొస్తున్నాయి. ప్రతి రెండేండ్లకోసారి మేడారం జాతర జరుగుతున్నది. 2016లో జరిగిన జాతరకు రాష్ట్ర ప్రభుత్వం 101 కోట్ల రూపాయలు కేటాయించి ఆరు మాసాల ముందు నుంచే పనులు చేపట్టింది. నిత్యం మంత్రులు సమీక్షించి పనుల్ని గడువులోగా పూర్తి చేయించారు. ఈ ఏడాది నిధుల్లో ప్రభుత్వం కోత పెట్టింది. 80.55 కోట్లు మాత్రమే కేటాయించింది. ఆరు మాసాల ముందే ప్రతిపాదనలు పంపినా రెండు నెలల కిందనే నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచారు. ఈ పనులు ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి.

జాతరలో మరుగుదొడ్ల ఏర్పాటు అతి కీలకమైంది. ప్రతి ఏటా దీనికే ఎక్కువ నిధులు కేటాయిస్తారు. ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా పనులు చేపట్టనున్నారు. ఇందుకోసం 19 కోట్లు కేటాయించారు. 7.50 కోట్లతో 10,750 మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలి అందులో 4వేల సెమీ పర్మినెంట్, 1350 తాత్కాలిక, 60 పర్మినెంట్, 60 వీఐపీ మరుగుదొడ్లతో పాటు ఆధునిక మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలి. మరుగుదొడ్ల నిర్మాణం పనులు ఇటీవలే ప్రారంభించారు. ఇప్పుడిప్పుడే గోతులు తవ్వుతున్నారు. పూర్తిస్థాయిలో నిర్మాణం చేయడానికి నెల రోజులు పట్టే అవకాశముంది. అంటే జాతర నాటికి అందుబాటులోకి వచ్చేది కష్టమే. వాస్తవానికి ఈ నెల 15లోగా పనులు పూర్తవ్వాలి.

జాడలేని తాగునీటి పైప్‌లైన్లు

కోటిమందికిపైగా వచ్చే సందర్శకులకు అనుగుణంగా తాగునీటి వసతి కల్పించాలి. ఇందు కోసం 8.45 కోట్లు కేటాయించారు. జాతరలో బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ ఏర్పాటు, బోరుమోటర్ల నుంచి నల్లాలకు కనెక్షన్లు ఇవ్వాలి. అయితే, ప్రారంభమైనా పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలి. అయితే, ఇంకా మేడారానికి పైప్‌లు చేరలేదు. రైతులకు నష్టం జరగకుండా కాల్వలు చేపట్టి పైప్‌లైన్లు వేయాలని అప్పటి కలెక్టర్ మురళీ అధికారుల్ని ఆదేశించారు. వేయాల్సిన పైపుల్ని అధికారులు పరిశీలించాల్సి ఉండగా కాంట్రాక్టర్‌కు చెప్పి వదిలేసినట్టు కనిపిస్తున్నది. గతంలో చేపట్టిన ట్యాంకుల్ని శుద్ధి చేయడం లేదు. ఇప్పటికే సందర్శకుల తాకిడి పెరిగినందున వారికి తాగునీరు అందించక పోవడంతో వాగులో నీటిని వాడుకుం టున్నారు. ఈనెల 15 నాటికే నల్లా కనెక్షన్లు పనులు పూర్తి కావాల్సి ఉండగా జాతర ముగిసేకల్లా పూర్తయ్యే అవకాశా ల్లేవు.

రోడ్ల నిర్మాణంలో అలసత్వం

జాతర కోసం ప్రతి ఏటా ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో 30 నుంచి 40శాతం రోడ్ల మరమ్మతు, కొత్త రోడ్ల నిర్మాణం కోసం కేటాయిస్తారు. ఈ ఏడాది మేడారం నుంచి భూపాలపల్లి రోడ్ల వైపు దృష్టి పెట్టారు. 2016 జాతర సందర్భంగా కూడా 38 కోట్లకు పైగా ఖర్చు చేశారు. ఈ జాతర సందర్భంగా 20 కోట్ల రూపాయలు కేటాయించగా ఇప్పుడిప్పుడే పనులు జరుగుతున్నాయి. మేడారానికి వెళ్లే దారుల్లో పస్రా రోడ్డు అతి కీలకమైంది. 2 కోట్లతో మరమ్మతు చేపడుతుండగా ఆ పనుల్ని శుక్రవారం ప్రారంభించారు. నార్లాపూర్ నుంచి జరిగే భూపాలపల్లి రోడ్డు పనులు పూర్తి కావడం కష్టమే. జాతర సమీపిస్తున్న తరుణంలో పనులు ప్రారంభించడం వల్ల నాణ్యత లోపించనుంది. నార్లాపూర్ నుంచి భూపాలపల్లి రూట్‌లో చేస్తున్న రోడ్డు పనుల్లో నాణ్యతాప్రమాణాల్లేవు. ఆ పనులూ నత్తనడక సాగుతున్నాయి.



రంగులే మొదలెట్టలేదు...

మేడారం గద్దెల పరిసర ప్రాంతం, తోరణాల వద్ద, పస్రా, తాడ్వాయి రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన ఆర్చీలకు, భారీ గేట్లకు, అక్కడ నిర్మాణంలో ఉన్న బంగ్లాలకు రంగులు వేయాలి. కానీ, ఆ పని ఇంకా మొదలు పెట్టలేదు. ఇప్పుడు మొదలు పెట్టినా పూర్తవ్వటం కష్టం. ఈ పనికి ప్రభుత్వం 2.60 కోట్ల రూపాయలు కేటాయించింది.

కలెక్టర్ బదిలీతో మరింత జాప్యం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ మురళీ బదిలీతో పనుల్లో మరింత జాప్యం కనిపిస్తున్నది. ఆర్‌డబ్ల్యూ ఎస్, ఆర్‌అండ్‌బీ పనుల వేగం పెంచాలని ఈనెల రెండో తేదీన జరిగిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతుల జోలికెళ్లొదని ఆదేశించారు. రైతుల భూ ముల్లో ట్రంచ్ కొట్టడం, వారు భూముల్ని అద్దెకు ఇచ్చు కోకుండా అడ్డుకోవడం వంటివి చేయొద్దన్నారు. రోడ్ల వెంట భూముల్ని రైతులు అద్దెకు ఇచ్చుకునే అవకాశం కల్పించా లన్నారు. రాఘవపట్నం రోడ్డు 350 మీటర్లు బీటీ వేయాల ని, కన్నెపల్లి సారలమ్మ గుడి వద్ద ప్లాస్టిక్ రెడిమెడ్ టాయి లెట్స్ ఏర్పాటు చేయాలని, భారీగేట్ల ఏర్పాటు శరవేగంగా జరగాలని సూచించారు. ఈ సమీక్షకు మంత్రులు ఎవరూ హాజరు కాలేదు. పనుల్లో వేగం పెంచుతున్న క్రమంలోనే ఆయనను బదిలీ చేయడంతో నాలుగైదు రోజులుగా పనుల్లో జాప్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది.

11
హైదరాబాద్
ఆదివారం 7-1-2018
www.navatelangana.com
జోష్
నవతెలంగాణ



మాటల్లో మాధుర్యం



* ఒకసారి అన్న మాటలు మళ్లీ వెనక్కి తీసుకోలేం. మాట అనే ముందు ఒక క్షణం ఆలోచించి జాగ్రత్తగా మాట్లాడితే తర్వాత బాధ పడే పరిస్థితి ఉండదు.
* ఎదుటివారు ఏ చెబుతున్నారో అర్థం చేసుకుని మాట్లాడకపోతే గందరగోళానికి గురవుతారు. అర్థం కాకపోయినా అర్థమైనట్టు మాట్లాడితే చులకనవుతారు.
* ఎదుటి వారితో ఒక్కమాటైనా ప్రేమతో మాట్లాడితే ఆ రోజంతా వారు సంతోషంగా ఉంటారు.
* అవతలి వాళ్లు చెప్పేది నచ్చకపోతే అది తప్పని సున్నితంగా చెప్పండి. అంతే కానీ.. అనవసరమైన మాటలతో మనసును నొప్పించొద్దు. దీంతో బంధాలు తెగిపోతాయి
* నవ్వుతూ మాట్లాడండి. అవతలి వ్యక్తులకు మీరిచ్చే ప్రాధాన్యత అర్థమవుతుంది.
* అవతలి వాళ్లు చెప్పేది పూర్తిగా విని మాట్లాడాలి. అప్పుడు అపార్థాలకు తావు ఉండదు.
* ఎలాంటి రహస్యాలు లేకుండా మనసు విప్పి మాట్లాడితే అవతలి వారికి మీపై మరింత నమ్మకం, ప్రేమ పెరుగుతాయి. బంధాలు మరింత దృఢంగా మారుతాయి.
* అవసరానికి మించి మాట్లాడితే లేనిపోని సమస్యలు వస్తాయి. ఎనర్జీ వేస్ట్ కూడా.

కాపీ కొట్టాలంటే ఐక్యత కంపల్సరీ!

'మీరెప్పుడైనా గొడవ పడ్డారా..?' స్టూడెంట్స్‌ని అడిగాడు కొత్తగా వచ్చిన లెక్చరర్.
'మేమెప్పుడూ గొడవ పడలేదు. ఒకరినొకరం చాలా గౌరవించుకుంటాం..' చెప్పాడు ఓ స్టూడెంట్.
'వెరీగుడ్! ఇలాగే ఐక్యంగా ఉండాలి ' మెచ్చుకున్నాడు లెక్చరర్.
ఇంతలో మరో స్టూడెంట్ కల్పించుకుని
'మేం ఐక్యంగా ఉండటానికి ప్రధాన కారణం ఒకటి ఉంది సార్' అన్నాడు.
'ఏమిటి..?' ఆసక్తిగా అడిగాడు లెక్చరర్.
'ఎగ్జామ్స్ టైమ్‌లో ఎవరితో ఎవరికి అవసరం పడుతుందో, ఎవరి నుంచి ఎవరు కాపీ కొట్టాల్సి వస్తుందో చెప్పలేం. అందుకే.. ఎందుకైనా మంచిదని ఐక్యంగా ఉంటున్నాం' అసలు విషయం చెప్పాడు స్టూడెంట్.



Dwaraka

ఉన్నత లక్ష్యాలతోనే ఉత్తమ ఫలితాలు

- లక్ష్యాన్ని ఎవరైనా సాధించుకోవచ్చు. పిరికి వారు కూడా కష్టపడితే సుసాధ్యమే. అయితే.. వారు అందుకు ఉపక్రమించరు.
- ఆలోచనలు, నైపుణ్యాలు చాలామందిలో ఉంటాయి. కానీ.. వాటిని ఎంత బాగా ఆచరణలోకి తెచ్చామనే దానిపైనే విజయం ఆధారపడి ఉంటుంది.
- సరికొత్త ఆవిష్కరణలు చేయడానికి బలమైన సంకల్పం అవసరం. కృషి, తపన కూడా ఉండాలి. అంతేకాదు... చేస్తున్న పనిని మనది భావించడం ముఖ్యం.
- అవరోధాల్ని దాటి ఆలోచించగలిగితే విజయం సాధించే సామర్థ్యం అందరికీ ఉంటుంది. ఆచరణలో పెట్టడమే తరువాయి.
- విజయగర్వాన్ని ఎప్పుడూ తలకెక్కించుకోవద్దు.
- విజయం సాధించిన వారిని అనుకరించడం కంటే.. నీ లోపల దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి ప్రదర్శించడం ఉత్తమం.
- నువ్వు చేసే పని ఇతరుల కంటే భిన్నంగా ఉంటేనే విజయం సాధిస్తావు.. అందుకు మనల్ని మనం కొత్తగా ఆవిష్కరించుకోవడం తక్షణావసరం.
- గమ్యం చేరటంలో వచ్చే సమస్యలు స్పీడు బ్రేకర్లు లాంటి మాత్రమే . కానీ అడ్డుగోడలు కాదు. ఒక ఊరు నుంచి మరో ఊరుకు బస్సులో వెళ్తున్నప్పుడు బస్సు అనేకసార్లు మార్గమధ్యంలో ఆగినా చేరాల్సిన గమ్యానికి చేరుతుందనేది గుర్తు పెట్టుకోవాలి.
- సమస్యలు చూసి మీపై మీరు జాలి పడటం పొరపాటు. ఆత్మవిశ్వాసం అగ్గించుకోవటం ఇకా పెద్ద పొరపాటు.
- గతం గురించి తలచుకుని బాధపడకూడదు. బంగారంలాంటి భవిష్యత్తు గురించి ప్రణాళిక చేయాలి.
- వర్తమానం భవిష్యత్తుకు పునాది. గతం గురించి బాధపడటం అనవసరం. వర్తమానంలో ప్రతిక్షణాన్నీ మీ లక్ష్యం గురించి ఖర్చు పెట్టండి.



- కొన్ని విషయాల్లో రాజీపడి తీరాలి. కొన్ని విషయాల్లో లౌక్యంతో వ్యవహరించాలి.
- ఏ పని ముందు చేయాలనే విషయం నిర్ణయించుకున్న తర్వాత ఆ దాన్ని ఏకాగ్రతతో పూర్తి చేయాలి.
- రోజురోజుకూ మీలో వచ్చే ప్రగతిని మీరు హర్షించుకోవాలి.
- అవకాశాలు వాటంత అవే రావు. వాటిని కల్పించుకుని కైవసం చేసుకోవాలి.
- సమయం విలువైనది. ప్రతి క్షణం మీ లక్ష్యాన్ని గుర్తుంచుకోవాలి. ఎవరికైనా రోజుకు గంటలు మాత్రమే.
- విజయాలు సాధించిన వారందరూ కష్టపడి సాధన చేసిన వారే. కానీ విజయాలు వారికి ఎవరో తీసుకొచ్చి ఇవ్వలేదు.
- మిమ్మల్ని మీరు గౌరవించుకోవాలి. మీ మీద మీరు జాలి పడకూడదు. ఎవరి సానుభూతి గురించి ఎదురు చూడొద్దు. అది మీ ఆత్మవిశ్వాసాన్ని సన్నగిల్లేటట్టు చేస్తుంది.
- అనుకున్న పనిని వెంటనే ప్రారంభించాలి.
- సమస్యలను తలచుకుని బాధపడేకన్నా పరిష్కరించుకుని సంతోషపడటంలో ఎంతో తృప్తి, ఆనందం ఉన్నాయి.
- పనులను వాయిదా వేస్తే విలువైన సమయం వృథా అవుతుంది.
- ఎంత దూరం వెళ్లాలన్నా ఒక అడుగుతోనే ప్రయాణం మొదలవుతుందనేది మరచిపోవద్దు.
- పొగడ్తలకు పొంగిపోవడం, విమర్శలకు కుంగిపోవటం తప్పు.
- సమస్యకు బానిస కాకూడదు. నిరాశ, నిస్పృహలు సమస్యలకు సమాధానం కాదు.
- ఎదుటివారు మిమ్మల్ని చులకనగా చూసేలాగా ప్రవర్తించకూడదు. అది ఆత్మన్యూన్యతాభావానికి ం దారితీస్తుంది. విజయానికి ఆటంకం కలగజేస్తుంది.

లవ్వుకూ లెక్కలుంటాయ్!



ప్రేమలో పడితే.. అంతా అద్భుతమే. ప్రతిదీ కొత్తగానే అనిపిస్తుంది. లోకమంతా వింతగా కనిపిస్తుంది. జీవితం విలక్షణంగా మారిపోతుంది. ఏ భావాలు లేని వారికి సైతం భావుకత ఉప్పొంగుతుంది. మనసంతా మధుర కావ్యాలే. రెప్ప వాల్చినా, రెప్ప తెరిచినా కండ్ల ముందు ప్రేయసే కనిపిస్తుంది. అనుక్షణం ఆమె ఆలోచనలే. ప్రేమలో పడేముందు వర్ణం, వర్గం ఏమీ గుర్తురావు. ఒకవేళ గుర్తొచ్చినా.. అవేమీ అడ్డు కావనిపిస్తుంది. కట్టుబాట్లు.. సంప్రదాయాలు.. ఇవేవీ పట్టవు. తమ చుట్టూ ఎంతో మంది ఉన్నారన్న విషయమే స్ఫురించదు. అందరూ ఉన్నా.. ఏకాంత ప్రపంచంలోనే తాము ఉన్నామనుకుంటారు ప్రేమికులు.

ప్రేమకు అందంతో పనిలేదు. రూపాన్ని చూసి పుట్టే ప్రేమలు కొన్ని రోజుల్లోనే మటుమాయమవుతాయి. మనసును చూసి పుట్టే ప్రేమలు శాశ్వతంగా ఉంటాయి. ప్రేమించడానికి ఒక వ్యక్తి దొరికినప్పుడు జీవించడానికొక ఆశ కలుగుతుంది. అయితే.. ప్రేమించడం కన్నా ప్రేమించబడటమే ప్రధానం. ప్రేమను కలిగి ఉండటం సులువే. ప్రేమను పొందడం కష్టం. అంటే.. ప్రేమ ప్రయాసతో కూడుకున్నదన్న మాట. ముఖ్యంగా అమ్మాయిల మనసును దోచుకోవాలంటే అబ్బాయిలు కొన్ని అంశాలపై దృష్టి పెట్టాలంటున్నారు అధ్యయనకారులు. ప్రేమకూ కొన్ని పద్ధతులు ఉంటాయని, వాటిని పాటిస్తేనే సఫలమవుతారని అబ్బాయిలకు సూచిస్తున్నారు. అవేమిటో చూద్దాం...

- అమ్మాయి ముందు మంచివాడిగా నటించ కూడదు. చాలా మంచివాడిని అని చెప్పేవారి కన్నా తనలోని చిన్నపాటి తప్పులను నిజాయితీగా ఒప్పుకునేవారికే అమ్మాయిలు మనసిచ్చేస్తున్నారు.
- అందమైన అమ్మాయి కదా! మనల్ని మెచ్చు తుందా అన్న ఆందోళన, అనుమానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మనసులోకి రానివ్వకూ డదు. తాను దేవతలా ఉన్నాను కదా అని సల్మాన్‌ఖాన్, శింబు లాంటి



వాళ్లొచ్చి ఐ లవ్ యూ చెప్పా లని ఏ అమ్మా యీ కోరుకోదు. తాను చదువుకుంటున్న, ఉద్యో గం చేస్తున్న ప్రాంతంలో ఉండేవారినే ఇష్టపడుతుంది. సో.. అవకాశాన్ని వదులు కోవద్దు.
- అందమైన అమ్మాయిని చూసిన వెంటనే ఐ లవ్ యూ చెప్పాలని అనిపించొచ్చు. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ అలా చేయొద్దు. ఎందుకంటే ప్రేమన్నది సుదూర ప్రయాణం. అదే సమయంలో 'హృదయం'లో మురళిలా ఇష్టాన్ని వ్యక్తం చేయటాన్ని సాగదీయకూడదు. ఆ అమ్మాయి మననుంచి దూరమయ్యే పరిస్థితి కనిపిస్తే వెంటనే ప్రేమిస్తున్నానని చెప్పేయాలి.
- మన ప్రేమను అంగీకరిస్తే సరే. లేదంటే ప్రేమించమంటూ బలవంతపెట్టొద్దు. అలా చేస్తే ప్రేమ పుడుతుందో లేదో కానీ, నో చెప్పాక మనం మంచి అబ్బాయిగా ఉంటే వాళ్లకు మనపై ప్రేమ చిగురించే అవకాశాలున్నాయి.
- ఏ అమ్మాయికైనా చిన్నగానో, కాస్త ఎక్కువగానో అహంభావం ఉంటుంది. అదే అహంభావాన్ని మనం కూడా వారి వద్ద ప్రదర్శిస్తే.. వీడెవడో మనల్ని మించిపోయాడే అన్న భావన అమ్మాయిలు మనల్ని ప్రేమించేలా చేస్తుంది.
- తన ప్రేమికుడు బైక్, కారు, ఐఫోన్ లాంటి విలువైన వస్తువులు కలిగి ఉండాలని మంచి అమ్మాయిలు కోరుకోరు. ఒకవేళ అలాంటి భావాలున్న యువతి అయితే మన జీవితంలోకి ఆహ్వానించొద్దు.
- ఇంట్లో నాలుగు గోడల మధ్యే కాక సరదాగా బయట ప్రపంచం చుట్టి రావాలని అమ్మాయి లకు ఉంటుంది. ఆ అవకాశం మనం వారికి కల్పించాలి. ముఖ్యంగా రద్దీ ప్రాంతాలకు తీసుకెళ్లినప్పుడు వారి భద్రతపై మనం ఎలాంటి బాధ్యత కనబరుస్తున్నామన్న విష యాల్ని ఒక కంట కనిపెడు తుంటారు. అలాంటివారిని మనస్ఫూర్తిగా ప్రేమిస్తారు.
- గలగలా మాట్లా డే వారంటే అమ్మాయిలకు చాలా ఇష్టం. కొందరమ్మాయిలు హాస్య చతురతతో కూడిన మాటల్ని ఇష్టపడతారు. ఇం కొందరు సెంటిమెంట్ సంభాష ణల్ని. అంతెందుకు మన సుత్తిని కూడా కొందరు బాగా లైక్ చేస్తారు.
- అమ్మాయిలకు పదేపదే 'నేను నిన్ను ప్రేమి స్తున్నాను' అని చెబుతూ ఉండాలి. రోజుకు వంద సార్లైనా పర్వాలేదు. అదే మీ ప్రేమకు టానిక్ లాంటిది.
- ప్రియురాలి వద్ద ఎట్టి పరిస్థితుల్లోనూ మరో అమ్మాయి గురించి పాజిటివ్‌గా మాట్లాడటమో, వారిపై పొగడ్తలు కురిపించటమో చేయకండి. ఆ సమయాన్ని మన ఇష్టసఖిని పొగిడేందుకే కేటాయిస్తే మంచిది.

– చైతన్య

మొగ్గలు



నీ కళ్లల్లో నవ్వులు చూస్తేనే కదా
నా మనసంతా ఆనంద తాండవం
నీ చూపులు విరిసే అరవిందాలు

నీ పలుకుల్లో తీపిని రుచి చూస్తేనే కదా
నా హృదయమంతా తేనెల సోనలు
నీ చిలుక పలుకులు వెన్నెల జలపాతాలు

నీ అడుగుల్లో నాదాల సవ్వడిని వింటేనే కదా
నా గుండెలో సరిగమల రాగాలు
నీ పాదముద్రలు ప్రేమకు ద్వారాలు

నీ ప్రేమలో అనురాగం విరబూస్తేనే కదా
నా జీవితమంతా రసగంగ ప్రవాహం
నీ ఆత్మీయత అనుబంధానికి వారధి

నీ హృదయంలో కాస్త చోటిస్తేనే కదా
నా జీవితం ఎల్లప్పుడూ ధన్యమయ్యేది
నీ ఉచ్ఛ్వాసనిశ్వాసలే నాకు ఊపిరి

– డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్,
9032844017

ఇంట్లోంచే విధుల నిర్వహణ

ప్రపంచంలో ఏ దేశంలో ఉన్నా.. ఎవరితోనైనా క్షణాల్లో లావాదేవీలు నిర్వహించుకునే రోజులు ఇవి. ఇంటర్నెట్ ద్వారా ఇలాంటి సౌకర్యాలు ఇప్పుడు పుష్కలం. ఈ పరిస్థితి ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ఓ విప్లవం తీసుకొచ్చింది. ఇంట్లోనే కూర్చుని చేసే ఫ్రీలాన్సింగ్ ఉద్యోగాలు పెద్ద సంఖ్యలో అవకాశాలు కల్పిస్తున్నాయి. ఇష్టమొచ్చి నప్పుడు సౌకర్యంగా పనిచేసుకోవచ్చు. సంపాదించుకున్నంత సొమ్ము. ఈ ఫ్రీలాన్స్ ఉద్యోగాలు ఇప్పుడు అందర్నీ ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా 20 నుంచి 30 ఏళ్ల మధ్యనున్న యువకులు వీటిపై ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. ఈ ఫ్రీలాన్సింగ్ ద్వారా ఎమ్మెన్సీ కంపెనీల్లో పనిచేసే వారి కన్నా ఎక్కువ సంపాదించేవారు ఎంతో మంది ఉన్నారు. బాసుల బాధ లేకుండా, ఎనిమిది గంటల టైమ్ ఫ్రేమ్‌ను పట్టించుకోకుండా సంపాదించుకోవచ్చు.

ఫ్రీలాన్సింగ్‌లో చాలా ప్లస్ పాయింట్లున్నప్పటికీ.. కొంచెం కష్టమైన వ్యవహారమే. చాలా సందర్భాల్లో ఫ్రీలాన్సింగ్ అంత సులువు కాదు అని అనుకోకుండా ఉండలేరు. కచ్చితంగా ఇది సులువు కాదు. కానీ ముందస్తుగా కొంత సన్నద్ధమైతే ఫ్రీలాన్సింగ్ జర్నీ సాఫీగా సాగిపోతుంది. ఆ సంసిద్ధత ఎలా ఉండాలి..? ఫ్రీలాన్సింగ్ లో కెరీర్ ప్రారంభించాలనుకునే వారి కోసం కొన్ని సూచనలు, సలహాలు...

→ ఫ్రీలాన్సింగ్ అవకాశాల కోసం ప్రయత్నాలు ప్రారంభించే ముందు మీ నైపుణ్యాలేమిటో ముందుగా గుర్తించండి. ఒకే ఒక్క అంశంలో ఫ్రీలాన్సింగ్ చేయాలను కోకూడదు. ప్రధానమైన నైపుణ్యం కాక.. మిగతా ఏమేమి చేయలగరో గుర్తించండి. ఆ దిశలో కొత్త ప్రయత్నాలు చేయండి. అయితే ప్రతి పనినీ చేయాలని చూడకండి. ముందుగా నీ నైపుణ్యాలను చార్టులో రాసుకోండి. ఏదో ఒక్క పనే చేస్తానంటే మీ సేవలు పొందాలనుకునే కంపెనీ కానీ క్లైంట్ కానీ సీరియస్ గా తీసుకోకపోవచ్చు. అందుకే సెకండరీ స్కిల్స్ ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ ఉండండి.

→ మీ గురించి, మీ నైపుణ్యాల గురించి అందరికీ తెలియాలంటే దానికి సొంతంగా ఓ ఫోర్ట్ ఫోలియోను రూపొందించుకోవడమే మంచి మార్గం. దీని కోసం పెద్దగా శ్రమించాల్సిన అవసరం లేదు. ఓ ఫేస్ బుక్ పేజీ లేదా బ్లాగ్, అదీ కాకపోతే వర్కింగ్ సోషల్ నెట్ వర్క్స్ లాంటి బిహన్స్ లో ప్రొఫైల్ ను ఆకర్షణీయంగా సిద్ధం చేసుకోవాలి. ఇందులో స్కిల్స్ మొత్తాన్ని ప్రజెంట్ చేసేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇది మీక పనితనాన్ని ప్రొజెక్ట్ చేసేలా ఉండాలి. దీన్ని అందరి దృష్టికి తీసుకెళ్లేలా చేయగలిగితే అవకాశాలు పొందగలగడం పెద్ద కష్టమేం కాదు.

→ మొట్టమొదట ఈ ఫ్రీలాన్సింగ్ కెరీర్ ద్వారా మీరేమి ఆశిస్తున్నారో స్పష్టత తెచ్చుకోండి. అనుభవం, డబ్బు, పరిచయాలు వీటిలో మీ టార్గెట్ ఏమిటి..?. ఒకసారి నిర్ణయించుకున్న తర్వాత పని కోసం ప్రయత్నాలు చేయండి. అయితే పని ప్రారంభించే ముందు మీరు క్లారిటీ తెచ్చుకోవాల్సిన విషయం ఒకటుంది. మీరు ఎలా ఆ పనికి న్యాయం చేయగలరనుకుంటున్నారు..? అనేదానిపై మీకు స్పష్టమైన అవగాహన ఉండాలి. మీరు వారంలో ఎన్ని రోజులు, ఎన్ని



గంటలు ఫ్రీలాన్సింగ్ జాబ్ కోసం సమయాన్ని కేటాయించగలరు..?

→ ఎలాంటి క్లైంట్లతో కలసి పని చేయాలనుకుంటున్నారు..? ఒకే సమయంలో ఎంత మంది క్లైంట్లను మీరు హ్యాండిల్ చేయగలరు..? క్లైంట్స్ తో మీరు ఎలాంటి కమ్యూనికేషన్ మెయింటెయిన్ చేయాలనుకుంటున్నారు..? అనే అంశాలపై మీరు అవగాహనకు రావాలి.

→ మీరు చేస్తున్న ఫ్రీలాన్సింగ్ కోసం ఆశిస్తున్న పారితోషికం విషయంలో ప్రాక్టికల్ గా ఉండాలి. మీరు చేస్తున్న పని విభాగంలో ప్రస్తుతం ఎంత డిమాండ్ ఉంది. ఎంత పనిని ఎంత చెల్లిస్తున్నారనే అంశాలపై పూర్తిగా అవగాహన తెచ్చుకోవాలి. ఆ తర్వాత క్లైంట్లతో పారితోషికంగా విషయం మీద చర్చలు జరపాలి.

→ ఇప్పటి వరకు మీరు ఏం చేయాలో.. ఎలా చేయాలో..? క్లారిటీకి వచ్చి ఉంటారు. ఇప్పుడిక ఫ్రీలాన్సింగ్ పని ఇచ్చే క్లైంట్లను పట్టుకోవాలి. పొటెన్షియన్ క్లైంట్లు ప్రతి చోటా ఉంటారు. గూగుల్‌లో లేదా సోషల్ మీడియాలో క్లైంట్లను మనం గుర్తించొచ్చు. మీరు హైలెట్ చేసుకున్న నైపుణ్యాన్ని, పనిని ప్రస్తావిస్తూ వీలైనంత మంది నమ్మకమైన క్లైంట్స్ కు సమాచారం వెళ్లేలా ప్రయత్నాలు చేయండి. వారిలో ఫ్రీలాన్సింగ్ వర్క్ అవసరమైనవారు మిమ్మల్ని కచ్చితంగా కాంటాక్ట్ చేస్తారు. మీకు చాన్సులు వేగంగా రావడానికి అవకాశం ఉంటుంది. కానీ ఇందులో గుర్తించుకోవాల్సిన విషయం ఏమిటంటే.. క్లైంట్లకు ఎప్పుడూ స్పామ్ మెసెజ్‌లు పంపకూడదు.

→ కొంచెం ముందైనా, లేటైనా మీ ప్రొఫైల్స్ తగ్గట్లుగా ఫ్రీలాన్సింగ్ జాబ్ ఆఫర్లు వస్తాయి. వారిలో నుంచి మీరు క్లైంట్లను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. క్లైంట్ రిక్వైర్ మెంట్ కు తగ్గట్లుగా మొదటగా మీకు పని ఎసైన్ చేసేటప్పుడు కచ్చితంగా కొన్ని విషయాలు అడగాలని గుర్తు పెట్టుకోండి. మొదటి వర్క్‌తో పాటు సర్వీస్ నిబంధనలు పంపాలని అడగండి. పారితోషికం చెల్లింపు విధివిధానాలు. డిపాజిట్స్ అండ్ పేమెంట్ టైమ్ లైన్స్, పూర్తయిన పనికి కాపీరైట్ నిబంధనలు, పరస్పర హక్కులు, బాధ్యతలు తదిదర అంశాలు కచ్చితంగా ఉండేలా జాగ్రత్త పడాలి.

→ అదే సమయంలో ఏ పని అయినా సరే ఉచితంగా మాత్రం చేయొద్దు. మీరు ప్రతిఫలం లేకుండా పని చేయడానికి ఉత్సాహం చూపిస్తున్నప్పటికీ.. ఆ భావన మాత్రం క్లైంట్లకు వెళ్లకుండా జాగ్రత్తపడాలి. లేకపోతే పేమెంట్ విషయంలో క్రాంప్రమైజ్ అవుతారనే సంకేతాలు క్లైంట్లకు వెళతాయి. దాంతో దీర్ఘకాలంలో మీ శ్రమకు తగ్గిన ఫలితం రాదు.

→ ఫ్రీలాన్సింగ్ అనేది దాదాపుగా ఒకే వ్యక్తి నడుపుతున్న వ్యాపారం లాంటిది. ఇది ఒక రకంగా సొంత ఎంటాప్రెన్యూర్ షిప్. దీన్ని మీరు అల్లాటప్పగా తీసుకుంటే మొత్తానికే మోసం వచ్చే అవకాశం ఉంది. ప్రతి క్లైయింట్ ని సీరియస్‌గా అప్రోచ్ అవండి. వైఫల్యాలకు, విమర్శలకు సిద్ధంగా ఉండండి. మీ పనిని మీరు చేస్తున్న రంగంలోని వ్యక్తులు నమ్మే వరకూ ఓపికతో ఉండండి.

– సేకరణ: సోమేష్, జగిత్యాల

ఆ క్షణం!!



ఆ క్షణం!
సీతాకోక చిలుక
లేత రెక్కలపై
రంగుల వలయంలా
మారిపోతాను!

పచ్చగా పరుచుకున్న
పచ్చిక కొసన
నీరెండకు మెరిసే
తుషార బిందువునౌతాను!

సముద్ర తీరంలో
ఆటుపోట్లకు ఎగిసిపడే
సమున్నత
కెరటమౌతాను!

ముసురుతున్న
చిక్కని చీకట్లలో
సన్నని వెలుగు
రేఖనౌతాను!


చుక్కల పూలను
తలలో పెట్టుకున్న
ఆనందపు
ఆకాశాన్నౌతాను!

నీ అనంతమైన
అద్భుతాలింగనంలో
నులివెచ్చని
నిశ్వాసమౌతాను!

–వెన్నెల సత్యం,
9440032210



హార్దిక్ పాండ్య అర్ధసెంచరీ అభివాదం



సెషన్ల వారీగా
భారత్ బ్యాటింగ్
ఉదయం సెషన్
ఓవర్లు : 25
పరుగులు : 48
వికెట్లు : 01
లంచ్ తర్వాత
ఓవర్లు : 25
పరుగులు : 109
వికెట్లు : 03
టీ తర్వాత
ఓవర్లు : 12
పరుగులు : 24
వికెట్లు : 03
సఫారీ బ్యాటింగ్
ఓవర్లు :20
పరుగులు :65
వికెట్లు : 02

హార్దిక్ పాండ్య
93
14 X4, 1X6
4-0-17-2

స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్ పుజారా (26), రోహిత్ శర్మ (11) నిష్క్రమించారు. జట్టు స్కోరు 76/5. సాహా (0) సైతం పెవిలియన్ చేరాడు. ఈ దశలో టీమ్ ఇండియా వంద పరుగులైనా చేస్తుందా అనిపించింది. కానీ హార్దిక్ పాండ్య (93) హీరోయిక్స్ టీమ్ ఇండియాను రేసులో నిలిపాయి. ప్రతికూల పరిస్థితుల్లో సహజశైలిలో దూకుడుగా ఆడేసిన పాండ్య 95 బంతుల్లోనే 93 పరుగులు చేశాడు. భారత్ తొలి ఇన్నింగ్స్ లోటును 77 పరుగులకు కుదించగలిగాడు. దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో రెచ్చిపోతుంది. ఓపెనర్లు ఎల్గార్ (25), మర్క్‌రం (34) వేగంగా ఆడుతున్నారు. దీంతో సఫారీ ఆధిక్యం సెంచరీ దాటి పరుగులు పెడుతోంది. ఇంకా ఒక్క వికెట్టూ పడలేదు. ఇప్పుడూ పాండ్యనే ఆదుకున్నాడు. వరుస ఓవర్లలో ఓపెనర్లను అవుట్ చేశాడు. కాస్త ఊరట కల్పించాడు. అయినా, దక్షిణాఫ్రికా 142 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఆమ్లా, డుప్లెసిస్, డివిలియర్స్ ఉండనే ఉన్నారు. కేప్‌టౌన్ క్లియర్‌గా సఫారీ పక్షమే అని తెలుస్తోన్నా.. నేడు మనోళ్లు పోరాడితే మలుపు తిరిగే అవకాశం ఎక్కువే. కేప్‌టౌన్ దారెటో నేడు తేలిపోనున్నది.

పాండ్య పోరాడినా..

కేప్‌టౌన్‌పై దక్షిణాఫ్రికా ఆధిపత్యం

- సఫారీ ప్రస్తుత ఆధిక్యం 142
- భారత్ తొలి ఇన్నింగ్స్ 209 ఆలౌట్
- దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 65/2
- తొలి టెస్టు రెండో రోజు

నవతెలంగాణ-కేప్‌టౌన్

హార్దిక్ పాండ్య ఆల్‌రౌండ్ ప్రదర్శనతో కేప్‌టౌన్ టెస్టులో టీమ్ ఇండియా ఆశలు ఇంకా ఆవిరి కాలేదు!. క్లిష్ట పరిస్థితుల్లో బ్యాట్స్‌మన్ 95 బంతుల్లో 93 పరుగులు చేసిన పాండ్య.. బౌలర్‌గా రెండు వికెట్లు కూల్చి అదుర్స్ అనిపించాడు. పాండ్య మెరుపులు ఆకట్టుకున్నా, టీమ్ ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 209 పరుగులకే కుప్పకూలింది. 77 పరుగుల తొలి ఇన్నింగ్స్ సమర్పించుకున్నది. ఇక దక్షిణాఫ్రికాను రెండో ఇన్నింగ్స్‌లో కట్టడి చేయలేని బౌలర్లు ధారాళంగా పరుగులు ఇచ్చారు. ఓపెనర్లు మర్క్‌రం (34), ఎల్గార్ (25) సఫారీ ఆధిక్యాన్ని వేగంగా మెరుగుపర్చారు. దీంతో సఫారీ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 65/2తో కొనసాగుతోంది. ఆమ్లా (4), రబాడ (2) క్రీజులో అజేయంగా కొనసాగుతున్నారు. ఈ పిచ్‌పై 200 పైచిలుకు లక్ష్యాన్ని ఛేదించటం కష్టసాధ్యం. కాబట్టి రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికాను కట్టడి చేయటంపైనే టీమ్ ఇండియా ఆశలు ఆధారపడి ఉన్నాయి.

సెషన్ 1, భారత్ 76/4 : పుజారా క్లాస్

టాప్ ఆర్డర్‌ను కోల్పోయిన స్థితిలో ఒత్తిడిలో పడిన టీమ్ ఇండియా.. ఉదయం సెషన్లో ఎదురొడ్డింది. రోహిత్ శర్మ (11, 59 బంతుల్లో 1 ఫోర్), చటేశ్వర్ పుజారా (26, 92 బంతుల్లో 5 ఫోర్లు) డ్రింక్స్ విరామం వరకూ సఫారీ పేసర్లను నిలువరించారు. ముఖ్యంగా పుజారా బ్యాటింగ్ శైలితో ఆకట్టుకున్నాడు. అవుట్‌సైడ్ ఆఫ్ బంతుల్ని పూర్తిగా వదిలేసిన పుజారా, పరుగుల కోసం సురక్షిత బంతుల కోసం ఎదురుచూశాడు. స్లిప్స్ క్యాచ్ ముప్పు తెలిసిన పుజారా.. ఆఫ్‌సైడ్ పరుగులు చేయడానికి సైతం ఇష్టపడలేదు. మరో ఎండ్‌లో రోహిత్ శర్మ సైతం సహనం ప్రదర్శించాడు. కానీ డ్రింక్స్ విరామం తర్వాత రోహిత్ వికెట్ల ముందు దొరికిపోయాడు. రబాడా అతడి ఇన్నింగ్స్‌కు శుభం కార్డు వేశాడు. ఈ దశలో అశ్విన్(12, 31 బంతుల్లో 2 ఫోర్లు) జతకట్టిన పుజారా లంచ్ లోపు మరో వికెట్ పడకుండా జాగ్రత్త వహించాడు. సఫారీ సీమర్లు అశ్విన్‌కు భీకర బౌన్సర్లతో స్వాగతం పలికినా.. చెన్నై చిన్నోడు ఓపిగ్గా ఆడాడు. వికెట్లు నిలుపుకోవటంపైనే దృష్టి పెట్టిన భారత్ ఈ సెషన్లో 48 పరుగులే చేసింది.

సెషన్ 2, భారత్ 185/7 : పాండ్య ఫటాఫట్

లంచ్ తర్వాత తొలి బంతికే భారత్‌కు కోలుకోలేని దెబ్బ. క్రీజులో పాతుకుపోయిన పుజారా స్లిప్స్‌లో దొరికిపోయాడు. ఫిలాండర్ మిస్టర్ డిఫెన్స్‌ను వెనక్కి పంపాడు. దీంతో 76/5తో భారత్ కష్టాల్లో పడింది. లోయర్ ఆర్డర్ ఆడినా.. వంద పరుగులు చేస్తారా అనే ఆందోళన మొదలైంది. సాహా (0) డకౌట్ అయ్యాడు. కానీ హార్దిక్ పాండ్య (93, 95 బంతుల్లో 14 ఫోర్లు, 1 సిక్స్) తనదైన శైలి ఇన్నింగ్స్‌తో రెచ్చిపోయాడు. తొలి రోజు డివిలియర్స్ ఆడినట్టే విజృంభించిన పాండ్య.. వన్డే మాదిరి రెచ్చిపోయాడు. బౌండరీలతో చెలరేగాడు. మరో ఎండ్‌లో భువనేశ్వర్ కుమార్ (25, 86 బంతుల్లో 4 ఫోర్లు) చక్కటి సహకారం అందించాడు. ధనాధన్ ఆటకే మొగ్గుచూపిన పాండ్య పది ఫోర్లతో 46 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. ఓ ఎండ్‌లో పాండ్య ధనాధన్ ఆడేస్తే, మరో ఎండ్‌లో భువీ స్ట్రయిక్ రొటేట్ చేశాడు. పాండ్య ఎదురుదాడితో సఫారీ బౌలర్లు చిన్నబోయారు.



పాండ్య, భువిలు ఎనిమిదో వికెట్‌కు ఏకంగా 99 పరుగుల భాగస్వామ్యం నమోదు చేశారు. వీరిద్దరి మెరుపులతో భారత్ తొలి ఇన్నింగ్స్ అంతరాన్ని గణనీయంగా తగ్గించగల్గింది.

సెషన్ 3 , దక్షిణాఫ్రికా 65/2 : పాండ్య మెరిసెన్..

పూర్తిగా ప్రతికూల పరిస్థితుల్లో స్పెషల్ ఇన్నింగ్స్‌తో మెరిసిన పాండ్య.. సెంచరీకి చేరువలో అవుటయ్యాడు. భువీ వికెట్ కీపర్‌గా దొరికిపోగా, పాండ్య సైతం అక్కడే అవుటయ్యాడు. షమి (4), బుమ్రా (2) ఆఖరి వికెట్ భాగస్వామ్యం ఎంతోసేపు నిలువలేదు. దీంతో భారత్ 209 పరుగులకు కుప్పకూలింది. దక్షిణాఫ్రికా 77 పరుగుల ఆధిక్యం సంపాదించింది.

మూడో సెషన్లో 20 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా ఆధిక్యాన్ని వడివడిగా పెంచుకున్నది. ఓపెనర్లు మర్క్‌రం (34, 43 బంతుల్లో 7 ఫోర్లు), డీన్ ఎల్గార్ (25, 54 బంతుల్లో 4 ఫోర్లు) దూకుడుగా ఆడారు. ఇన్నింగ్స్ రెండో ఓవర్లో ఎల్గార్ మిడ్ ఆన్‌లో ఇచ్చిన క్యాచ్‌ను పరుగెడుతూ ప్రయత్నించిన షమి.. సక్సెస్ కాలేదు. దీంతో డకౌట్ అయ్యే ప్రమాదం నుంచి ఎల్గార్ బయటపడ్డాడు. తర్వాత ఎల్గార్ నాల్గు ఫోర్లు బాదాడు. మరో వైపు మర్క్‌రం సైతం ఏడు ఫోర్లతో ధనాధన్ అనిపించాడు. 52/0తో దూసుకెళ్తోన్న దక్షిణాఫ్రికాను.. మళ్లీ హార్దిక్ పాండ్య వెనక్కి లాగాడు. స్వల్ప విరామంలో ఓపెనర్లు ఇద్దరినీ వెనక్కి పంపాడు. మర్క్‌రం పాయింట్ వద్ద భువికి చిక్కగా, ఎల్గార్ వికెట్ కీపర్‌కు దొరికిపోయాడు. దీంతో దక్షిణాఫ్రికా 59/2తో వెనక్కి తగ్గింది!. ఆఖర్లో నైట్‌వాచ్‌మన్ రబాడ (2), ఆమ్లా (4)లు మరో వికెట్ పడనీయలేదు.

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ : 286 ఆలౌట్

భారత్ తొలి ఇన్నింగ్స్ : మురళీ విజయ్ (సి) ఎల్గార్ (బి) ఫిలాండర్ 1, ధావన్ (సి,బి) స్టెయిన్ 16, చటేశ్వర్ పుజారా (సి) డుప్లెసిస్ (బి) ఫిలాండర్ 26, విరాట్ కోహ్లి (సి) డికాక్ (బి) మోర్కెల్ 5, రోహిత్ శర్మ (ఎల్బీ) రబాడ 11, అశ్విన్ (సి) డికాక్ (బి) ఫిలాండర్ 12, హార్దిక్ పాండ్య (సి) డికాక్ (బి) రబాడ 93, భువనేశ్వర్ (సి) డికాక్ (బి) మోర్కెల్ 25, మహ్మద్ షమి నాటౌట్ 4, బుమ్రా (సి) ఎల్గార్ (బి) రబాడ 2, ఎక్స్‌ట్రాలు : 14, **మొత్తం : (73.4 ఓవర్లలో ఆలౌట్) 209.**

వికెట్ల పతనం : 1-16, 2-18, 3-27, 4-57, 5-76, 6-81, 7-92, 8-191, 9-199, 10-209.

బౌలింగ్ : ఫిలాండర్ 14.3-8-33-3, డెల్ స్టెయిన్ 17.3-6-51-2, మోర్కెల్ 19-6-57-2, రబాడ 16.4-4-34-3, కేశవ్ 6-0-20-0.

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ : మర్క్‌రం (సి) భువనేశ్వర్ (బి) హార్దిక్ పాండ్య 34, డీన్ ఎల్గార్ (సి) సాహా (బి) హార్దిక్ పాండ్య 25, రబాడా నాటౌట్ 2, హషీమ్ ఆమ్లా నాటౌట్ 4, ఎక్స్‌ట్రాలు : 0, **మొత్తం : (20 ఓవర్లలో 2 వికెట్లకు) 65.**

బౌలింగ్ : భువనేశ్వర్ 6-3-16-0, బుమ్రా 4-0-14-0, మహ్మద్ షమి 5-1-15-0, హార్దిక్ పాండ్య 4-0-17-2, అశ్విన్ 1-0-3-0.



హోప్‌మన్ కప్ స్విస్ వశం

పెర్త్ : టెన్నిస్ యోధుడు, స్విస్ సూపర్‌స్టార్ రోజర్ ఫెడరర్ అజేయ రికార్డు స్విట్జర్లాండ్‌కు మూడోసారి హోప్‌మన్ కప్‌ను అందించింది. జర్మనీతో జరిగిన ఫైనల్లో ఫెడరర్ సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో మెరిశాడు. దీంతో 2-1తో జర్మనీని ఓడించి స్విట్జర్లాండ్ హోప్‌మన్‌ను సొంతం చేసుకున్నది. నిర్ణయాత్మక ఫాస్ట్4 మిక్స్‌డ్ డబుల్స్‌లో రోజర్ ఫెడరర్, బెలిందా బెన్సిక్ జోడీ 4(5)-3(3), 4-2తో ఎంజెలికా కెర్బర్, జ్వెరెవ్ జంటను వరుస సెట్లలో ఓడించారు. సింగిల్స్‌లో తొలి సెట్ కోల్పోయినా ఫెడరర్ పంజుకున్నాడు. 6-7(4), 6-0, 6-2తో అలెగ్జాండర్ జ్వెరెవ్‌పై గెలుపొందాడు. కానీ మహిళల సింగిల్స్‌లో కెర్బర్ 6-4, 6-1తో బెన్సిక్‌ను ఓడించింది. దీంతో సీన్ మిక్స్‌డ్ డబుల్స్‌కు మారింది. మిక్స్‌డ్ పోరులో ఫెడరర్ జంటగా బెన్సిక్ ఆకట్టుకున్నది. 2001లో మార్టినా హింగిస్ జంటగా హోప్‌మన్ నెగ్గిన ఫెడరర్ మళ్లీ సాధించటం ఇదే తొలిసారి. ఇక 1995లో బెకర్, హుబర్‌లు హోప్‌మన్ అందించిన తర్వాత జర్మనీకి మరో హోప్‌మన్ కప్ దక్కలేదు.



మరో వివాదంలో గంభీర్?

న్యూఢిల్లీ : జాతీయ జట్టుకు దూరమైన సీనియర్ ఓపెనర్ గౌతం గంభీర్ ఢిల్లీ క్రికెట్ వార్తల్లో కేంద్ర బిందువుగా నిలుస్తూనే ఉన్నాడు. ఐపీఎల్ ఫ్రాంఛైజీ కోల్‌కత నైట్‌రైడర్స్‌కు తిరుగులేని విజయాలు అందించినా, కెకెఆర్ సైతం ఇటీవల రిటెయిన్ పాలసీలో గంభీర్‌ను వదులుకున్నది. నిరుడు కోచ్ భాస్కర్‌తో వివాదం విషయంలో కెప్టెన్సీ వదులుకున్న గౌతం గంభీర్.. ఈ రంజీ సీజన్‌లో జట్టుతో అంటీముట్టనట్టుగా వ్యవహరించినట్టు సమాచారం. సొంతంగా ప్రయాణించటం, మ్యాచ్‌కు ముందు రోజు మాత్రమే జట్టుతో చేరటం, మ్యాచ్ ముగియగానే తనదారిన తను వెళ్లిపోవటం గంభీర్‌కు అలవాటైందని ఢిల్లీ క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ సీజన్‌లో రంజీ ఫైనల్స్‌కు చేరుకున్న ఢిల్లీకి 683 పరుగులతో గంభీర్ అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మన్. విదర్భతో ఫైనల్లో ఓడిన తర్వాత జట్టులో లుకలుకలు వెన్వెంటనే బయటపడ్డాయి. దీంతో జనవరి 9 నుంచి ఆరంభం కానున్న సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీకి గంభీర్‌ను జట్టులోకి తీసుకోవటం ప్రశ్నార్థకంగా మారింది. సెలక్షన్ కమిటీ రూపొందించిన జాబితాలో గంభీర్ పేరు ప్రశ్నార్థకంతో ఉందని సమాచారం. ఈ జాబితాను హైకోర్టు నియమిత పాలకుడు జస్టిస్ విక్రంజిత్ సింగ్‌కు సమర్పించారు. తుది జట్టు ప్రకటించే ముందు గంభీర్ విషయమై అతడితో జస్టిస్ విక్రంజిత్ మాట్లాడనున్నాడని తెలుస్తోంది.

క్రికెట్ తర్వాత కబడ్డే!

స్టార్ ఆటగాడు పర్దీప్ నర్వాల్



నవతెలంగాణ-హైదరాబాద్ : పట్నాకు ముచ్చటగా మూడు ప్రొ కబడ్డీ టైటిళ్లు అందించిన తిరుగులేని సారథి, స్టార్ రైయిడర్ పర్దీప్ నర్వాల్. జాతీయ సీనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్స్‌లో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన పర్దీప్ నర్వాల్.. శనివారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (నాచారం)లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నాడు. డీపీఎల్ కబడ్డీ అకాడమీ ఆరంభించి, స్కూల్ చిన్నారులతో సరదాగా కబడ్డీ ఆడిన పర్దీప్ అనంతరం మీడియాతో మాట్లాడాడు. 'ప్రేక్షకాదరణలో క్రికెట్ తర్వాతి స్థానం కబడ్డీదే. భారత కబడ్డీకి ఇది మంచి పరిణామం. ఒలింపిక్స్‌లో కబడ్డీని చేర్చితే తొలి స్వర్ణం భారత్ సొంతం అవుతుంది' అని అన్నాడు. ఆల్‌రౌండర్ దీపక్ నివాస్ హుడా, నితిన్ తోమర్‌లు సైతం కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉస్మాన్ ఖవాజా 171



మిచెల్ మార్ష్ 63*
షాన్ మార్ష్ 98*

మెరిసిన మార్ష్ సోదరులు
ఇంగ్లాండ్‌తో ఆఖరి యాషెస్ టెస్టు

సిడ్నీ : ఉస్మాన్ ఖవాజా (171, 381 బంతుల్లో 18 ఫోర్లు, 1 సిక్స్) తొలి యాషెస్ శతకంతో సిడ్నీ టెస్టుపై ఆస్ట్రేలియా పట్టు బిగించింది. కెప్టెన్ స్టీవ్ స్మిత్ (83) అర్ధ సెంచరీతో మెరువగా, ఖవాజా జోరు కొనసాగించాడు. వీరిద్దరి మెరుపులతో ఆస్ట్రేలియా భారీ స్కోరుపై కన్నేసింది. కానీ ఆఖరి సెషన్లో మార్ష్ సోదరుల మెరుపులు ఆసీస్‌ను ఆధిక్యంలో నిలబెట్టాయి. షాన్ మార్ష్ (98 నాటౌట్, 207 బంతుల్లో 10 ఫోర్లు), మిచెల్ మార్ష్ (63 నాటౌట్, 87 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) వేగంగా పరుగులు రాబట్టారు. షాన్ మార్ష్ పది ఫోర్లతో చెలరేగగా, సోదరుడు మిచెల్ మార్ష్ తొమ్మిది ఫోర్లు సహా రెండు సిక్సర్లు సంధించాడు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 479/4తో కొనసాగుతోంది. ఇప్పటికే 133 పరుగుల ఆధిక్యంలో ఉన్న ఆస్ట్రేలియా నేడు మరింత భారీ స్కోరు సాధించి ఇన్నింగ్స్ విజయం కోసం వెళ్లనున్నది!. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 346 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

చెన్నై బ్యాటింగ్ కోచ్ హస్సీ



చెన్నై : ఆస్ట్రేలియా మిస్టర్ పర్‌ఫెక్ట్ మైకల్ హస్సీ ఐపీఎల్ ఫ్రాంఛైజీ చెన్నై సూపర్ కింగ్స్‌తో ముచ్చటగా మూడో ఇన్నింగ్స్‌కు సిద్ధమయ్యాడు. ఐపీఎల్ 11వ సీజన్‌కు హస్సీని బ్యాటింగ్ కోచ్‌గా నియమిస్తూ సీఎస్‌కే డైరెక్టర్ జార్జ్ ప్రకటన విడుదల చేశారు. 2008-13 వరకూ చెన్నై ఆటగాడిగా కొనసాగిన హస్సీ 2014లో ముంబయి ఇండియన్స్ తరపున ఆడాడు. తిరిగి 2015లో చెన్నైకి ఆడాడు. ఐపీఎల్‌లో 64 మ్యాచుల్లో 40.98 సగటుతో హస్సీ 2213 పరుగులు చేశాడు. సీఎస్‌కే ఆటగాళ్లతో సత్సంబంధాలు, వర్ధమాన క్రికెటర్లతో మమేకం కాగల వ్యక్తిత్వం హస్సీని బ్యాటింగ్ కోచ్‌గా ఎంచుకునేలా చేశాయని సీఎస్‌కే వెల్లడించింది.

27 నుంచి టీపీఎల్

షెడ్యూల్ విడుదల చేసిన దత్తాత్రేయ

నవతెలంగాణ-హైదరాబాద్ : ఆల్ స్టార్స్ తెలంగాణ స్టేట్ ప్రీమియర్ లీగ్ జనవరి 27 నుంచి ఆరంభం కానున్నది. రాష్ట్ర వ్యాప్తంగా 8 జట్లు పాల్గొంటున్న టీపీఎల్ మ్యాచులు ఎల్బీ స్టేడియంలో జరుగనున్నాయి. కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ శనివారం జరిగిన కార్యక్రమంలో టీపీఎల్ షెడ్యూల్ విడుదల చేశారు. గ్రామీణ ప్రాంత క్రికెటర్ల ప్రతిభ వెలికితీసేందుకు టీపీఎల్ దోహదం చేస్తుందని టీసీఏ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అవినీతిమయంగా మారిందని విమర్శించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.